
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మేయర్ ఎన్నికకు ముందే ఆప్‌కు షాక్ 5
అందమైన చేతిరాతకోసం టి-శాట్ ప్రత్యేక పాఠాలు 6

మహబూబ్‌నగర్ fb.com/vaartha

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-2-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 15 పేజీలు: 10+4 వెల: 8.00




# బిసి కులగణనపై దేశవ్యాప్త ఉద్యమం



## మార్చి 10న ఇండియా కూటమి ఎంపీలతో పార్లమెంటులో నిరసన

### కూటమి సిఎంలతో సమన్వయ బాధ్యత.. ఢిల్లీలో రాహుల్‌తో చర్చలు జరిపిన సిఎం రేవంత్

### త్వరలో రెండు బహిరంగ సభలు జరిపే యోచన.. ఒక కార్యక్రమానికి రాహుల్‌కు ఆహ్వానం


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి15:** బీసీ కులగణనపై దేశ వ్యాప్త ఉద్యమం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు వ్యూహం రూపొందిస్తోంది. మార్చి 10న ఇండియా కూటమి ఎంపీలతో పార్లమెంట్‌లో నిరసన తెలపాలని ప్రణాళిక రూపొందిస్తుంది.ఇండియా కూటమి సిఎంలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోఆర్డినేషన్ చేసే బాధ్యత అప్పగించారు. ఇండియా కూటమి నేతలతో రాహుల్‌గాంధీ సంప్రదింపులు జరుపున్నారు. దిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఎఐసిసి అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. 10 జనపథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో శనివారం గంటపాటు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీసీ కులగణపై దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టాలనే చర్చ జరిగింది. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పాలనా పరమైన అంశాలను రాహుల్‌గాంధీకి రేవంత్‌రెడ్డి వివరించారు. ముఖ్యంగా కులగణన, ఎస్సీ వర్గీకరణ తీర్మానాలకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో వీటికి సంబంధించి త్వరలోనే రెండు బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ సభలలో ఒక సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. కులగణన సర్వే ఆధారంగా రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వడంపై రాహుల్‌కు రేవంత్‌రెడ్డి వివరించినట్లు తెలుస్తోంది. ఖాళీకానున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక,మంత్రివర్గ విస్తరణ,పిసిసి కార్యవర్గ కూర్పు,నామినేటెడ్ పోస్టుల భర్తీ,స్థానిక సంస్థల ఎన్నికల వంటి విషయాలపై రాహుల్‌తో సిఎం చర్చించినట్లు సమాచారం. కాగా, తెలంగాణ కాంగ్రెస్‌కు >>2

## మోడీ పుట్టుకతో బిసి కాదనే అన్నా 2

కులగణన అమలుకు కమిటీ

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం

ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్



# భయపెడుతున్న ఎండలు

### గత రికార్డులు బద్దలయ్యేలా మండుతాయంటున్న వాతావరణ శాఖ

### రంగారెడ్డి, నల్లగొండ సహా పలు జిల్లాలలో ఇప్పటికే 37$^{0}$ దాటిన ఉష్ణోగ్రతలు

### మార్చి నెలలో మరింత ముదిరే సూచన

**హైదరాబాద్, ఫిబ్రవరి ,15 : ప్రభాత వార్త:** వాతావరణంలో మార్పులు కారణంగా వేసవి రాకముందే ఈ సంవత్సరం ఫిబ్రరిలోనే భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇదే అంశాన్ని భారత వారతావరణశాఖ కూడా పేర్కొంది. ఈవేసవిలో పాతరికార్డులు తిరగరాసే అవకాశం ఉందని ఐఎండీ (భారత వాతావరణశాఖ)అంచనా వేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మార్చి 15 నుంచి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే.. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగేఅవకాశం ఉందని.. బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే తెలంగాణలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే భాస్కరుడు తనప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 11 గంటలు దాటకముందే ఎండవేడిమి మొదలైంది. గత వారం >>2

## నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు 2

# హైదరాబాద్‌కు 10 వేలకోట్లు

### మూసి పునరుజ్జీవంపై ముందుకే..

### ప్రపంచానికే ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

### గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌లో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి15:** బిల్డర్స్, డెవలపర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన పౌరులుగా చూస్తుంది, వారు సంపద సృష్టికర్తలు, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు వారికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఐజీబీసి ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ బిల్డర్స్ గ్రీన్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిల్డర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేని కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది, ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేసి బిల్డర్స్, డెవలపర్స్ ను ఇబ్బంది పెట్టే పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా బిల్డర్‌కు సంపూర్ణ సహకారం అందిస్తాం, బిల్డర్స్‌కు హైదరాబాద్ స్వర్గధామం లాంటిదని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఒక యువ రాష్ట్రం, ప్రపంచ పటంలో రైజింగ్‌గా కనిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. నెట్ జీరో సిటీ ఒప్పందం చేసుకొని హైదరాబాద్ ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుంది అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. హైదరాబాదును గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఢిల్లీ ప్రజలు స్థానికంగా ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు ఒక సీజన్లో అక్కడి నుంచి పౌరులు వలస వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా ఉండేందుకు పలు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.హైదరాబాద్ నగరంలోని డీజిల్ >>2



హైదరాబాద్‌లో గ్రీన్‌తెలంగాణ సమ్మిట్‌లో బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న డి.సిఎం భట్టి



## మోడీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధమా?

**బిసిల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించదు: కేంద్ర మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి మోడీది ఏ కులం? రాహుల్ గాంధీది ఏ మతం అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి వెళదామా? అంటూ కాంగ్రెస్ పార్టీకి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బిసి జాబితాలో ముస్లింలను కలపడంపట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని కులంపై సిఎం రేవంత్ రెడ్డి అవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు, బిసి సంఘాలకు ఈ విషయం తెలుసునని వ్యాఖ్యానించారు. బేగంపేట హరిత ప్లాజాతో మీడియాతో మాట్లాడుతూ మనిషి పుట్టిన వెంటనే కులం పేరు పెడతామా? రేవంత్‌రెడ్డికి అట్లనేచేశారా? ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రధానిపై మాట్లాడేటప్పుడు >>2








## రూ.4 వేల కోట్ల జయలలిత ఆస్తులు తమిళసర్కార్‌కు అప్పగింత 3

## నేటి నుంచి మళ్లీ కులగణన

### 28 దాకా నమోదు చేసుకునే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** తెలంగాణలో కుల గణనలో పాల్గొనని వారికి రాష్ట్ర ప్రభుత్వం మరో వెసులుబాటు కల్పించింది. కులగణనలో పాల్గొనని వారి కోసం ఆదివారం నుండి మరోసారి సర్వే చేపట్టనున్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే ఎన్యుమరేటర్లు ఇంటికే వస్తారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు కార్యాలయాలకు వెళ్లి కూడా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇదివరకు చేసిన కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఆదివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు చేసే రీ-సర్వేలో పాల్గొనాలని ఇప్పటికే తెలిపింది. కుల గణన కోసం టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111ను ఏర్పాటు చేసింది. కుల గణన సర్వే కోసం ఎవరైనా ఫోన్ చేస్తే ఎన్యుమరేటర్లు వారి ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేసుకుంటారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు కార్యాలయాలకు వెళ్లి కూడా వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు గ్రామీణ ప్రాంతాలకు ఎంపీడీవో కార్యాలయాలు, పట్టణాలు, నగరాల్లో వార్డు, డివిజన్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సమగ్ర కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. కార్యాలయాల్లో శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు >>2


శనివారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

## ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

### నీటిపారుదల రంగం పారదర్శకంగా ఉండాలి

### అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15ప్రభాతవార్త:** డిజిటల్ మానిటరింగ్,ఆధునిక నీటి నిర్వహణతో నీటి వినియోగ సామర్థ్యం పెంచినతీరు, తెలంగాణ నీటిపారుదల శాఖ పారదర్శక పనితీరు వంటి అంశాలను దేశవ్యాప్తంగా రాజస్థాన్‌లో ఏర్పాటైనా జాతీయవేదికపై పరిచయం చేయడానికి వీలుగా నివేదికలు సిద్ధం చేయాలనీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.శనివారం జలసౌధలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష చేస్తూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్ట్ ల పురోగతిపై పర్యవేక్షణ పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. ఈ నెల 18,19 తేదీలలో రాజస్థాన్ లో అఖిల భారత నీటిపారుదల మంత్రుల సదస్సు జరగుతుందని ఆయన వివరించారు. నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,నీటిపారుదల శాఖా సలహాదారు ఆడిత్యా దాస్ నాథ్,ఇ. ఎన్.సి అనిల్ కుమార్ సి.ఇలు కే. శ్రీనివాస్, అజయ్ కుమార్,రమేష్ బాబు,శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్ట్ లలో పూడిక తీత ఇతర రాష్ట్రాలకు మార్గదర్శనం అయ్యేలా దిశానిర్దేశం చేసేందుకు ఒక అవకాశం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో గరిష్ట ఆయకట్టును విస్తరించడంపై కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. >>2



రాంచీలో శనివారం బిఐటి మెస్రా ప్లాటినం జూబ్లీ వేడుకలలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మ

## నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు
# యుద్ధ ప్రాతిపదికన చర్యలు
### సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

**హైద్రాబాద్,ఫిబ్రవరి 15: ప్రభాతవార్త:** ఈ వేసవిలో రాష్ట్ర వ్యాప్తంగా ఎటువంటి త్రాగు నీటి కొరత లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్రాగు నీటి సమ్యలను పరిష్కరించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే త్రాగునీటి సమస్యల పరిష్కారం కోసం పంచాయితీరాజ్ శాఖ టోల్ ఫ్రీ నంబర్‌ను (1800594007)ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. రాష్ట్రం లోని ఏ గ్రామం నుంచైనా ఫోన్ చేసినా వెంటనే షిర్యాదు నమోదు చేసుకుని అధికారులు సంబంధిత జిల్లా అధికారులకు సమచారాన్ని అందిస్తారు. ఒక వైపు అధికారులు ఇటువంటి ఏర్పాట్లు చేస్తూనే మిషన్ భగీరథ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా పైపులు ద్వారా కలుషతమైన నీరు సరఫరా కాకుండా జాగ్రత్త పడుతూనే ఎప్పటికప్పుడు నీటి ట్యాంక్‌ను పూర్తిశుద్ధి చేస్తున్నారు. మరోవైపు నీటి సరఫరాలో సమయంలో ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు నీటిని సరఫరా చేసేందుకు ఉపయోగించే మోటార్ల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. పాడై పోయిన మోటార్లు మరమ్మతులు చేయడమే కాకుండా అసరమైతే వాటి స్థానంలో కొత్త వాటిని కూడా కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయిస్తున్నారు. ఎప్పటికప్పుడు త్రాగు నీటి నిల్వలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెప్పించకుంటూ తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంవతలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్న సమాచారం ఉండటంతోరానున్న వేసవిలో ఎటువంటి నీటి కొరత లేకుండా యుద్ధప్రాతిపదికన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

హైద్రాబాద్‌లోఎటువంటి నీటి సమస్యలు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇదే అంశంపై గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం కూడా జరిగింది. తాగునీటితో పాటు భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా సివరేజీ ప్రణాళికను రూపొందించడంలో ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని సీఎం సూచించిన సంగతి తెలిసిందే. 2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు తగినట్టుగా హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరాకు మోలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో జనాభాకు సరిపడే విధంగా తాగునీటి సరఫరా చేస్తున్నామని, నీటి సరఫరాకు నగరంలో మొత్తం 9.800 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లతో నీటి సరఫరా చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు వివరించిన సంగతి విధితమే.

## కులగణనపై దేశవ్యాప్త ఉద్యమం

>> ఇన్‌చార్జ్‌గా రాహుల్‌గాంధీ టీమ్‌లో కీలకంగా ఉన్న మీనాక్షి నటరాజన్‌ను అధిష్ఠానం నియమించింది. ఈ నియామకం జరిగిన మరుసటి రోజే రాహుల్‌గాంధీతో రేవంత్‌రెడ్డి భేటీ కావడం ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వస్తోంది. అయితే ఈ విషయంలో ఎలాంటి కార్యాచరణ అమలు కావడం లేదు. ఇప్పుడు రాహుల్‌గాంధీతో భేటీ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చినా ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదనేది తేలింది. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాక వారిలో నుంచి అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కేబినెట్ విస్తరించే అవకాశం కనిపిస్తోంది. కాగా, రాహుల్‌గాంధీతో రేవంత్‌రెడ్డికి గ్యాప్ ఏర్పడిందనే ప్రచారానికి శనివారం వీరిద్దరి భేటీతో తెరపడింది. చాలా సందర్భాల్లో రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. అక్కడ కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్‌తోనూ సమావేశమై చర్చిస్తున్నారు. కానీ రాహుల్‌గాంధీతో మాత్రం భేటీ కాలేకపోయారు. దీంతో రేవంత్‌రెడ్డిని రాహుల్ దూరం పెట్టారనే విపక్షాలు వ్యాఖ్యలు చేశాయి. ఈ క్రమంలో తనకు రాహుల్‌గాంధీకి ఎలాంటి గ్యాప్ లేదని స్వయంగా రేవంత్‌రెడ్డి ఇటీవల మీడియా చిట్‌చాట్‌లో వెల్లడించారు. శనివారం ఈ ఇరువురు నేతలు సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకంది.

## నేటి నుంచి మళ్లీ కులగణన

>> అందుబాటులో ఉంటారన్నారు. కులగణన సర్వే వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని దానిని నింపి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల 56 వేల 323 కుటుంబాల వివరాలు గతంలో జరిగిన కులగణనలో నమోదు కాలేదని ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. కాగా.. గత ఏడాది నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు మొదటి సారి కులగణన సర్వే నిర్వహించింది ప్రభుత్వం. బీసీ జనాభా లెక్కల కోసం ప్రభుత్వం ఈ కులగణన సర్వేను చేసింది. అందుకు సంబందించిన వివరాలను కూడా సర్కార్ బయటపెట్టింది. ఈ సర్వేలో 3 కోట్ల 54 లక్షల పై చిలుకు మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు ప్రభుత్వం వివరించారు. ఇది రాష్ట్ర జనాభాలో 96.9 శాతంగా నమోదు అయ్యింది. మరొక 3.1శాతం జనాభా కుటుంబ సర్వేలో పాల్గొనలేదని స్పష్టం చేసింది. అందులో ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు కూడా సర్వేలో వివరాలు నమోదు చేసుకోలేదని వెల్లడించింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి నేతలు ఈ సర్వేలు వివరాలు నమోదు చేసుకోలేదు.

3.1 శాతం ప్రజలు వివిధ కారణాలతో ఈ సర్వేలో పాల్గొనలేదు. దీనిపై సమగ్రంగా వివరాలు వచ్చి తర్వాతే బీసీ రిజర్వేషన్లపై ముందు వెళ్లాలనే డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కులగణన సర్వే చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఆదివారం నుంచి సర్వే ప్రారంభంకానుంది. దాదాపు 12 రోజుల పాటు సర్వేను జరుగనుంది.

## విద్యుత్ శాఖ ఎడిఇ సతీశ్ రెడ్డి
# ఆస్తులు రూ.100 కోట్లకు పైనే
### రూ.50వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఎడిఇ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి15:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో లంచం తీసుకుంటూ పట్టుబడిన విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్ రెడ్డి ఆస్తులు రూ.100 కోట్లకు పైగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏడీఈ సతీశ్ రెడ్డి రూ.50 వేలు లంచం తీసుకుంటూ నిన్న ఏసీబీకి చిక్కాడు. దీంతో నిన్నటి నుండి ఆయన నివాసంలో, ఆయనకు సంబంధించిన ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయనకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో ఆయనకు స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. 22 ఎకరాల వ్యవసాయ భూమి, ఖాళీ స్థలాలు, ఒక విల్లా, భవనాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువనే రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అతని నివాసం నుండి బంగారం, నగదు, స్థిరాస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీష్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

## భయపెడుతున్న
# ఎండలు

>> రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రామగుండలో, ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్ర తలు సాధారణం కంటే 3డిగ్రీల పెరిగాయి. గాలిలో తేమశాతం బాగా తక్కువగా ఉంటోంది. ఫిబ్ర వరిలోనే ఇలా ఎండలుమండిపోతే..ఇక మేనెలవచ్చేనాటికి పరిస్థితి మరింత దారుణంగా ఉండొచ్చన ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జనవరిలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోద య్యాయి. ఫిబ్రవరిలో గడిచిన 14 రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ నెలలో గడిచిన 14 రోజుల్లో 11 రోజులు దేశంలోనే అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు తెలంగాణలోనే నమోదయ్యాయి. ఈ క్రమంలో బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి అని వాతావరణ శాఖ సూచించింది.

తెలంగాణలోని మహబూబ్‌నగర్, భద్రాచలం, ఖమ్మం, హనుమకొండ, హైదరాబాద్ జిల్లాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. శనివారం గరిష్టంగా ఖమ్మంలో అత్యధికంగా ఖమ్మంలో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యల్పంగా హైద్రాబాద్‌లో 35.6 డిగ్రీలు నమోదయ్యింది. అటు ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల వరకు ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. గరిష్ట ఉష్ణోగ్ర తలు సాధారణంగా కంటే 3 నుంచి 5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల ఎక్కువగా నమోదయ్యే అవకాశ ముందని అంచనా వేసింది.

**శనివారం ఉమ్మడి తెలంగాణ ఉమ్మడి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు**

| | |
|---|---|
| ఖమ్మం | 37.5 డిగ్రీలు |
| మహబూబ్‌నగర్ | 37.4 |
| నల్గొండ | 37.2 |
| రంగారెడ్డి | 37.2 |
| వరంగల్ | 36.6 |
| నిజామాబాద్ | 36.5 |
| కరీంనగర్ | 36.4 |
| ఆదిలాబాద్ | 35.9 |
| మెదక్ | 35.9 |
| హైదరాబాద్ | 35.6 |

## వారం - వర్జ్యం

తేది : 16-02-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
చవితి రా.2.17
హస్త తె.4.30
వర్జ్యం : ఉ.11.03-12.50
దు.సా.4.41-5.27
శుభసమయం : ఉ.7.00-8.00
సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**మిథునం:** కొత్త మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు.

**కర్కాటకం :** ఉద్యోగావకాశాలు పొందుతారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** ధనవ్యయం పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు తప్పవు.

**కన్య :** పనులలో తొందరపాటు వద్దు. శ్రమాధికం అవుతుంది.

**తుల :** భాగస్వామ్య వ్యాపారాలు ఆశాజనకంగా సాగవు. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఊహించని మార్పులు వుంటాయి. వివాదాలకు దూరం.

**ధనుస్సు:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ధనలాభం.

**మకరం:** సోదరుల నుండి శుభవార్తలు అందుకొంటారు. కొత్తవస్తువుల సేకరణ.

**కుంభం:** నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. విందు, వినోదాలు.

**మీనం :** ఉద్యోగాలలో అనుకోని బదిలీలు వుంటాయి. శ్రమాధికం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మోడీ పుట్టుకతో బిసి కాదనే అన్నా
## కులగణన అమలుకు కమిటీ
## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం
### ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి15:** ప్రధాని నరేంద్ర మోదీని తాను వ్యక్తిగతంగా విమర్శించలేదని, ఉన్నది ఉన్నట్లుగా నిజం మాట్లాడానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానిని కించపరిచేలా మాట్లాడలేదన్నారు. వ్యక్తిగతంగా, పదవి పరంగా కించపరచలేదని వివరణ ఇచ్చారు. కేవలం మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే అన్నానని, మోదీ పుట్టకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నానని వివరించారు. తాను చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారని తెలిపారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలని సవాల్ విసిరారు. శనివారం దిల్లీలోని టెన్ జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీతో తనకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టం చేశారు. కులగణన గురించి రాహుల్ గాంధీతో సంపూర్ణంగా వివరించానని సీఎం తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తామన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై కమిషన్ అధ్యయనం చేస్తోందని సీఎం వివరణ ఇచ్చారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో రాజకీయ జోక్యం లేదన్నారు. ఏకసభ్య కమిషన్ నివేదికను యథాతథంగా అమలు చేస్తామని వెల్లడించారు. కులగణన అమలుకు కమిటీ లేదా కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ కమిటీ లేదా కమిషన్ ఇచ్చే నివేదికను చట్టరూపంలోకి తెస్తామని మాటిచ్చారు. ప్రత్యేక అసెంబ్లీ సెషన్ పెట్టి చట్టరూపంలోకి తెస్తామన్నారు. తెలంగాణలో కులగణన శాస్త్రీయంగా జరిగిందని, ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రమూ కులగణన చేయలేదని, తెలంగాణ కులగణన దేశానికే రోడ్‌మ్యాప్ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కులగణనలో ఎలాంటి తప్పులు చోటుచేసుకోలేదు. ఒక్కో ఎన్యుమనేటర్ కు 150 ఇళ్లు కేటాయించాం. తప్పులు ఎక్కడా జరగలేదని చెప్పారు. రాష్ట్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభకు అగ్రనేత రాహుల్ గాంధీ రావాలని కోరాను. రాహుల్ గాంధీ చెప్పిన సూచనలు పాటిస్తున్నాన్న అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో జరిగన కులగణనపై ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని రేవంత్ చెప్పారు. రాజకీయ కోణంలోనే కాదు ప్రజా సంక్షేమం కోణంలోనే కులగణన జరిగింది. ప్రతిపక్షాలు కావాలనే అబద్దాలను ప్రచారం చేస్తున్నాయి. మా పాలనతో ఎక్కడా లెక్క తప్ప లేదన్నారు. కులగణనకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేస్తాం. ఆ వెంటనే పార్లమెంట్‌కు పంపిస్తామన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు ఎలా తీర్పును ఇస్తుందో చూడాలి. సుప్రీంకోర్టు తీర్పు కన్నా ముందే బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఏదో మాట్లాడుతున్నారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు ఏ పార్టీలు గెలిచి ఏ పార్టీలో మంత్రులుగా చేరారో చెప్పాలి అని సీఎం ప్రశ్నించారు. తనపై అబద్దపు ప్రచారాలు చేస్తూ విపక్ష నేతలు పైశాచిక ఆనందాలు పొందుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను కొందరికి నచ్చవచ్చు. నచ్చకపోవచ్చు. నన్ను కొందరు అంగీకరించక పోవచ్చు.. కానీ నా పని నేను సక్రమంగా చేస్తున్నాను. నన్ను ఎవరూ ప్రశ్నించే పరిస్థితిని తెచ్చుకోను' అని చెప్పారు. 'కాంగ్రెస్ తరఫున తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హామీలు ఇచ్చింది నేను. హామీలు అమలు చేయకపోతే అడిగేది కూడా నన్నే' అని పేర్కొన్నారు. కేబినేట్ విస్తరణ నా ఒక్కడి నిర్ణయం కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'నా పై ఎవరు ఏమనుకున్నా..? ఎలాంటి విమర్శలు చేసినా.. నేను పట్టించుకోను' అని పేర్కొన్నారు. పీసీసీ కార్యవర్గం, మంత్రి వర్గ విస్తరణ తదితర అంశాలపై కొందరు పైశాచిక ఆనందం కోసం అబద్దాలు ప్రచారం చేస్తున్నార్న అని మండి పడ్డారు. రాహుల్ గాంధీతో భేటీ, మీడియాతో ఇష్టాగోష్ఠి ముగిసిన అనంతరం సీఎం రేవంత్ హైదరాబాద్ బయలుదేరారు.

# హైదరాబాద్‌కు 10 వేలకోట్లు

>> వాహనాలను దశలవారీ ఎలక్ట్రికల్ వాహనాలుగా మారుస్తున్నట్టు తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయాన్ని కోల్పోయి రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించేందుకు కూడా వెనుకాడ లేదని తెలిపారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాదును తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆదాయం కంటే హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానం అన్నారు. ఫోర్త్ సిటీ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ. ప్రపంచ కేంద్రంగా ఫోర్త్ సిటీని తీర్చి దిద్దుతాం అన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని చెప్పారు. ప్రభుత్వ అంకిత భావం చాటి చెప్పడానికే ఐజీబీసీతో ఫ్యూచర్ సిటీపై ఎంఒయు కుదుర్చుకున్నామని, రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయన్నారు. నెట్ జీరో సిటీ నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంతంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకుందని వివరించారు. మూసి పునర్జీవనం రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయి, దశాబ్ద కాలంగా కాలుష్య కాసారంతో ప్రజలు జీవించడానికి ఇబ్బంది పడుతున్నారు..

ఈ నదిలో పరిశుభ్రమైన నీరు పారించి.. మూసి హైదరాబాద్‌కు ఒక వరంలా మారుస్తాము, హైదరాబాదును అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం అన్నారు. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎంత ఖర్చు అయినా ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల పెట్టుబడులకు సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు దావోస్లో పర్యటించి 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించారని వివరించారు. 2029-30కి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా కొత్త విద్యుత్ పాలసీలో స్పష్టం చేశామని, 35 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్‌ఉత్పత్తి లక్షియంగాముందుకు పోతున్నట్టుతెలిపారు. ఆధునిక దేశాల బాటలో తెలంగాణను నడిపించేందుకు కేవలం అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాదు నగరానికి ఒక ఏడాదిలో పదివేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం హైదరాబాదును ఉన్నత స్థానానికి తీసుకువెళ్లిందని తెలిపారు.

## దేశంలో పెరిగిన జిఎస్టీ ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జీఎస్టీ ఆదాయం పెరుగుతూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లు 6 శాతం తగ్గాయి. కర్ణాటకలో 7 శాతం పెరగ్గా, తమిళనాడులో 11 శాతం, కేరళలో 5% జీఎస్టీ ఆదాయం పెరిగింది. దక్షణాదిన జీఎస్టీ వసూళ్లు పెరిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తి సామర్థ్యాలు పెరగడంతో పాటు, హైదరాబాద్ మార్కెట్ ఎక్కడా తగ్గలేదని జీఎస్టీ వసూళ్ల లెక్కలు చెబుతున్నాయి. ప్రజల ఆర్థిక శక్తి తగ్గిందని, రియల్ ఎస్టేట్పై పరోక్షంగా ఆధార పడిన వారి జీవనం కష్టంగా మారిందని, రకరకాలుగా చేస్తున్న ప్రచారం తప్పని ఈ లెక్కలు తేలాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లకు సంబంధించి డిసెంబరులో 10 శాతం పెరిగి గత ఏడాది ఇదే నెల కంటే రూ.471 కోట్లు అధికంగా వసూళ్లయ్యాయి.



ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేస్తున్న కేంద్ర మంత్రి పియూష్ గోయెల్

# చర్చకు సిద్ధమా?

>> అవాకులు, చవాకులు మాట్లాడతారా? రేవంత్ విజ్ఞతకే వదిలేస్తున్నా. మోడీ ముమ్మాటికీ బిసినే అన్నారు. ఈ దేశంలోని వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలు, దళిత జాతి మొత్తం మోడీ తొలిసారి ప్రధానమంత్రి కాగానే సంబురాలు చేసుకున్నారు. మోడీ సైతం తన తొలి కేబినెట్‌లో 27 మంది బిసిలను మంత్రులుగా చేశారు. కేసిఆర్ హయాంలో సర్వే చేస్తే 51 శాతం బిసిలున్నట్లు తేల్చారు. ఈ లెక్కన మీ ప్రభుత్వంలో ఎంత మంది మంత్రులుండాలి? మరి మీరు ఎంత మందికి అవకాశం కల్పించారు? అసలు మోడీ కులం గురించి చర్చించాల్సిన అవసరం ఏముంది? ఆ విషయానికొస్తే రాహుల్ గాంధీ కులం, మతం, జాతి గురించి చర్చ చేయాలి. ఎందుకంటే రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్. ఆయన తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్. ఇటలీ దేశస్తురాలు. రేవంత్ తీరు కొరివితో తలగోక్కోవడమంటే ఇదే. రేవంత్‌కు దమ్ముంటే మోడీ బిసియా కాదా? రాహుల్ గాంధీ కులం, మతంపై ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెఫరెండంగా భావిద్దామా? నేనడుగుతున్నా 6 గ్యారంటీలపై ప్రజలు నిలదీస్తుంటే వాటిపై చర్చ చేయకుండా, సమాధానం చెప్పకుండా రేవంత్ రెడ్డి డైవర్షన్ పొలిటిక్స్ చేస్తున్నారన్నారు. బిసిజాబితాలో ముస్లింలను కలిపితే కేంద్రం ఒప్పుకునే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టి రాజకీయం చేయడానికి రేవంత్ రెడ్డి డ్రామాలాడుతున్నారు. కాంగ్రెస్ కు దమ్ముంటే బిసి జాబితా నుండి ముస్లింలను తొలగించాలి. అట్లాగే పూర్తిస్థాయిలో కులగణన చేసి బీసీ జనాభా లెక్క తేల్చాలి. ఆ తరువాత కేంద్రానికి పంపితే ఒప్పించి ఆమోదింపజేసే బాధ్యత మేం తీసుకుంటాం అన్నారు. కాంగ్రెస్ కులగణన సక్రమమైతే రీసర్వే ఎందుకు చేస్తున్నారు? తెలంగాణలో 3 కోట్ల 95 లక్షల ఆధార్ కార్డులున్నట్లు నివేదికలున్నాయని, ఆధార్ తీసుకోని వారి శాతం మరో 10 శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుల గణన సర్వే చేసి 3 కోట్ల 70 లక్షల జనాభా ఉన్నట్లు తేల్చడమేంది? మిగిలిన 60 లక్షల మంది ప్రజలేమైపోయారు? కాంగ్రెస్ చంపేసిందా? మీకు దమ్ముంటే ఇంటింటికీ వెళ్లి కుల గణన చేయాలి. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి కేంద్రానికి పంపాలి. అంతే తప్ప హిందూ జనాభా తగ్గించి ముస్లిం జనాభా పెంచి నివేదిక పంపుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. ఒక కులానికే బిజెపిలో పదవులిచ్చారని అనడం కరెక్ట్ కాదు. గత ఎన్నికల్లో బిసి వ్యక్తిని సీఎం చేస్తామని బిజెపి ప్రకటించింది. అట్లాగే అంతకుముందు బిసినైన నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారు. బిసి అయిన లక్ష్మణ్‌కు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడంతోపాటు పార్లమెంటరీ బోర్డు పదవి ఇచ్చింది. బిసిని సిఎం చేస్తానని ప్రకటించింది కాబట్టి ఓసి అయిన కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్షపదవి ఇచ్చారన్నారు.

## కెసిఆర్ జన్మదినం సందర్భంగా సామాజిక
# సేవా కార్యక్రమాలకు పిలుపు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి15: భారత రాష్ట్ర సమితి అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారాక రామారావు పిలుపునిచ్చారు. ఈనెల 17న కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎవరికి తోచినవిధంగా ఇతరులకు సహాయపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ,అన్నదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## నిరంతర పర్యవేక్షణ

>> తక్కువ పెట్టుబడితో అధిక నీటి పారుదల ప్రయోజనాలను అందించగల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వం అధిక ఖర్చు చేసినా పరిమిత ఫలితాలనే సాధించిందని ఆయన నెమరేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం ద్వారా అదనంగా 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని ఆయన వివరించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాల్వ, దిండీ, పాలమూరు రంగారెడ్డి, దేవాదుల, ఇంకా పలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు సమగ్ర నివేదిక సమర్పించారు. ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు ఖచ్చితమైన గడువులు విధించాలని సూచించారు. అదే విధంగా, నీటి పారుదల పనుల పర్యవేక్షణను మరింత మెరుగుపరచి, పారదర్శకత, సమర్థత పెంచాల్సిన అవసరం ఉందని, పనుల ఆలస్యం లేదా నిర్లక్ష్యం సహించబోమని ఆయన హెచ్చరించారు. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ లో నిర్వహించనున్న జాతీయ సదస్సు రాష్ట్రాల నీటి పారుదల మంత్రులను, కేంద్ర ప్రభుత్వ విధానకర్తలను, నీటి నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానుందన్నారు. ఈ సదస్సులో నీటి పాలనను బలోపేతం చేయడం, నీటి నిల్వలను మెరుగుపరచడం, నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచడంవంటి ముఖ్య అంశాలపై చర్చలు జరుగనున్నాయన్నారు. తెలంగాణ ఈ సదస్సులో నీటి పారుదల రంగంలో తీసుకున్న సంస్కరణలు, డిజిటల్ మానిటరింగ్ విధానాలు, ఆధునిక నీటి నిర్వహణ విధానాలను ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో తెలంగాణలో నీటి నిల్వలను పెంచడం గురించి ప్రత్యేక చర్చ జరిగింది. ఆనకట్టల సమర్థవంతమైన నిర్వహణ, నదుల అనుసంధానం, భూగర్భజల భద్రత విధానాలు భవిష్యత్తులో నీటి భద్రతను పెంచడంలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రధాన ఆనకట్టల వినియోగంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలనికోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ తీరును వివరించే సమాచారాన్ని కూడా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యం గురించి మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. రైతులు నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు మైక్రోఇరిగేషన్ (డ్రిప్ స్ప్రింక్లర్) విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలైన మైక్రోఇరిగేషన్ పద్ధతుల గణాంకాలను సేకరించి, వాటిని జాతీయ సదస్సులో ప్రదర్శించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. అదనంగా, తెలంగాణ ప్రభుత్వం నదుల పరిరక్షణ, వరద మైదానాల నిర్వహణ, నేలకోత అవక్షేపణ నియంత్రణ లో తీసుకుంటున్న చర్యలను జాతీయ వేదికపై వివరించాల్సిన అవసరం ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పూడిక తీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇతర రాష్ట్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచే విధంగా వాటిని వివరించాలనీ ఆయన ఆదేశించారు. సదస్సు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలను మంత్రి జారీ చేశారు. తెలంగాణ ప్రదర్శనను గణాంకాలతో, దృశ్యరూపాలతో, విజయవంతమైన కేస్ స్టడీలతో పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర సహాయం, నిధుల పెంపుదలకు, రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు మరింత సహకారం పొందేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తక్కువ వ్యయంతో గరిష్ట సాగునీటిని అందించడంపై దృష్టి సారిస్తూ, సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

వస్త్ర మంత్రిత్వశాఖ ప్రోత్సాహంతో

INSPIRED BY THE 5F VISION

భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్ నిర్వహణలో

# భారత దేశపు అతి పెద్దదైన ప్రపంచ స్థాయి వస్త్ర పరిశ్రమ మహోత్సవం



గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ
భారత ప్రధాని

## Bharat TEX 2025

TEXTILES | FASHION | SUSTAINABILITY

Global Textile Expo

5,000+ ప్రదర్శనకారులు | 20,000+ ఉత్పత్తులు | 2,20,000+ చదరపు మీటర్ల ప్రాంతం

## టెక్స్‌టైల్ సంవాదం

విశిష్ట సంభాషణా సందేశం

## శ్రీ నరేంద్ర మోదీచే

గౌరవనీయ ప్రధానమంత్రి

16వ ఫిబ్రవరి 2025 | సా॥ 04:00గం॥

భారత్ మండపం, న్యూఢిల్లీ

డిడి న్యూస్ పై లైవ్ టెలికాస్ట్

### గత దశాబ్దంపైగా ప్రధాని మోదీ స్వాప్నిక సాఫల్య నాయకత్వంలో చేపట్టిన పరివర్తనాత్మక చొరవలు

**ప్రత్తి రంగం :**
గత 10 సంవత్సరాలలో 1.07 కోట్లు MSP వ్యవహారాల రైతాంగ ప్రయోజనాలు. రూ.133 కోట్లు విలువైన MSP ప్రయోజనాల విస్తరణ

**జనపనార రంగం :**
రూ.81,500 కోట్ల విలువైన జనప గోనె సంచులు పొందడం వలన జ్యూట్ మిల్లులు/ యూనిట్‌లలోని 4 లక్షల కార్మికులు మరియు 40 లక్షల రైతాంగానికి ప్రయోజనాలు

**నేత మగ్గాలు మరియు హస్తకళా వృత్తులు :**
1.13 లక్షల చేనేత మగ్గాల నేత వృత్తిదారులకు మగ్గాలు మరియు పరికరాల అందవేత సముదాయాలలోని 1.5 లక్షల చేతివృత్తి నిపుణులకు లబ్ధికలిగే విధంగా 318 పైగా వృత్తులకు G1 రిజిస్ట్రేషన్

**నైపుణ్యత మరియు సామర్థ్య నిర్మాణం :**
నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల క్రింద 12.17 లక్షల లబ్ధిదారులకు, 9.70 లక్షల మహిళలు కలిపి శిక్షణ. 9.62 లక్షల శిక్షణ పొందిన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు 4.01 లక్షల SC/ST శిక్షణ పొందిన వారికి ప్రయోజనాలు

**బడ్జెట్‌లో ప్రత్తి ఉత్పాదనకు మిషన్ ప్రకటన :**
ప్రత్తి ఉత్పత్తి మరింత పెంపుదల సహాయానికి, నాణ్యత మరియు సమృద్ధి సాధించేటట్టు రైతాంగానికి మరియు వస్త్ర పరిశ్రమకు లబ్ధి చేయూత

**నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ :**
ఈ పథకం క్రింద 168 R&D ప్రాజెక్ట్‌లు, నార ప్రత్యేకతలలో పలు స్టార్ట్-అప్‌లు, వస్త్ర పరిశ్రమల సాంకేతికాభివృద్ధికి మరియు స్వదేశీ పురోగతికి తోడ్పాటు అందిస్తాయి

ఆహ్వానపత్రంతో మాత్రమే ప్రవేశం


మమ్మల్ని అనుసరించండి : X /Bharat_tex /bharat_tex/ f /bharattex2025 in /showcase/bharattex/ /@BharatTex

ప్రస్తుతఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లవాడికి ఏదిఇష్టమో తెలుసుకోకుండా వాళ్ల పిల్లలను ఇంజినీర్‌నుచేయాలని, డాక్టర్‌గా చేయాలని భావిస్తున్న పిల్లలకు ఇష్టం లేకపోయినా వారిని ఆయా కోర్సులోలచేర్పిస్తున్నారు. తీరా విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరిన తరువాత తాము ఆ కోర్సుపట్ల శ్రద్ధచూపలేక ఫెయిలవుతారు. దీంతో తల్లిదండ్రుల మందలింపులు, ఇతర విద్యార్థుల మాటలమూలంగా విద్యార్థులు కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరీక్షలకు ముందు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నతీరు మూలంగా కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమపిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో చేర్పించినప్పటికీ ఆయా విద్యాసంస్థలు నిర్దేశించిన ఫీజులను సకాలంలో చెల్లించలేకపోతున్నారు. దీంతో విద్యార్థులను యాజమాన్యాలు పరీక్షలకు ముందుమొత్తం ఫీజును చెల్లిస్తేనే హాల్‌టికెట్లను ఇస్తామని చెబుతున్నారు. కొన్ని యాజమాన్యాలు విద్యార్థులను తోటి విద్యార్థుల ముందు అవమానపరిచే విధంగా మాట్లాడుతుండటంతో తట్టుకోలేక, విద్యా సంస్థల వేధింపులను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రెండు మూడు రోజుల క్రితం ఇటువంటి ఘటనలే తెలంగాణ రాష్ట్రంలో రెండు జరిగాయి. మార్చి 1నుంచి మొద లయ్యే వార్షికపరీక్షలు ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. టెన్త్, ఇంటర్ విద్యార్థుల బోర్డు పరీక్షతోపాటు 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే వార్షికపరీక్షలు, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల సెమిస్టర్ పరీక్షల వరకు చూస్తే ఏప్రిల్ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఏప్రిల్, మేనెలల్లో జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్ రెండో విడత, అడ్వాన్స్‌డ్, నీట్, సీయూఈటీతోపాటు రాష్ట్రాల్లో నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లు వరకు చూస్తే మే31వరకు వివిధ పరీక్షలు జరగనున్నాయి.

# పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

**నాగమణీంద్ర పల్లాపు**

రాష్ట్రంతోపాటు దేశంలోని విద్యార్థులు పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. మార్చి నుంచి మొదలు పెడితే మే చివరి వరకు వివిధ పరీక్షలు దేశవ్యాప్తంగా జరగనున్నాయి. టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షలతోపాటు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా పరీక్షల కోసం కోట్లాదిమంది విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారు. అందులో భాగంగా సీబీఎస్‌సీ బోర్డు విద్యార్థులకు ఈ నెల 14న శుక్రవారం నుంచే టెన్త్ బోర్డు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇక దేశంలోని వివిధ రాష్ట్ర బోర్డులద్వారా జరిగే పరీక్షలు మార్చి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 1నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా తెలంగాణలో మార్చి 5నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక 10వ తరగతి విద్యార్థులకు మార్చి 21నుంచి బోర్డు పరీక్షలు జరగనున్నాయి. వారికి మార్చి 6 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇక 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్‌లో వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు నిర్వహించే సెమిస్టర్ పరీక్షలను ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్, సీయూఈటీతోపాటు ఉన్నత విద్యామండలి నిర్వహించే వివిధ కామన్ ఎంట్రన్స్ పరీక్షలు ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థుల వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత నిర్వహించనున్నారు. విద్యార్థులు వార్షిక పరీక్షలు అన్నా, వాటితోపాటు ఎంట్రన్స్ పరీక్షలు అన్నా చాలా ఒత్తిడికి గురవుతూ భయంతో ఉంటారు. ఎంట్రన్స్ పరీక్షల్లో విజయం సాధించలేమనే ఆత్మన్యూనతతోపాటు ఒత్తిడి, భయంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాగే వివిధ బోర్డులు నిర్వహించే వార్షిక పరీక్షల్లో సైతం పాస్ కాలేమని తల్లిదండ్రులు తిడతారని, భయంతో సూసైడ్‌లు చేసుకునే విద్యార్థులున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఒత్తిడి, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే విద్యార్థులుకూడా ఉన్నారు. పరీక్షల ఒత్తిడి, భయంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండటం కోసంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. కేంద్రంలో అయితే గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ ఏకంగా పరీక్ష పే చర్చ పేరుతో విద్యార్థులు నేరుగా మాట్లాడుతున్నారు. ఈ నెల 14న సీబీఎస్ఈ టెన్త్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని సూచించారు. పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన జీవితంలో ఓడిపోయినట్టు కాదని సూచించారు. విద్యార్థులకు వారికి ఇంట్రెస్టింగ్ ఉన్న



వాటిపై ఎక్కువగా దృష్టిపెట్టాలని సూచించారు. తల్లిదండ్రుల తోపాటు, ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను పరీక్షలకు ఇష్టపూర్వకంగా సన్నద్ధం చేయాలని సూచించారు. పరీక్షలంటే విద్యార్థుల్లో ఉన్నభయాన్ని తొలగించేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులంటే మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. పరీక్షల భయంతో ప్రాణాలను తీసుకోవడం సరైంది కాదని విద్యార్థులు బాగా పట్టుదలతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఇక రాష్ట్రప్రభుత్వాలు సైతం విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడానికి పలురకాల చర్యలను తీసుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టడానికి టెలీమానస్ అనే విధానంఅమలు చేస్తోంది. విద్యార్థులు టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేస్తేవిద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఉండేలాగా మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆత్మహత్యల నివారణకు మానసిక నిపుణులు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచిస్తున్నారు. పరీక్షలనేవి జీవితంలో ఒకపార్ట్‌గా ఉంటాయని, పరీక్షలే జీవితం కాదని చెబుతూవిద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితంలో ఫెయిలైనట్టు కాదని మరోసారి ప్రయత్నించడంలో తప్పులేదని చెబుతున్నారు. రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 62 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్నారు. వారిలో సుమారు 5.08 లక్షల మంది ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కాబోతున్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల నుంచి సుమారు 9.75 లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. వీరు కాకుండా డిగ్రీలో సుమారు 6లక్షల మందికిపైగా, పీజీలోసుమారు 70వేలకిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇక ఇంజినీరింగ్‌లో అయితే నాలుగు సంవత్సరాలకు కలిపిసుమారు 2.50 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇవి కాకుండా మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, లా కోర్సులు ఇలా ఇతర కోర్సులకు చెందిన విద్యార్థులు మొత్తం సుమారు 90 లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏడాది వార్షిక పరీక్షలకు హాజరవుతుంటారు. విద్యార్థులు వార్షికపరీక్షలకు హాజరు కావాలంటే భయపడుతుంటారు. విద్యార్థుల్లో వార్షిక పరీక్షలతోపాటు, ఎంట్రన్స్ పరీక్షలంటే భయపడటానికి మరోకారణం ప్రశ్నాపత్రాలు లీకవడం కూడా ఒకటి. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో కృశ్చన్ పేపర్ లీకైతే మరోసారి పరీక్ష రాయడానికి విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. మొదటిసారి బాగారాసిన వారు తరువాత అలాగే రాస్తారనే నమ్మకం ఉండదు. అలాగే సాధారణంగా నిర్వహించే టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా లీకవుతున్నాయి. ఇలా లీకవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. వారు మొదటిసారి రాసినప్పుడు బాగా చదువుకొని రాస్తారు. ఆ తరువాత మరోసారి రాయాలంటే భయంతో మొదటిసారి రాసినట్టుగా రాయలేకపోతుంటారు. వాటితోపాటు విద్యార్థులు పరీక్షలంటే భయపడటానికి మరో కారణం తమకు ఇష్టం లేని కోర్సులోచేరడం. ప్రస్తుతంఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లవాడికి ఏదిఇష్టమో తెలుసుకోకుండా వాళ్ల పిల్లలను ఇంజినీర్‌నుచేయాలని, డాక్టర్‌గా చేయాలని భావిస్తున్న పిల్లలకు ఇష్టం లేకపోయినా వారిని ఆయా కోర్సులోలచేర్పిస్తున్నారు. తీరా విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరిన తరువాత తాము ఆ కోర్సుపట్ల శ్రద్ధచూపలేక ఫెయిలవుతారు. దీంతో తల్లి దండ్రుల మందలింపులు, ఇతర విద్యార్థుల మాటల మూలంగా విద్యార్థులు కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరీక్షలకు ముందు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నతీరు మూలంగా కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమపిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో చేర్పించినప్పటికీ ఆయా విద్యాసంస్థలు నిర్దేశించిన ఫీజులను సకాలంలో చెల్లించలేకపోతున్నారు. దీంతో విద్యార్థులను యాజమాన్యాలు పరీక్షలకు ముందు మొత్తం ఫీజును చెల్లిస్తేనే హాల్‌టికెట్లను ఇస్తామని చెబుతున్నారు. కొన్నియాజమాన్యాలు విద్యార్థులను తోటి విద్యార్థుల ముందు అవమానపరిచే విధంగా మాట్లాడుతుండటంతో తట్టుకోలేక, విద్యా సంస్థల వేధింపులను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రెండు మూడు రోజుల క్రితం ఇటువంటి ఘటనలే తెలంగాణ రాష్ట్రంలో రెండు జరిగాయి. మార్చి 1నుంచి మొదలయ్యే వార్షికపరీక్షలు ఏప్రిల్ నెలాఖరువరకు కొనసాగనున్నాయి. టెన్త్,ఇంటర్ విద్యార్థుల బోర్డు పరీక్షతో పాటు 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే వార్షిక పరీక్షలు, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్,మెడికల్, ఎంబీఏ,ఎంసీఏ కోర్సులసెమిస్టర్ పరీక్షలవరకు చూస్తే ఏప్రిల్ వరకు పరీక్షలుకొనసాగనున్నాయి. ఏప్రిల్, మేనెలల్లో జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్ రెండో విడత,అడ్వాన్స్‌డ్, నీట్, సీయూఈటీతోపాటు రాష్ట్రాల్లో నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లువరకు చూస్తే మే31వరకు వివిధ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అటు ప్రభుత్వాలతోపాటు ఇటు విద్యారంగ నిపుణులు, మానసిక నిపుణులు కూడా చెబుతున్నది ఒకటే మాట పరీక్షలంటే భయపడొద్దు. పరీక్షలకు మానసిక స్థైర్యంతో సిద్ధంకావాలి. పరీక్షల్లో ఫెయిలైతే జీవితంలో ఓడిపోయినట్టు కాదని చెబుతూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. ●

# 'సుప్తా'వస్థలోకి..

మణిపూర్

**ఏ.వి.వి ప్రసాద్**

జాతుల సంక్షోభం ఒక చిన్న రాష్ట్రాన్ని అతిపెద్ద సమస్యలోకి నెట్టివేసింది. అటు కుకీలు, ఇటు మైతీలు రాష్ట్రాన్ని చెరోపక్కకు లాగడంతో అక్కడ ప్రభుత్వం పని చేయలేని పరిస్థితిలోకి జారిపోయింది. ఈ అవకాశాన్ని అన్ని రాజకీయ పార్టీలు యథాశక్తి ఉపయోగించుకొని లబ్ధిపొందాలని చూశాయి. చివరికి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ గత ఆదివారం రాజీనామా చేయగా, గురువారం (13,ఫిబ్రవరి) విధిలేని పరిస్థితిలో రాష్ట్రపతి పాలన విధించారు. ప్రజలు ఓట్లువేసి ఎన్నుకొన్న నాయకులు అసమర్థులైతే ఆ రాష్ట్రం ఎటువంటి దుస్థితిని ఎదుర్కొంటుందో చెప్పడానికి మణిపూర్ పెద్ద ఉదాహరణ. ఒక ముఖ్యమంత్రి రాజీనామాచేస్తే, ఆయన స్థానం భర్తీ చేయడానికి అధికార పార్టీలో మరో నేత కరవయ్యారు. అటువంటి అవకాశం కోసమే ఎదురుచూసే ప్రతిపక్షానికి కూడా చేతులు కదలని పరిస్థితే ఏర్పడింది. అందుకే రాష్ట్రపతి స్వయంగా జోక్యం చేసుకొని గవర్నర్‌కు పగ్గాలందించారు. ఇదంతా రాజ్యాంగం ప్రకారం జరిగే ప్రక్రియే అనుకోవచ్చు. కానీ నిత్యం ఉద్రిక్తతల మధ్య ఏ పక్కకు వెళ్తే ఏకాలు విరుగుతుందోననే భయాల మధ్య సాధారణ ప్రజలు ఎంత కాలం జీవించాలి? సమర్థులైన నేతలను ఎన్నుకొనే అవకాశం మళ్లీ రావాలంటే ఇంకా రెండేళ్లు ఆగాలి. 2027 ఫిబ్రవరిలోగాని మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశంలేదు. అప్పటిదాకా గవర్నర్ పాలనలోనే నడపడమూ కష్టమే. కొన్ని ప్రత్యేకపరిస్థితుల మధ్యఈలోగా ఎన్నికలు నిర్వహించవచ్చు. కానీ అందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా? ఇంతటి పెనుసంక్షోభంలో రాష్ట్రం చిక్కుకొనడానికి ప్రధానంగా కుకీ, మైతీ జాతుల సంఘర్షణే కారణం. దాదాపు 21నెలలుగా రెండు ప్రధాన తెగలమధ్య కొట్లాట వల్ల దాదాపు 250 మంది మరణించినట్లు తెలుస్తోంది. అది అధికార లెక్క. నిజంగా మరణించినవారు దానికి మూడురెట్లు ఎక్కువే ఉండొచ్చునని అంటున్నారు. మణిపూర్‌లో ఉన్నది 'డబులింజన్' ప్రభుత్వమే. అయినా సంక్షోభాన్ని పరిష్కరించలేక రాష్ట్రపతిపాలన దాకా వచ్చారంటే దానిని ఏమనుకోవాలి! రాష్ట్రంలో తెగలమధ్య ఘర్షణలను సాక్షాత్తు సిఎం ఎగదోసినట్లుగా కూడా వర్తాలు వచ్చాయి. కొద్దిరోజుల క్రితం ఈ సమాచారం వెలుగులోకి వచ్చిన తర్వాత మణిపూర్ కథ మరిన్ని ఆసక్తికరమైన మలుపులు తిరిగింది. మానవ హక్కులపై ఏర్పాటైన కుకీ సంస్థ కొట్లాటల్లో సిఎం ప్రమేయంపై ఆడియో సాక్ష్యాలున్నాయంటూ సుప్రీంకోర్టుకువెళ్లడంతో అప్పటి నుంచే బీరేన్ భవిష్యత్తుపై చీకటి ఛాయలు ఆవరించాయి. ఆ టేపులను పరిశీలించవలసిందిగా సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (సిఎఫ్ఎస్ఎల్)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ టేపులను క్షుణ్ణంగా పరిశీలించిన ట్రూత్‌లాబ్స్ ఫోరెన్సిక్ సర్వీసెస్ అనేసంస్థ దానిలోని గొంతు 95 శాతం బీరేన్‌దేనని ధ్రువీకరించింది. సిఎఫ్ఎస్ఎల్ ఫలితం రాకుండానే బీరేన్ గుట్టు బయటపడడంతో పరువు మరింత పోయేముందే తప్పుకోవడం మంచిదని అధిష్ఠానం సూచించడంతో ఆయన



బీరేన్ సింగ్


రాజీనామా చేశారనీ, రెండు సంవత్సరాలుగా ఎవరెన్ని విమర్శలుచేసినా చీమకుట్టినట్లు కూడా లేని బీరేన్ హఠాత్తుగా రాజీనామా చేయడానికి అదే కారణమనీ అంటున్నారు. సిఎఫ్ఎస్ఎల్ ఫలితంలో కూడా అదేనిజమైతే ఇంతటి నరమేధానికి కారణమైన బీరేన్‌పై కూడా కఠినచర్యలే తీసుకోవలసివస్తుంది. 2023మే 23నమైతీలు,కుకీలమధ్య రాజుకొన్న ఘర్షణలు తర్వాత రోజురోజుకుపెరిగి అదుపు చేయలేని పరిస్థితికి వచ్చాయి. వాటివల్ల నిరాశ్రయులైన వారు వేలల్లో ఉన్నారు. దాదాపు 60వేలమంది ఇప్పటికి స్వస్థలాలకువెళ్లలేక సహాయక శిబిరాల్లో అల్లాడుతున్నారు. మైతీలు,కుకీలు ఎక్కడ కనిపిస్తే అక్కడే పచ్చగడ్డి సైతం భగ్గుమంటోంది. జరుగుతున్న ఘర్షణలు రెండుజాతుల మధ్యకాదనీ, కేంద్రభద్రతా బలగాలకు, కుకీల మధ్య జరుగుతున్నాయనీ అంటూ సమస్యను పక్కదారి పట్టించడానికే ముఖ్యమంత్రి చాలా కాలం ప్రయత్నించారు. దానిని అప్పటి రక్షణ దళాల చీఫ్(సిడిఎస్)జనరల్ అనిల్‌చౌహాన్ ఖండించారు కూడా. అవి రెండు తెగలమధ్య జరుగుతున్న ఘర్షణలేనని ఆయన స్పష్టంచేశాకఏమీ ఎరుగనట్లు బీరేన్ కూడా తలాడించారు. అయితే సమస్యపరిష్కారానికి ఆయన ప్రయత్నించినట్లుగా ఎటువంటి దాఖలాలులేవు. పైగా ఆయనే రెచ్చగొట్టారనే ఆడియోటేపులు బయటకు రావడంతో అప్పటికి పరిస్థితి పూర్తిగా చేయిదాటేసింది. ముఖ్యమంత్రి గట్టిచర్యలే తీసుకొంటున్నారనీ, ఆ రెండుతెగలు అనవసరంగా ఘర్షణపడుతున్నాయనీ అంటూ కేంద్ర హోంశాఖ కూడా ఒక దశలో చేతులు దులుపుకొనడానికే ప్రయత్నించింది. కానీ ఎన్నాళ్లు తప్పించుకొంటుంది! పార్టీ లోనే ఒకవర్గం బీరేన్ రాజీనామాకు డిమాండ్ చేయడం, అదేఅదనుగా ప్రతిపక్ష కాంగ్రెస్ జూలు దులపడం బీరేన్ మెడకు చుట్టుకున్నాయి. మణిపూర్‌ను విభజించి తాముండేప్రాంతాలనుకేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలనే కుకీల డిమాండ్‌ను కొందరు సమర్థించగా, మరికొందరు మణి పూర్ సమగ్రతను కాపాడాలని కోరుతూవచ్చారు. బీరేన్ రాజీనామా డిమాండ్ చేసేవారి సంఖ్య పెరగడంతో, పార్టీలో పెరిగిన అసమ్మతిని తట్టుకోలేని పరిస్థితిలో చివరికి ఆయన రాజీనామా చేశారు. అయితే ఆయన స్థానాన్ని భర్తీ చేయగల నేతలే పార్టీలో కరవయ్యారు. అయితే ఆయన రాజీనామాగాని, రాష్ట్రపతి పాలనగాని అసలుసమస్యను పరిష్కరించ గలవా? కుకీలు, మైతీలను ఒక్క చోటుకు తెచ్చిసామరస్య ధోరణితో చర్చలు జరిపేట్లు ఎవరు చేయగలరు? 60సీట్లున్న అసెంబ్లీలో అధికార పార్టీకి 43మంది సభ్యుల బలం ఉంది. దానిలో బిజెపికి స్వయంగా 37 మంది ఉన్నారు. అంటేపూర్తి మెజారిటీ ఉంది. సమస్యను అధికార పార్టీచాలా తేలికగానే పరిష్కరించగలదు కానీ, నరమేధం జరుగుతుంటే ఎందుకో మరి వేడుక చూస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరచి పరిస్థితిని శాంతింపచేయడానికి అధికార పార్టీయే గట్టిగా ప్రయత్నించాలి. మరికొన్ని తెగలు కూడా ఘర్షణ మార్గంపట్టకుండా ఇప్పటికైనా శాంతిచర్యలకు అన్ని పార్టీలు పూనుకోవడం అవసరం. ●

# పద్మవ్యూహంలో జెలెన్స్కీ

ఉక్రెయిన్

**గన్ని మోహన్**

అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్ మొట్టమొదటగా దృష్టిసారించింది విదేశీ దిగుమతులపైసుంకాలు, అక్రమ వలసదారుల ఏరివేత, మూడో అంశం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని నిలిపివేయడం. మొదటి రెండు అంశాలు పూర్తిచేసిన ట్రంప్ ఇప్పుడు మూడో అంశంపై ఫోకస్ పెంచారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌తో సుమారు గంటన్నరసేపు ఫోన్‌లోనే సంభాషించారు. తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీతో కూడా చర్చలు జరిపినట్లు ఆయనే స్వయంగా ప్రకటించారు. రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ తనశైలిని మొత్తం మార్చేసారు. రష్యాతో ఉప్పునిప్పుగా సాగినా తొలిసారి కంటే ఈసారి కొంత రష్యా డిమాండ్లకు తలొగ్గినట్లే విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఉన్నట్లుండి హఠాత్తుగా ట్రంప్‌చేసే వ్యాఖ్యలు ఉక్రెయిన్ ప్రజలను కూడా గందరగోళంలోకి నెట్టివేస్తున్నాయి. రానున్న కాలంలో ఉక్రెయిన్ రష్యాలో అంతర్భాగం అయినా కావచ్చు, కాకపోవచ్చు అని చేసిన వ్యాఖ్యలు ఉక్రెయిన్ రాజకీయ నేతలను కలవరపాటుకు గురిచేసాయి. నాటోలో సభ్యత్వం కష్టమేనన్న సంకేతాలు పంపించడం, యూరోపియన్ యూనియన్ సభ్యత్వంపైనా తన వైఖరిని చెప్పకపోవడం వంటి అంశాలకు తోడు ఇటీవల జర్మనీనగరం మ్యునిచ్‌లో జరిగిన సదస్సులో అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రుబియో, నాటో రక్షణమంత్రుల సమావేశంలో అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలు ఉక్రెయిన్‌కు ఎంతమాత్రం సానుకూలంగా లేవనే తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో రష్యాయుద్ధాన్ని తక్షణమే నిలిపివేస్తామని, ఇందుకు తాను ఇరు దేశాలతో సంప్రదిస్తానని, సౌదీఅరేబియాలో ఇందుకు సమావేశం ఏర్పాటయితే తను సిద్ధమేనని ట్రంప్ ప్రకటించారు. దీనితో ఉక్రెయిన్ ప్రజలు ఎంతో సంతోషించారు. తీరా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ట్రంప్ ఆయన యంత్రాంగంలో తలెత్తిన పరిణామాలు ఉక్రెయిన్‌ను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. బైడెన్ హయాంలో అమెరికా ఉక్రెయిన్‌కు పెద్దన్నగా నిలిచింది. దండిగా ఆయుధ సాయం అందించింది. అందువల్లనే ఉక్రెయిన్ రష్యాసేనలతో భీకరంగా తలపడింది. ఆక్రమించిన స్థానాలను వెనక్కిరాబట్టుకోగలిగింది. ఒక విధంగా చెప్పాలంటే జెలెన్స్కీ పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు కనిపిస్తోంది. పుతిన్‌తో చర్చించిన తర్వాత వివరాలనుట్రంప్ వెల్లడించకపోయినా నాటోలో ఉక్రెయిన్‌కు సభ్యత్వం ఇవ్వకపోవడం, నాటోసాయం, అమెరికా సాయం తక్షణమే నిలిపివేయడం వంటివి పుతిన్ కచ్చితంగా ముందుంచుతారు. ఇక ఉక్రెయిన్ పరంగాచూస్తే రష్యా స్వాధీనం చేసుకున్న తమ భూభాగాలను మొత్తం అప్పగించడం, నాటో సభ్యత్వం, యూరోపియన్ యూనియన్ సభ్యత్వం అన్న అంశాలే కీలకంగా ఉంటున్నాయి. శాంతి నెలకొల్పేందుకు తాము సిద్ధమేనని, అగ్రరాజ్యాలు చర్చలకుపిలిస్తే తాము తప్పక వస్తామని



వోలోదిమిర్ జెలెన్స్కీ

చెప్పిన ఉక్రెయిన్ అధ్యక్షుడు మారిన ట్రంప్ వైఖరితో మీమాంసలో పడాల్సివస్తోంది. ఎప్పుడయితే క్రిమియా ప్రాంతాన్ని రష్యా ఆక్రమించుకుని దాడులకు పాల్పడిందో అప్పటినుంచి ఉక్రెయిన్‌కు యుద్ధసవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. సుమారు మూడేళ్లుగా నడుస్తున్న ఈ యుద్ధాన్ని విరమించకపోతే ఉక్రెయిన్ ప్రజలకు మనుగడ సైతం కష్టం అవుతుంది. ఇప్పటికే ఇతర దేశాలకు వలసలు పోయిన ఉక్రెయిన్‌ప్రజలు ట్రంప్ స్వరంపై అంతగా విశ్వాసం చూపించలేకపోతున్నారు. పైగా రష్యాలో అంతర్భాగం కావచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలు ఉక్రెయిన్ ప్రజలకు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. ప్రత్యర్థులపై తీవ్ర స్వరంతో వ్యవహరించే ట్రంప్ ఈసారి మృదు స్వభావంతో వ్యవహరించడంపట్ల వారిలో అనుమానాలు మరింత తీవ్రమయ్యాయి. దేశ ప్రయోజనాలు అటుంచితే ట్రంప్‌పూర్తిగా రష్యా ఒత్తిడికి తలొగ్గి వ్యవహరిస్తున్నారన్న ప్రచారం ప్రపంచ దేశాల్లో పెరిగిపోయింది. ఇప్పటికీ ఎక్కడా యుద్ధ ఛాయలు తొలగిపోలేదు. ఉక్రెయిన్‌పై డ్రోన్ల సాయంతో రష్యా దాడులుచేస్తూనే ఉంది. 180కి పైగా డ్రోన్లు ఏకకాలంలో దాడులు చేసాయని వాటిలో 150వరకూ కూల్చివేసామని ఉక్రెయిన్ రక్షణ అధికారులు చెప్పకనే చెప్పారు. చెర్నోబిల్ అణువిద్యుత్‌ప్రాంతం కూడా భద్రత ముప్పును ఎదుర్కొంటున్నదంటే ట్రంప్ మధ్య వర్తిత్వం ఎంతమేరకు పనిచేస్తుందన్నది ఉక్రెయిన్ వాసులకు ప్రశ్నార్థకం అవుతున్నది. ఇప్పటికే ఉక్రెయిన్‌లోని 20శాతం భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. కీలకనగరాలను కైవసం చేసుకుని సైనిక స్థావరాలను కొనసాగిస్తోంది. పుతిన్ డిమాండ్ చేస్తున్నట్లు ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోతే రష్యాకు రాయితీలు ఇచ్చినట్లే అవుతుంది. దీనివల్ల అమెరికా హోదా ఐరోపా కూటమిలో మరింత బలహీనపడే ప్రమాదంకూడా లేకపోలేదు. అమెరికా, నాటోసాయం నిలిస్తే యూరోపియన్ కూటమి దేశాలిప్పుడు ఉక్రెయిన్‌కు మద్దతివ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోయినా నాటో సైనిక సాయంఅందిస్తూ అటు యూరోపియన్ సాయం కూడా అందుతుంటే ఉక్రెయిన్ కొంత ధైర్యంగా రష్యాను ఎదుర్కొనే అవకాశంఉంటుంది. కేవలం చర్చలు సంప్రదింపులద్వారా మాత్రమే ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం లభించాలంటే ముందు పుతిన్‌ను దారిలో పెట్టాలి. ఆ శక్తి సామర్థ్యాలు డొనాల్డ్ ట్రంప్‌కు మాత్రమే ఉన్నాయని ఇప్పటికే విదేశాంగమంత్రి మార్కో రుబియో వెల్లడించారు. అయితే ట్రంప్ శైలి మాత్రం ఏకపక్షంగా పోతున్నట్లుందని ఉక్రెయిన్ మద్దతు దేశాలు పేర్కొంటున్నాయి. ఏది ఎలాఉన్నా అటు నాటోసభ్యత్వం, ఇటు నాటో సైనిక సాయం, అమెరికా ఆయుధ, నిధుల సాయంతోపాటు రష్యా దురాక్రమణలు వంటి వాటితో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పద్మవ్యూహంలో నిలిచారని స్పష్టం అవుతోంది. ఈ వ్యూహం నుంచి బయటపడాలంటే ట్రంప్ దృఢసంకల్పం ఒక్కటే ఆయుధం అని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ●

# నిరర్థక పథకంగా గుడ్ 'సమరిటన్' స్కీమ్!



డాక్టర్ నీలం సంపత్

దేశంలో లక్షల సంఖ్యలో జరుగుతున్న ఘోర రోడ్డు ప్రమాదాలలో ఏటా లక్షాఏభైవేల పై చిలుకు ప్రజలు ప్రాణాలను కోల్పోతుండడంతో పాటు లక్షల సంఖ్యలో ప్రమాద బాధితులు ప్రమాద స్థలాల్లో క్షతగాత్రులుగా మృత్యువుతో పోరాడుతున్నా సదరుప్రమాద స్థలాల్లో వుండి కూడా మెడికో లీగల్ కేసుల భయంతో, హాస్పిటల్లో వైద్యులు వేసే ఎదురు ప్రశ్నలకు జవాబు చెప్పలేక బై స్టాండర్స్‌గా వున్న ప్రజలు గాయపడిన వారిని సమీప ట్రామాకేర్ హాస్పిటల్స్‌కు చేరవేసే సాహసం చేయక పోవడం మూలాన ప్రమాద బాధితులు తమ విలువైన ప్రాణాలను కోల్పోతుండడం దురదృష్టకరం. ఈ పరిస్థితులను గమనించిన సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే యన్.జి.ఓ.2016లో భారత సర్వోన్నత న్యాయ స్థానంలో మోటారు వాహనాల చట్టాన్ని సవరిస్తూ మెడికో లీగల్ అవరోధాలను తొలగించాలంటూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం గమనార్హం. ఆ ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని విచారించిన సర్వోన్నత న్యాయ స్థానం ఎవరైనా మంచి ఉద్దేశ్యంతో ప్రమాద ఘటన స్థలాల నుండి గాయపడ్డ వారిని సమీప ట్రామాకేర్ సెంటర్లకు తరలిస్తే వారిని ప్రాణదాతలుగా పరిగణిస్తూ వారిని మెడికో లీగల్ కేసుల బారి నుండి విముక్తి కలిగించాలని సుప్రీం కోర్టు విస్పష్టమైన తీర్పు నిచ్చింది. ఆ ఉత్తర్వుల నేపథ్యంలో మార్చి 15, 2021వ తేదీన మోర్త్ మార్గదర్శకాలను రూపొందించి దేశంలోని అన్ని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలకు వాటిని అమలు పరచాల్సిందిగా ఆదేశాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు మార్చి 31 2026 వరకు అమలులో వుంటాయని తేల్చిచెప్పింది. మోర్త్ మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? మన దేశంలో ఏ రోడ్లపైనైనా మేజర్‌సర్జరీ, వెన్నెముకకు తీవ్రగాయం, తలకు లేదా మెదడుకు గాయంవల్ల మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజుల పాటు హాస్పిటల్స్‌లో వైద్యం తీసుకోవాల్సిన అవసరమున్న ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ వారిని బై స్టాండర్స్‌గా వున్న వారు ట్రామాకేర్ సెంటర్లకు గోల్డెన్ అవర్‌గా పరిగణించే గంటలోపు చేర్చితే వారిని గుడ్ సమారిటన్‌గా పరిగణిస్తారు. వారిని పోలీసులుగాని డాక్టర్లు గాని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయడానికి వీల్లేదు. మార్గదర్శకాల ప్రకారం వారిగా వివరాలను సైతం పోలీసులు గానీ, డాక్టర్లు గానీ అడగడానికి వీల్లేదు. ఒకవేళ రివార్డును ఆశిస్తే మాత్రం ఘోర రోడ్డు ప్రమాదాల ఘటనలో బైస్టాండర్లు తమ వివరాలను పోలీసులకు తెలియ జేయాలి. తదనంతరం పోలీసులు ట్రామాకేర్ సెంటర్లలో వైద్యులను సంప్రదించి గుడ్ సమారిటన్ వివరాలను మోర్త్ మార్గదర్శకాలలోని అనెగుయూర్ ఏ లో పొందుపరిచి జిల్లా రవాణాశాఖ అధికారికి సమర్పించడంతో పాటు దాని నకలును గుడ్ సమారిటన్‌కు అందించాలి. జిల్లా రవాణాశాఖ అధికారి పోలీసుల చేత అందుకున్న సదరు ప్రతిపాదనను సమగ్ర విచారణ తదనంతర చర్యలకోసం జిల్లా అప్రైజల్ కమిటీకి పంపిస్తారు. జిల్లా యస్.యస్.పి, సి.యమ్. ఓ, హెచ్‌లతోపాటు ఆర్.టి.ఓలు సభ్యులుగా జిల్లా మెజిస్ట్రేట్ నేతృత్వంలో పనిచేసే ఈ అప్రైజెల్ కమిటీ సమగ్ర విచారణ అనంతరం గుడ్ సమారిటన్ ప్రతిపాదనను ప్రతినెలా క్రమంతప్పకుండా రాష్ట్ర రవాణాశాఖ ముఖ్య కమిషనర్‌కు పంపాల్సివుంటుంది. ఆ తర్వాత అర్హులుగా నిర్ధారించబడిన గుడ్ సమారిటన్లకు 5,000 రూపాయల పారితోషికాన్ని విడుదల చేస్తూ వారి బ్యాంకు ఖాతాకు జమచేయడం జరుగుతుంది. (జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఈ పారితోషికాన్ని 25,000 కు పెంచినట్లు గౌరవ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.) నగదు పారితోషికంతోపాటు గుడ్ సమారిటన్‌లకు ధృవీకరణ పత్రం కూడా అందించడం జరుగుతుంది. జాతీయ స్థాయి గౌరవమూ దక్కుతుంది! ప్రతిఏటా అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి రాష్ట్రస్థాయి అప్రైజల్ కమిటీ ముగ్గురు ఉత్తమ గుడ్ సమా



రిటన్‌ల జాబితాను తయారు చేసి కేంద్రప్రభుత్వానికి పంపడం జరుగుతుంది. తదనంతరం జాతీయస్థాయి అప్రైజల్ కమిటీ జాతీయ స్థాయిలో పదిమంది ఉత్తమ గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి నేషనల్ రోడ్ సేఫ్టీ మీటింగ్‌లో 1,00,000 రూపాయల పారితోషికంతో పాటు ప్రధాన మంత్రి చేతుల మీదుగా ట్రోఫీని అందిస్తారు. ఇలా రాష్ట్ర స్థాయిలో, జాతీయస్థాయి గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి పారితోషికం ప్రశంసాపత్రాలతో సత్కరించడం ద్వారా రాష్ట్రంలో, దేశంలో అన్నిరకాల రహదారుల పై జరుగుతున్న ఘోర రోడ్డు ప్రమాదాలలో మరణాల సంఖ్యను యాభై శాతానికి తగ్గించాలనేది మోర్త్ తన లక్ష్యంగా ప్రకటించింది. అసలేం జరుగుతోంది? మార్చి 15 తేదీ 2021 న మోర్త్ జారీచేసిన గుడ్ సమారిటన్ మార్గదర్శకాల విషయం జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీతోపాటు దాని స్టేక్ హోల్డర్లయిన రవాణాశాఖ, పోలీసుశాఖ, వైద్య ఆరోగ్యశాఖ రహదారులు భవనాలశాఖలకు తెలుసో తెలియదో తెలియడం లేదు. ఎందుకంటే నిన్నటికి నిన్న ఎంతో కోలాహలంగా ముగిసిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో ఆయా జిల్లాల కొనసాగుతున్న జిల్లా రోడ్డుభద్రత అప్రైజెల్ కమిటీల వివరాలు గానీ, గుడ్ సమారిటన్ పథకం తాలూకు ఆనవాళ్లు కూడా ఎక్కడా కనపడకపోవడం ఆ పథకం అమలు పట్ల అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. నిజానికి ఈపథకం ప్రారంభమై నేటికి దాదాపు నాలుగేళ్ల కాలం పూర్తయినా రహదారి భద్రతలో స్టేక్ హోల్డర్లయిన పోలీస్, రవాణా, వైద్యఆరోగ్య శాఖలు ఈ పథకం నియమ నిబంధనల గురించి ఎందుకు ప్రచారం చేయడం లేదనే ప్రశ్న మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతోంది. తమకు విస్తృతంగా ఓటు బ్యాంకును సృష్టించే జనాకర్షక పథకాల గురించి రాజధాని నగరంతో సహా అన్ని జిల్లా కేంద్రాలలో పెద్ద, పెద్ద హోర్డింగ్‌లతో హోరెత్తిస్తున్న ప్రభుత్వాలు ఏటా లక్షల మంది ఘోర రోడ్డు ప్రమాదాల బాధితులకు ఊపిరులూదే ఈ పథకం గురించి ఆయా స్టేక్ హోల్డర్ల రాష్ట్ర, జిల్లాల ప్రధానకేంద్రాలతోపాటు, కనీసం సదరు ప్రమాదాలకు నెలవుగా కొనసాగుతున్న బ్లాక్ స్పాట్లలోనైనా ఎందుకు హోర్డింగ్‌లతో ప్రచారం చేయడం లేదనే ప్రశ్న యక్షప్రశ్నగానే మిగిలిపోతుంది. నాలుగేళ్ల పుణ్యకాలం గడిచిపోయినా గుడ్ సమారిటన్ పథకం పట్ల స్టేక్ హోల్డర్లయిన సంబంధిత ప్రభుత్వ శాఖలు ఈ పథకం అమలు పట్ల నిమ్మకు నీరెత్తుతుండడం బాధాకరం. ఫలితంగా గుడ్ సమారిటన్‌లుగా మారి ప్రభుత్వం ప్రమాద బాధితులకు ప్రాణంపోయాలని భావించే బై స్టాండర్‌లకు పోలీసుల వేధింపులు తప్పడంలేదు. వైద్యులసలే సహకరించడం లేదనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. అందుకే దేశంలో ఈపథకం అమలులోకి వచ్చిన 2021నుండి 2022 వరకు కేవలం 80 మంది బైస్టాండర్లకు మాత్రమే గుడ్ సమారిటన్ రివార్డు అందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇకపోతే 2022 నుండి నేటి వరకు ఈదేశంలో, రాష్ట్రంలో ఎంతమందికి పారితోషికాలు, ప్రశంసాపత్రాలు ట్రోఫీలు అందాయనే విషయం చిదంబర రహస్యంగా మిగిలిపోవడం అత్యంత దురదృష్టకరమే. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్రంలో కొలువుతీరిన ప్రభుత్వం ఈరాష్ట్రాన్ని రోడ్డుప్రమాదాలకు ఆస్కారం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామనే తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడంలో భాగంగా ఘోర రోడ్డు ప్రమాదాలను నివారించడానికి డ్రంకెన్ డ్రైవ్‌తో, మితిమీరిన వేగంతో, ప్రమాదకర డ్రైవింగ్‌తో రోడ్డుయూజర్ల ప్రాణాలతో చెలగాట మాడుతున్న దాదాపు ఆరువేల పైచిలుకు డ్రైవర్ల లైసెన్సులను రద్దుచేయడంతోపాటు వారిని జరిమానాలతో, జైలు శిక్షలతో శిక్షిస్తున్న వైనం ఆహ్వానించదగినదే. దానితో తెలంగాణ రాష్ట్రంలోని ఎక్స్‌ప్రెస్‌వేలు, హైవేలకు చేరువలో కోట్ల రూపాయల వ్యయంతో మల్టీ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ హాస్పిటల్స్‌ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. అంతేకాకుండ ప్రమాదాల నివారణకోసం రహదారుల నిర్మాణంలో లోపాలను తొలగించడంతో పాటు ఎన్ని చర్యలు చేపట్టినా ఘోర రోడ్డుప్రమాదాలు జరుగుతున్నప్పుడు అందులో గాయపడిన వారిని గోల్డెన్ అవర్ లో సమీప క్రిటికల్ కేర్ హాస్పిటల్లలో చేర్చడానికి ఎంతో ఉపయోగపడే గుడ్ సమారిటన్ మార్గదర్శకాలను రాబోయే మార్చ్ 2026 తో నిలిపివేయకుండా వాటిని నిరంతరం కొనసాగించాల్సిందే. అది చేయగలిగినప్పుడే ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారిలో ఏభై శాతం మందికి ప్రాణం పోయవచ్చనే మోర్త్ ఆశయం నెరవేరుతుంది. ●


# ఇండియా కూటమి కొనసాగాల్సిందే!

## ఇండియా టుడే సీ ఓటర్ సర్వే..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** కేంద్రంలో వరుసగా మూడు పర్యాయాలు అధికారం చేపట్టి 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు దేశంలోని పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి. తమిళనాడు నుంచి ఢిల్లీవరకూ వివిధ రాజకీయ పార్టీలు ఇండియన్‌నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్(ఇండియా) పేరుతో అన్ని పార్టీలు జట్టుకట్టాయి. ఈ పార్టీలన్ని కలిసి 2024లో ఎన్డీయేకు వ్యతిరేకంగా బరిలోకి దిగినా ఏమాత్రం విజయం సాధించలేకపోయాయి. అయితే చెప్పుకోదగిన సీటు మాత్రం సాధించాయి. ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కూటమిలోని పార్టీలు వేరువేరు దార్లలో ఉన్నాయి. ఇండియా కూటమి ఉంటుందా బీటలు వారుతుందా అన్న చర్చలు ఇపుడు సాగుతున్నాయి. ఇండియా కూటమిపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకనేందుకు సి ఓటర్ ఇండియా టుడే సంయుక్తంగా మూడ్ ఆఫ్‌ది నేషన్ సర్వే నిర్వహించాయి. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 9 మధ్య 1,25,123 మంది ఓటర్లను ఈ సర్వేలో ప్రశ్నించారు. పాల్గొన్న వారిలో 65శాతం మంది ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమిలోనే కొనసాగాలని సూచించారు. 26శాతం మంది ఆ అలయన్స్ అవసరం అన్నారు. ఇక ఈ కూటమికి రాహుల్ గాంధీ నాయకత్వం వహించాలని అత్యధికంగా 24శాతం మంది చెప్పారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతగా ఉండాలని 14 శాతం మాత్రమే స్పందించారు. ఆ తర్వాత స్థానాల్లో ఆప్ ఆధినేత అరవింద్ కేజ్రీవాల్ తొమ్మిదిశాతం, సమాజ్‌వాదిపార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్ ఆరు శాతం మంది కోరుకుంటున్నారు. ఇదిలా ఉంటే తాజా సర్వేలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 343 సీట్లు వస్తాయని ఇండియా కూటమికి 188 సీట్లు వస్తాయన్నారు. అయితే కూటమికి గత ఎన్నికల్లో 232 సీట్లు వచ్చాయి. సర్వేలో కొందరయితే ప్రజాస్వామ్య పరిరక్షణ పూర్తిస్థాయిలో జరగాలంటే విపక్షాలు బలంగా ఉండాలని అందుకే ఇండియా కూటమికి బీటలు వారకుండా ప్రతిపక్షాలు జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు సీనియర్లు నడుం బిగించాలని పలువురు ఈ సర్వేలో అభిప్రాయాలు వెల్లడించారు.

## మీర్జాపూర్ హైవేపై ప్రమాదం: పది మంది మృతి, 19 మందికి తీవ్రగాయాలు



**లక్నో, ఫిబ్రవరి 15:** రాష్ట్రంలోని ప్రయాగరాజ్ మీర్జాపూర్ హైవేపై శనివారంఉదయం ఘోరరోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు. మరో 19 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో పుణ్య స్నానాలు చేసేందుకు వెలుతున్న భక్తులు ఆప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రయాగరాజ్ మీర్జాపూర్ హైవేపై ఉన్న మీజా ఏరియా వద్ద బొలెరో వాహనం బస్సును ఢీకొట్టింది. ఛత్తీస్‌ఘడ్‌లోని కోర్బాజిల్లానుంచిభక్తులు సంగం స్నానాలకోసం ప్రయాగరాజ్ వెళుతున్నారు. మధ్యప్రదేశ్‌లోనిరాజ్‌ఘర్‌జిల్లానుంచి వస్తున్న బస్సును బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదం పట్ల యుపిసిఎం యోగి ఆదిత్యనాథ్ ఆరాతీసారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. ఈవారం ప్రారంభంలోనే హైదరాబాద్‌నుంచి వెళ్లిన ఏడుగురు భక్తులు కూడా రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సంగతి తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో ఒక్కట్రక్కును ఢీకొన్న ఘటనలో హైదరాబాదీభక్తులుప్రాణాలు కోల్పోయారు. కుంభమేళాలో జనవరి 29వ తేదీన జరిగిన తొక్కిసలాటలో 30మంది మృతిచెందగా 25 మందిని గుర్తించామని పోలీస్ అధికారి వైభవ్‌కృష్ణ తెలిపారు.ఆ తొక్కిస లాటలో 60 మంది గాయపడ్డారు.

## మేయర్ ఎన్నికలకు ముందు ఆప్‌కు షాక్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన ఆమ్ ఆద్మీపార్టీకిమరో షాక్ తగిలింది. ఢిల్లీమున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలకు ముందు ఆప్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు బిజెపిలో చేరారు. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్రసచ్‌దేవ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఏప్రిల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఢిల్లీలో మేయర్‌ఎన్నికలు జరగాల్సి ఉంది. అంతకుముందే ఈపరిణామం ఆప్‌కు గట్టిషాక్ అని చెప్పాలి. ఆప్ కౌన్సిలర్లు అనిత బసోయా, నిఖిల్ చాప్రాన, ధర్మవీర్‌లు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం సచ్‌దేవ మీడియాతోమాట్లాడుతూ ఢిల్లీలో త్వరలో కేంద్రం అసెంబ్లీమున్సిపల్ స్థాయిల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడనున్నదని మోడీ వికసిత్‌భారత్ లక్ష్యసాధనలో భాగంగా ఢిల్లీ అభివృద్ధికి ఇదే సరైన తరుణమని అన్నారు. ఢిల్లీని క్లీన్ అండ్ బ్యూటిపుల్ సిటీగా మార్చేందుకు ఆప్ కౌన్సిలర్లు బిజెపిలో చేరారని చెప్పారు. షెడ్యూలుప్రకారం ఢిల్లీ మున్సిపల కార్పొరేషన్‌లో మేయర్ ఎన్నికలు రానున్న ఏప్రిల్‌లోజరగాలి. 2024 నవంబరులో మేయర్ ఎన్నికలు జరగ్గా మూడు ఓట్ల ఆధిక్యంతో ఆప్ గెలిచింది. ఎంసిడి మేయర్, డిప్యూటిమేయర్ ఎన్నికల్లో కౌన్సిలర్లతోపాటు ఏడుగురు లోక్‌సభ సభ్యులు,ముగ్గురు రాజ్యసభ సభ్యులు 14 మంది నామినేటెడ్ ఎమ్మెల్యేలకు ఓటింగ్ హక్కు ఉంటుంది. తాజాగా ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు బిజెపిలో చేరడంతో ఆప్ సంఖ్యాబలాన్ని బిజెపి అధిగమించినట్లయింది. 2022లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ 134 వార్డులు, బిజెపికి 104 వార్డులు, కాంగ్రెస్‌కు తొమ్మిది వార్డులు, ఇండిపెండెంట్లకు 3 వార్డులు దక్కాయి. అయితేమేయర్ ఎన్నికల్లో లోక్‌సభ సభ్యులు నామినేటెడ్ ఎమ్మెల్యేల్లో కొందరు, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు బిజెపి అభ్యర్థికి అనుకూలంగా ఓటేసారు. దాంతో బిజెపి బలం 134 అయింది కానీ రాజ్యసభ సభ్యులు ముగ్గురు ఆప్‌కు ఓటేయడంతోమూడు ఓట్ల తేడాతో ఆప్ ఢిల్లీ మేయర్ పీఠం దక్కించుకుంది. ఈనెల 13న ఎంసిడి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.17వేలకోట్లతో బడ్జెట్‌ను కార్పొరేషన్ ఆమోదించింది. పారిశుద్యానికి అత్యధికంగా 4907.11 కోట్లు కేటాయించడంపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి.

## దేవాలయ ఉత్సవాల్లో పటాశ్‌ల శబ్దానికి బెదిరిపోయిన ఏనుగులు

# కిందపడి ముగ్గురు భక్తులు మృతి

**కోజికోడ్, ఫిబ్రవరి 15:** కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కోయిలాండి సమీపంలోని కురునంగడ్‌లోని మేనక్కులంగర భగవతి ఆలయంలో ఉత్సవ సందర్భంగా ఎక్కడి నుంచో తెచ్చిన రెండు ఏనుగులు బాణాసంచా శబ్దాలు విని అటు ఇటు పరుగెత్త సాగాయి. దానికి తోడు ఆ రెండు ఏనుగులు ఒకదానితో నొకటి తలపడ్డాయి. ఆ క్రమంలో పరిసరాల్లో ఉన్న భక్తులపైకి లంఘించుకున్నాయి. వారిలో ఆ ఏనుగుల దాడికి కొందరు పరుగెత్తగలిగినా మరికొందరు కిందపడి నలిగిపోయారు. చెలరేగిపోయి తొక్కిన ఘటనలో ముగ్గురు అక్కడిక్కడ మృతి చెందగా 24 మంది గాయపడ్డారు. భక్తుల మధ్య కూడా తోపులాట జరిగింది. చాలామంది కిందపడి లేవలేక పోయారు. ఏనుగులు తొక్కిసలాట, భక్తుల తోపులాటల్లో చిక్కుకున్న భక్తులు మృతి చెందిన సంఘటన ఇదే మొదటిది కాదు. వారం పది రోజుల నాడు కేరళలోని త్రిస్సూర్ జిల్లాలోని పైంగన్నికల్ దేవాలయ ఉత్సవాల కోసం తీసుకొచ్చిన ఏనుగొకటి స్నానం చేయిస్తుండగా మదమెక్కి గలాభా సృష్టించింది. ఈ దాడిలో 38 ఏళ్ల యువకుడొకడు ఆనంద్ ఎనుగు తొక్కగా చనిపోయాడు. మావటికి తీవ్రగాయాలయ్యాయి. జనం చూసి బెదిరినపుడు జంతువులు ఇలాగే పరుగులు తీస్తాయి. అందరూ భక్తులు చనిపోవడం తెలిసిందే!

దేవాలయ ఉత్సవాలకు ఏనుగులను తీసుకు రావడం ఊరేగింపులు నిర్వహించడం ఆనవాయితీ, ఇలాంటి వాటిపై కేరళ హైకోర్టు నిషేధించినా సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. డిసెంబరు 2024 తిరువంబాడి, పారమెక్కవు దేవస్థానాలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా 'స్టే' దొరికింది. ఈ అంశం కోర్టు స్టే ఉన్నందున ఏనుగులు తీసుకు వచ్చి ప్రదర్శనలు నిర్వహించడంలో ప్రభుత్వాలకు వాటిని ఆపే అవకాశం లేకపోయింది.

### ఓ వైపు బర్డ్‌ఫ్లూ కేసులు పైపైకి..

## అయినా 'డిసీజ్ డిటెక్టివ్స్'పై ట్రంప్ సర్కారు వేటు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 15:** ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, ప్రభుత్వ శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తోన్న డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఉద్యోగాల్లో భారీగా కోతలు పెడుతోంది. తాజాగా డిసీజ్ డిటెక్టివ్స్‌పై వేటు వేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంటువ్యాధుల (మహమ్మారి) నియంత్రణ, నిర్మూలన కార్యక్రమాల కోసం పనిచేసే వారినే 'డిసీజ్ డిటెక్టివ్స్'గా పిలుస్తారు. బర్డ్ ఫ్లూ కేసులు పెరుగుతోన్న తరుణంలో వారిని తొలగించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రొబేషన్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరినీ సాగనంపాలని డొనాల్డ్ ట్రంప్ సర్కారు గురువారం ఆదేశించిన విషయం విదితమే. దీంతో యేడాది కాలంగా ప్రొబేషన్‌లో ఉండి ఇంకా పర్మనెంటు కాని లక్షల మంది ఉద్యోగులపై వేటు పడనుంది. నిరుడు మార్చి నాటికి యేడాది కన్నా తక్కువ కాలం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ప్రొబేషనరీ ఉద్యోగుల సంఖ్య 2,20,000. విద్యా శాఖలో, వినియోగదారుల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ సంస్థలో ప్రొబేషనరీ ఉద్యోగులకు ఉద్వాసన ఈ వారమే మొదలైంది. వృద్ధులకు కేన్సర్ చికిత్స, మాదకద్రవ్యాలకు బానిలైన వారిని మామూలు పరిస్థితికి తీసుకురావడం వంటి కార్యక్రమాల్లో నిమగ్నమైన పరిశోధక సిబ్బందినీ తీసేస్తున్నారు. ట్రంప్ రెండోవిడత పాలనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలకంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయనకు ట్రంప్ మరిన్ని అధికారాలు కట్టబెట్టారు. ఆయన నిర్వహిస్తోన్న డోజ్ విభాగానికి ప్రత్యేక అధికారాలిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అధ్యక్షుడు తాజాగా సంతకం చేశారు. ఇకపై ఫెడరల్ ఏజెన్సీలు డోజ్ సహకారం, సంప్రదింపుల తర్వాతే ఉద్యోగుల ఉద్వాసన, నియామకాలపై నిర్ణయం తీసుకోవాలని తాజా ఉత్తర్వుల్లో ట్రంప్ ఆదేశించారు. ప్రతి ఏజెన్సీ ఉద్యోగుల తగ్గింపునకు ప్రణాళికలు చేపట్టాలని, అవసరమైన మేరకు మాత్రమే నియామకాలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు.

# భూమిపైకి తిరిగొచ్చాక సునీతా విలియమ్స్‌కు గ్రావిటీ ఇబ్బందులు

### పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే..



**వాషింగ్టన్, ఫిబ్రవరి 15:** అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో ఉండిపోవాల్సి వచ్చిన ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ తిరుగుప్రయాణం దాదాపు ఖరారైంది. ఎనిమిది నెలల ఎదురు చూపుల తర్వాత మార్చి 19న వారు భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలోకి రానున్న వారికి సమస్యలు తప్పవట. పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే ఉంటుందట. ఈ విషయాన్ని విల్మోర్ మీడియాకు వెల్లడించారు.

'గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు సర్దుకుపోయే క్రమంలో అసౌకర్యంగా ఉంటుంది. శరీరమంతా భారమైన భావన కలుగుతుంది. పెన్సిల్ ఎత్తినా వర్కౌట్‌తో సమానమవుతుంది' అని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తేలియాడుతూ ఉండే వ్యోమగాములు.. భూమి మీదకు వచ్చిన 24 గంటల్లో ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతూ ఉంటారు. ఇదేగాకుండా అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం కూడా వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవుతుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్ర రక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమిపైకి తిరిగి రావాల్సి ఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. దాంతో ఎనిమిది నెలలుగా వారు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వారు తిరిగి భూమి మీదకు బయల్దేరనున్నారు.



## మహాకుంభమేళాను పొడిగించండి

### సమాజ్‌వాది అధినేత అఖిలేష్ యాదవ్

**లక్నో, ఫిబ్రవరి 15:** ప్రపంచంలోనే అత్యంత భారీ ఆధ్యాత్మిక సమ్మేళనం మరో 11 రోజుల్లో ముగియనుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాను ఇప్పటిదాకా 50కోట్ల మంది హాజరైనట్లు యుపి ప్రభుత్వం వెల్లడించింది. కుంభమేళాలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు ఇంకా కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్నారు.ఈ క్రమంలో కుంభమేళాను పొడిగించాలని సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో కుంభమేళా రద్దీ దృష్ట్యా 75రోజులపాటు నిర్వహించారని, ఇప్పుడు తక్కువ రోజులు నిర్వహిస్తున్నారని ఇంకా ఎంతో మంది ప్రయాగ్‌రాజ్‌వైపు వస్తు న్నారు. ఈ క్రమంలో వాళ్లను నిరాశపర్చడం సరికాదు. కుంభమేళాను మరికొన్ని రోజులు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా అని అన్నారాయన. కుంభమేళా కోసం క్యూ కడుతున్న భక్తుల సంఖ్య తగ్గడంలేదని, రైళ్లు, బస్సులు నిండిపోతున్నాయన్నారు. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా గ్రహాల స్థితి గతులు, శాస్త్రాలను అనుసరించి 45రోజుల పాటు కొనసాగుతాయి. ఈయేడాది కుం భమేళా ఫిబ్రవరి 26 శివరాత్రి పర్వదినంతో ముగియనుంది.



## అదానీ అవినీతిని దాచిపెడుతున్న ప్రధాని మోడీ

### ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ప్రముఖ వ్యాపారవేత్త గౌతం అదానీ చేసిన అవినీతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దాచా పెడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ విషయం గురించి దేశంలో ఎవరైనా ప్రశ్నిస్తే మౌనం దాల్చే ప్రధానమంత్రి అదే ప్రశ్నను విదేశాల్లో ఎవరైనా అడిగితే అది వ్యక్తిగత విషయమని బదులిస్తారు అని రాహుల్ పేర్కొన్నారు. అదానీ అవినీతిని మోడీ అమెరికాలోనూ దాచిపెట్టారు అని ఆరోపించారు. అమెరికాలో జరిగిన ఒక ఉమ్మడి పత్రికా విలేకరుల సమావేశంలో అదానీ గురించి అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం. వసుధైక కుటుంబకం అనేది మా సంస్కృతి. ప్రపంచం యావత్తు ఒకే కుటుంబమన్నది మా భావన. ప్రతి భారతీయుడు నా వాడేనని నేను నమ్ముతాను అని మోడీ సమాధానమిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగిన చర్చల్లో అదానీ విషయం చర్చకు రాలేదని ఆయన మరో ప్రశ్నకు బదులిచ్చారు.



## అసోం-1,మేఘాలయ-2

### మద్యం సేవించే మహిళల్లో రికార్డు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** మద్యం సేవించడం అనేది ఒకప్పుడు పురుషుల్లోనే ఎక్కువగా ఉండేది. ఇపుడు మద్యం తాగే మహిళల సంఖ్యకూడా పెరుగుతోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే అస్సాంలో మద్యంసేవించే మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. దేశంలో మద్యపాన వినియోగంపై కేంద్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ మంత్రిత్వశాఖ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఈ సర్వే పూర్తి వివ రాలను ఇపుడు తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఎంతోఉంది. మహిళలు ఎక్కువగా మద్యంసేవించే రాష్ట్రాల్లో ఈశాన్యరాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఇకమద్యం సేవించే మహిళల విషయానికి వస్తే అస్సాంలో మద్యం సేవించే మహిళల సంఖ్య అత్యధికంగా ఉందని తేలింది. దేశవ్యాప్తంగా చూసుకుంటే దేశంలో 15-49 సంవత్సరాల వయసుగల మహిళల్లో సగటు మద్యపానం 1.2శాతం ఉండగా అస్సాం లో ఈ సగటు 16.5శాతానికి దగ్గరగా ఉంది. అస్సాం తర్వాత స్థానంలో మేఘాలయలో మద్యంసేవించే మహిళలసంఖ్య ఎక్కువగా ఉందని తేలింది.అక్కడ 8.7శాతం మంది మహిళలు మద్యం తాగుతున్నారు. ఇక ఈజాబితాలో అరు ణాచల్‌ప్రదేశ్ మూడోస్థానంలో ఉంది. పాశ్చాత్య సంస్కృతి ఎక్కువ ఉన్న ప్రాం తాలు రాష్ట్రాల్లో సహజంగా మహిళా మద్యం ప్రియులు ఎక్కువ ఉంటారు. ఎక్కడో కార్పొరేట్ నగరాల స్థాయి సంస్కృతి ఇపుడు పట్టణాలు, పల్లెలకు సైతం వ్యాపిస్తోంది. అందులోనూ ఈశాన్యరాష్ట్రాల్లో ఈ సంస్కృతి మరింత విచ్చలవిడిగా ఉంది. మద్యం పానం వల్ల కలిగే అన ర్థాలపై అవగాహన కల్పించకపోవడం వల్లనే ఇలా మద్యంప్రియులు పెరుగుతున్నట్లు కేంద్ర కుటుంబ ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడి అయింది.

## క్యాబ్‌డ్రైవర్‌తో ఘర్షణ..ఆపై లాడ్జిలో మాజీ ఎమ్మెల్యే మృతి

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** మాజీ ఎమ్మెల్యే కారు ఒక క్యాబ్‌ను వెనకనుంచి స్వల్పంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో క్యాబ్‌డ్రైవర్ ఆయనకు మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు చెంపలపై కొట్టుకున్నారు. ఈ ఘర్షణ తర్వాత అక్కడి లాడ్జిలోకి వెళ్లిన ఆ మాజీ ఎమ్మెల్యే కుప్పకూలి మరణించారు. సిసిటివిల్లో రికార్డయిన ఈ విడియోక్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది కర్ణాటకలోని బెళగావిలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం మహారాష్ట్రవాది గోమం తక్‌పార్టీకి చెందిన గోవా మాజీ ఎమ్మెల్యే లావూ మామ్లేదార్ కారులో వెళుతున్నారు. ఒక లాడ్జి సమీపంలో క్యాబ్‌ను ఆయన కారు ఢీకొట్టింది. ఈనేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేకు క్యాబ్‌డ్రైవర్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇది ముదిరి ఘర్షణకు దారితీసింది. దీనితో క్యాబ్‌డ్రైవర్ చెంపపై మామ్లేదార్ కొట్టారు. ఈ క్రమంలో ఆడ్రైవర్ మరింత రెచ్చిపోయాడు. మాజీ ఎమ్మెల్యే చెంపపై పలుమార్లు కొట్టాడు. ఇంతలో అక్కడున్న జనం జోక్యం చేసుకుని ఇద్దరిని విడిపించారు. ఘర్షణ తర్వాత మాజీ ఎమ్మెల్యే అక్కడే ఉన్న లాడ్జిలోకి వెళ్లారు. మెట్లు ఎక్కి లోపలకు వెళ్లిన వెంటనే కుప్పకూలి పడిపోయారు. ఆయనను హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసు కున్న పోలీసులుక్యాబ్ డ్రైవర్‌ను అరెస్టు చేసారు. కాగా ఆ లాడ్జిలోని సిసిటి విలో రికార్డయిన విడియో క్లిప్‌సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### శీష్‌మహల్‌పై విచారణకు ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఢిల్లీలో ముఖ్యమంత్రి అధి కారిక నివాసమైన శీష్‌మహల్ వ్యవహారం వివా దాస్పదమైన సంగతి తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నపుడు శీష్‌మహల్ పున రుద్ధరణలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కేంద్రం తాజా గా కీలకనిర్ణయం తీసుకుంది. బంగ్లాపై వస్తున్న ఆరోపణలపై విచారణకు ఆదేశించింది. కేంద్ర ప్రజాపనుల విభాగం నివేదిక సమర్పించిన తర్వాత ఈనెల 13న మగ్ర విచారణకు ఆదేశించింది. 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో 40 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉనన ఈ బంగ్లా ఆధునీ కరణకోసం నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. అయితే ఆ నివాసాన్ని బిజెపి శీష్ మహల్‌గా వర్ణించింది. అంటే అద్దాలమేడ కట్టుకున్నారని ఎద్దేవా చేసింది. సుమారు 80 కోట ప్రజాధనంతో మరమ్మతులు చేపట్టారు.


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కార్యాలయము, మణికొండ, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
నోటీసు నెం.ఇ1/472/2024-25, తేది: 15.02.2025
మణికొండ మున్సిపాలిటీ, రంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నం.ఇ1/472/2024-25, తేది: 18.02.2025, రూ.155.00 లక్షలు (5) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారమ్ కింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్‌దారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 28.02.2025, మ.3.30గం.వరకు.
సం/-.మునిసిపల్ కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ.
DIPR.NO. 10313-PP/CL/ADVT/1/2024-25
తేది: 15.02.2025



Before The Registrar/Addl/Joint/Deputy/Asst. Registrar/Erragadda, Hyderabad.
ABR CF No. 422 of 2016
Between:-
M/s. Bhavishyanidhi Chit Fund Pvt. Ltd. Disputant
And
Dulam Balaji & others Opponents
NOTICE
To
1. Sri. Dulam Balaji S/o Sri D. Venkateswar Rao H.No.11-13-20/2K, Snehapuri colony, Road No:19, kothapet, Hyderabad.
2. Sri D.Venkateswara Rao,S/o Sri D.Satyanarayana H.No.11-13 20/2k, snehapuri Colony, Road No.19, Kothapet, Hyderabad.
3. Smt D.V.Satya kumari, W/o Sri D. Venkateswar Rao, H.No.11-13 20/2k Snehapuri Colony, Road No.19,Kothapet, Hyderabad.
4. Smt D.Dhana Lakshmi,W/o Sri D.Balaji H.No.11-13 20/2k, Snehapuri Colony, Road No.19, Kothapet, Hyderabad.
Please take notice that, the above named Disputant company filed the above case against you all for Recovery of amount of Rs.4,54,225/- and the said case stands posted to 11-3-2025 for your apprance either in person or through counsel at about 3-00 PM before the above said court. Failing which the matter may be decided in your absence.
// By Order Of The Court //
sd/-
M/s P. Saraswathi
Advocate
Counsel for The Disputant



In The /Before The Registrar/Addl/Joint/Deputy/Asst. Registrar/Erragadda, Hyderabad.
ABR CF No. 421 of 2016
Between:-
M/s. Bhavishyanidhi Chit Fund Pvt. Ltd. Disputant
And
Dulam Balaji & others Opponents
NOTICE
To
1. Sri. Dulam Balaji S/o Sri D. Venkateswar Rao H.No.11-13-20/2K, Snehapuri colony, Road No:19, kothapet, Hyderabad.
2. Sri D.Venkateswara Rao,S/o Sri D.Satyanarayana H.No.11-13 20/2k, snehapuri Colony, Road No.19, Kothapet, Hyderabad.
3. Smt D.V.Satya kumari, W/o Sri D. Venkateswar Rao, H.No.11-13 20/2k Snehapuri Colony, Road No.19,Kothapet, Hyderabad.
4. Smt D.Dhana Lakshmi,W/o Sri D.Balaji H.No.11-13 20/2k, Snehapuri Colony, Road No.19, Kothapet, Hyderabad.
Please take notice that, the above named Disputant company filed the above case against you all for Recovery of amount of Rs.3,80,690/- and the said case stands posted to 11-3-2025 for your apprance either in person or through counsel at about 10.30 AM/3-00 PM before the above said court. Failing which the matter may be decided in your absence.
// By Order Of The Court //
sd/-
M/s P. Saraswathi
Advocate
Counsel for The Disputant



Before The Registrar/Addl/Joint/Deputy/Asst. Registrar/Erragadda, Hyderabad.
ABR C.F.No. 225 of 2020.
Between:-
M/s. Bhavishyanidhi Chit Fund Pvt. Ltd. Disputant
And
P. Pullaiah Goud & others. Opponents
NOTICE
To
1. P.Pullaiah Goud S/o P. Shankaraiah Goud, H.no 16-1-24/82, 98 and 99/2RT, Flat No.302, Star Sai Sadan Ramalayam Kaman, Ameen Road, Saidabad, Hyderabad-59. (or) H.NO 3-58/13/1, Vijayanagar Colony, Shadnagar, Farooqnagar 509216.
2. Rasala Lacha Goud S/o R.Venkataiah Goud, H.no 16-1-24/2, Flat No. 201, Lahari Chandana Apts, Saidabad, Hyderabad-56. (or) H.No MIG-II-120, ABHB Colony, Mahabubnagar.
3. Essthari Venkatesh S/o E.Krishna Qtr no.B 9, A.G Staff Qtrs, Yusufguda, Hyderabad. (or) Designation: Operator (E & M) O/O Asst Engineer(E) HCESD IV, CPWD, AG Office, Hyderabad.-
4. C.V.Rangavender Rao S/o C.Mattapalli Rao, Plot No.36, Flat No.TF-9,4th floor, J.Rama Rao Apts, Huda Complex, Saroornagar, Hyd-35.
5. Darpalli Narsimulu S/o D.Mahender, H.No 1-1-32/2354, Saibaba Nagar, Dammaiguda, Ecil Post, Hyderabad. (or) Desg: Jr Telecom Officer, Bharat Sachar Nigam Limited, Gowliguda, 306, 3rd Floor.Telephone Exchange, Gowliguda, Hyd.
6. P.Vani Goud W/o P.Pullaiah Goud, H.no 16-1-24/82, 98 and 99/2RT, Flat No.302, Star Sai Sadan Ramalayam Kaman, Ameen Road, Saidabad, Hyderabad-59. (or) H.No 3-58/13/1, Vijayanagar Colony,Shadnagar, Farooqnagar 509216.
Please take notice that, the above named Disputant company filed the above case against you all for recovery of amount of Rs.2,69,875/- and the said case stands posted to 11-3-2025 for your appearance either in person or through counsel at about 3-00 PM before the above said court. Failing which the matter will be decided in your absence.
// By Order Of The Court //
sd/-
M/s P. Saraswathi
Advocate, Counsel for The Disputant



मौलाना आज़ाद नेशनल उर्दू यूनिवर्सिटी
MAULANA AZAD NATIONAL URDU UNIVERSITY
A Central University under Ministry of Education
Government of India
ప్రవేశ ప్రకటన 2025-26
MANUU మోడల్ సీనియర్ సెకండరీ స్కూల్, హైదరాబాద్
CBSE కు అనుబంధం (అనుబంధం నం. 120001)
MANUU మోడల్ సీనియర్ సెకండరీ స్కూల్ హైదరాబాద్, 2025-26 విద్యా సంవత్సరానికి క్లాస్ I to IX మరియు XI లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బోధనా మాధ్యమం ఉర్దూ ఆసక్తి గల వారు వెబ్‌సైట్ www.manuu.edu.in నుండి రిజిస్ట్రేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తు ఫారం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.20/-తో స్కూలులో దాఖలు చేయవలెను.

| తరగతి | దాఖలుకు ప్రారంభ తేది | దాఖలుకు ఆఖరు తేది |
|---|---|---|
| క్లాస్ I | 3వ మార్చి 2025 | 22వ మార్చి, 2025 |
| క్లాస్ II to IX | 1వ ఏప్రిల్ 2025 | 15వ ఏప్రిల్, 2025 |
| క్లాస్ XI | (క్లాస్ X ఫలితాలు ప్రకటింపబడిన తర్వాత ప్రవేశాలు ప్రారంభించబడును) | |

కాంటాక్ట్ నంబర్ : 040-24473770 రిజిస్ట్రార్



DEBTS RECOVERY TRIBUNAL – II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD
O.A.NO. 408 OF 2024
Between:
IDFC FIRST BANK LIMITED "NOW"
EARLIER M/s CAPITAL FIRST LIMITED ...APPLICANT
A N D
KALISETTY KALYAN AND ANOTHER ...DEFENDANTS
SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED
To,
1. KALISETTY KALYAN
S/O KALISETTY SREENIVASA RAO
AGED ABOUT 43 YEARS, OCC: BUSINESS
H No: 2 2 120 VIJAYA PURI COLONY UPPAL NEAR RAMASWAMY FUNCTION HALL NEAR SAI BABA TEMPLE K.V. RANGAREDDY-500039
2. KALISETTY LAKSHMI ANURADHA
W/O KALISETTY KALYAN
AGED ABOUT 38 YEARS, OCC: BUSINESS
H No: 2 2 120 VIJAYA PURI COLONY UPPAL NEAR RAMASWAMY FUNCTION HALL NEAR SAI BABA TEMPLE K.V. RANGAREDDY-500039
Take notice that the Applicant has instituted the above application under Section 19 of the Recovery of Debts & Bankruptcy Act, 1993 against the above-named Defendants for recovery of a sum of Rs.68,91,599.27/- together with current and future interest, costs and for other reliefs.
The above mentioned Defendants is therefore hereby directed to appear before this Tribunal in person or through an Advocate or duly authorized agent, in support of his defense to show cause on 10-03-2025, at 10.30 AM, as to why reliefs prayed for should not be granted.
Take Notice that in case of default the application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this the 21st day of JAN, 2025.
SEAL
Sd/-
REGISTRAR
Debts Recovery Tribunal – II

# రాహుల్ కులం కోసమైనా దేశవ్యాప్త కులగణన చేపట్టండి

## పింక్ బుక్ ఓపెన్ చేస్తే వెలికిరానున్న ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లెన్నో : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాహుల్ కులం దేశవ్యాప్తంగా ప్రజలకు తెలుసు, బిజెపి నాయకులు ఆయన కులం తెలుసుకోవాలనుకుంటే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టండని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ సలహా ఇచ్చారు. శనివారం గాంధీభవన్‌లో మహేష్‌గౌడ్ మాట్లాడుతూ 1994లో మోడీ 'గాన్సి' అనే కులాన్ని బీసీలలో చేర్చారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా మోడీ లీగల్లి కన్వర్టెడ్ బీసీ అని అన్నారు. పదేళ్లలో ఒబిసి ప్రధాని మోడీ బీసీలకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు. కులగణన దేశ చరిత్రలో నిలిచిపోయే అంశమని అన్నారు. రేవంత్‌రెడ్డి అన్న మాటలకు బీజేపీ నేతలు హైరానా పడుతున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బండి సంజయ్ పుట్టకతో బిసి, మోడీ పుట్టుకతో బీసీ కాదు అందువల్లే బండి సంజయ్ కష్టపడి పనిచేసినా ఎన్నికల నాటికి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తీసుపడేసిండని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీల మీద బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనతో పాటు కులగణన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన రీసర్వే పూర్తి అయ్యాక చట్టం చేస్తామని అన్నారు. 9వ షెడ్యూల్ చట్టసవరణ చేసి దేశంలోని బీసీలకు కేంద్రంలో ఉన్న బీజేపీ మేలు చేయాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి మోడీ కులం గురించి తప్పు మాట్లాడలేదు. అమిత్‌షా కూడా దీనిని అంగీకరించారు. 24 జూలై 1994లో ఓసీ నుంచి ఓబీసీలలో మోడీ కులం చేర్చారు. రాహుల్‌గాంధీ తాత గురించి అనవసర మాటలు బీజేపీ మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబం త్యాగాలు మర్చిపోయి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు దేశం కోసం ఏం త్యాగం చేశారని ప్రశ్నించారు.

రాహుల్‌గాంధీ కులం దేశ ప్రజలకు తెలుసు. రాహుల్‌గాంధీ కులం అడుగుతున్న మీరు దేశంలో కులగణన చేసి ఆయన ఇంటికి వెళ్లి అడగండి. సోనియా గాంధీ ఇటలీలో పుట్టినా భారతీయతను పుణికి పుచ్చుకున్నారు. ఇప్పటికే ఢిల్లీ స్కాం బయట పడింది. పింక్‌బుక్ ఓపెన్ చేస్తే ఇంకా ఎన్ని స్కాంలు బయట పడతాయో తెలియదు. అందుకే పింక్‌బుక్ ఓపెన్ చేయవద్దు అని కవితకు సూచనలు చేస్తున్నానని ఆయన అన్నాను. కేంద్రమంత్రినని మర్చిపోయి బండి సంజయ్ మాట్లాడుతున్నారు. సెక్యులర్ దేశం అని బండి సంజయ్ గుర్తు పెట్టు కోవాలని మహేష్‌గౌడ్ హితవు చెప్పారు.

# గద్దర్ అవార్డులకు అత్యధిక నిధులు

## ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఫిల్మ్‌ఫెస్టివల్ నిర్వహణకు కేటాయింపులు

## లఘు చిత్రాల ప్రోత్సాహానికి ప్రభుత్వం చొరవ

## సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిధులు అత్యధికంగా కేటాయింపులు చేపట్టాలని సిన్మాటోగ్రఫి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. అంబెద్కర్ సచివాలయంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగిన సినిమాటోగ్రఫి బడ్జెట్ పద్దుల సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కొమటిరెడ్డి వెంకటరెడ్డి అంకెల చిట్టాను ముందుపెట్టి నిధులు కోరారు. తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాల చిత్రాలతో పరిచయం చేయడానికి చిల్డ్రన్ ఫిల్మ్‌ఫెస్టివెల్ ఆఫ్ తెలంగాణ నిర్వహణకు నిధులు కేటాయించాలని కొమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. అంతర్జాతీయ బాలల చిత్రోత్సవంతో పిల్లలకు ,ప్రజలకు ఆయా ప్రాంతాల సంస్కృతిపై అవగాహన కలుగుతోందని ఆయన ఆర్థిక మంత్రి భట్టి విమార్కకు వివరించారు. ఆదివాసి ప్రాంతాల పిల్లలను అనాథశ్రమాల పిల్లలను ఈ చిత్రాలను ఉచితంగా వీక్షించేలా చర్యలు చేపట్టా ల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. చిల్డ్రన్‌సైన్స్,నేచర్‌అండ్ వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌ఫెస్టివల్ ఆసక్తికరమైన చిత్రాలు బాలలకు చూపించాలని కొమటిరెడ్డి చిల్డ్రన్ ఫెస్టివెల్ ఏర్పాటు ప్రాధాన్యత వివరించి నిధులు కోరారు. లఘు చిత్రాలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమం వివరించేందుకు న్యూస్‌రీల్ వంటి వాటినిర్మాణంకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. ఐఅండ్‌పిఆర్ బడ్జెట్ పద్దులు కూడా మల్లభట్టివిక్రమార్క ముందు ఆయా శాఖలకు చెందని మంత్రులు సిబ్బంది పెట్టారు.

# నిబద్ధత గల నాయకురాలు దీపాదాస్ మున్షి

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జిగా పనిచేసిన దీపాదాస్ మున్షి నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ గల నాయకురాలని, ఆమె పార్టీని బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేశారని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆమె కేరళ ఎఐసిసి ఇన్ చార్జిగా ఉంటూ తెలంగాణలో యేడాదికాలంపాటు అదనపు బాధ్యతలు నిర్వహించారని వివరించారు. ఆమెపై జరగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అలాంటి నిరాధార వార్తలు రాస్తే చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలు ఉచితాలు ఎలా అవుతాయి?

## ప్రధాని మోడీ ఫ్యూడల్ వ్యవస్థ నుండి బయటకు రావాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** పేద ప్రజలు కష్టపడి సంపదను సృష్టిస్తూ, జిఎస్‌టి రూపంలో చెల్లిస్తున్న డబ్బులనే ప్రభుత్వాలు.. తిరిగి ప్రజలకు సంక్షేమం కోసం వినియోగిస్తున్నాయని.. అలాంటి సంక్షేమ పథకాలు ఎలా ఉచితాలు అవుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. దేశంలో ఎవరి సొమ్ము ఎవరూ తింటున్నారో తేల్చాల్సిన సమసయం ఆసన్నమైందన్నారు. ఇదే అంశంపై తమ పార్టీ ఆధ్వర్యంలో అన్ని వర్గాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కూనంనేని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని మీడియాతో మాట్లాడారు. ఉచితాలు తప్పంటూ ప్రధాని మోడీ, జయ ప్రకాశ్ నారాయణ వంటి కొం దరూ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడు తుంటా రని.. కానీ సుప్రీం కోర్టు న్యాయ మూర్తులు కూడా ఇలాంటి వ్యాఖ్యాలు చేయడం దురదృష్ట కరమన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని.. ఇతర పనులకు కూడా ఎవ్వరూ రావడం లేదని న్యాయకోవిదులైన న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఫ్యూడల్ వ్యవస్థ నుండి బయటకు రావాలని హితువు పలికారు. పేదలు బాగా చదువుకుని ఆర్థిక పరిస్థితి మెరుగుపడి వారి కొనుగోలు శక్తి పెరిగినప్పుడే ఈ దేశం ఆర్థికంగా పురోగాభివృద్ధి చెందుతుందనే విషయాన్ని దేశ పాలకవర్గం, మేధావివర్గం గుర్తించకపోవడం దురదృష్టకర మన్నారు. దేశంలో జిఎస్‌టి రూపంలో సుమారు రూ.23 లక్షల కోట్లు సమ కూరుతుండగా.. అందులో 10 శాతం మాత్రమే సంపన్నులదని, మిగిలిన 90 శాతం దేశంలోని మధ్యతరగతి, పేద, నిరుపేదలు చెల్లిస్తున్నారని వివరించారు. మోడీ అధికారం చేపట్టిన వెంటనే 30 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నులు 28 శాతానికి తగ్గించి, వారికి ప్రతి యేటా సుమారు రూ.5 లక్షల కోట్లు లాభం చేకూర్చారని.. మరి ఇలాంటి వాటిని ఏమంటారని కూనంనేని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కులగణనను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి పార్లమెంట్ కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్లను పెంచి చేతులు దులుపుకోకుండా.. సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలని సూచించారు.



శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

# ఎసిబికి పట్టుబడిన ఎస్ఐ సస్పెన్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా ధారూర్ ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌ను మల్టీ జోన్ ఐజి 2 సత్యనారాయణ సస్పెండ్ చేశారు. ఈ మేరకు శని వారం ఐజి ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ ఈ నెల 11వ తేదీన 30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసికి దొరికిపోగా ఆయనను వెంటనే అ రెస్టు చేసి జైలుకు తరలించడం తెలిసిందే. ఇదే సమయంలో లంచం సొమ్మును కూడా జప్తు చేయడం విదితమే. దీనిపై విచారించిన మల్టీ జోన్ ఐజి 2 సత్యనారాయణ ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్‌ను సస్పెండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి లక్ష్మణ్

# సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజల్లో తీవ్రనిరాశ

## రాష్ట్రంలో బిజెపికే భవిష్యత్: ఎంపి లక్ష్మణ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టివేయగా అదే బాటలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగతుందని ఎంపి డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, గ్యారెంటీలకు తూట్లు పొడుస్తూ చెల్లని రూపాయిల పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కనీసం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని స్థితిలో ఉందన్నారు. దీంతో పదవి విరమణ పొందిన ఉద్యోగులు కోర్టుకు వెళ్లి బెనిఫిట్స్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిజెపికే భవిష్యత్ ఉంటుందని రోజు రోజుకూ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందని బిఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. రాహుల్‌గాంధీకి మూడు సార్లు పట్టిన గతియే రాబోయే రోజుల్లో సిఎం రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు.

# మోడీని చులకనచేసి రేవంత్ మాట్లాడలేదు

## ఎమ్మెల్యేగా ఓడిపోయాక చిలకజోస్యం చెపుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బండి సంజయ్ కేంద్ర మంత్రి హోదాలో ఉండి రాహుల్ గాంధీపైన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నా మోదీ కులం పైన సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా చుల కన చేసి మాట్లాడలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ అన్నారు. శనివారం సిఎల్‌పి కార్యాల యంలో మీడియాతో మాట్లా డుతూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బండి సంజయ్ వక్రీకరించి మాట్లాడు తున్నాడని ఆవేదన చెందారు. ఎర్రబెల్లి దయాకర్ రావు ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత చిలక జ్యోతిష్యం చెపుతున్నాడుని ఎగతాళి చేశారు. ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అంతగా జ్యోతిష్యం తెలిస్తే ఫాంహౌస్ లో పడుకున్న కేసీఆర్ ఎప్పుడు లేస్తాడో చెప్పాలని సవాల్ చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసు లో కేటీఆర్ ఎప్పుడు జైలు కు పోతాడో చెప్పాలని ప్రశ్నించారు. నలభై ఏళ్ల రాజకీయాల్లో ఉండి చిన్న అమ్మాయి చేతిలో చిత్తు గా ఓడిపోయినా సిగ్గు రాలేదా? అని శ్రీనివాస్ నిలదీశారు. బీఆర్ ఎస్ లో ఉన్న ఎర్రబెల్లికి కాంగ్రెస్ విషయాలు ఎలా తెలుస్తున్నాయి? అని సందేహం వ్యక్తంచేశారు. మా ఎమ్మెల్యేలు గురించి ఎర్రబెల్లి ఆలోచించాల్సిన అవసరం లేదు ఇప్పటికే మీ వాళ్లు10 మంది పోయారు. మిగిలిన వారినైనా కాపాడుకో అని ఆయన హితవు చెప్పారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన ను ఓర్వలేకనే ఎర్రబెల్లి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ ఒకే సారి చేసిన ప్రభుత్వం మాది అని స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. మా ప్రభుత్వం స్థిరంగా ఉంది,అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఎందుకు మా ప్రభుత్వం కూలిపోతుందని ఆయన ప్రశ్నించారు.

# ఆర్టీసీ ప్రకటనల సొమ్ము ఎగవేత

## 'గో రూరల్' ఆస్తుల అటాచ్ చేసిన ఇడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఆర్టీసీకి బస్సులపై ప్రకటనల నిమిత్తం కట్టాల్సిన సొమ్ము ఎగవేసిన 'గో రూరల్ ఇండియా సంస్థ' విలువైన స్థిరాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అటాచ్ చేసింది. ఈ దుర్వినియోగానికి సంబంధించి అటాచ్ చేసిన స్థిరాస్తుల్లో హైదరాబాద్‌లోని ఆ సంస్థకు చెందిన రూ. 6.47 కోట్ల ఆస్తులున్నాయి. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులపై ప్రకటనలు సేకరించేందుకు గో రూరల్ సంస్థ ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఒప్పందం ప్రకారం మొత్తాన్ని ఆర్టీసీకి జమ చేయ లేదు. మెస్సర్స్ గో రూరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్టీసీతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి ఆర్టీసీ ప్రకటనలపై వచ్చిన ఆదాయాన్ని సంస్థకు చెల్లించకపోగా, వారి ఆధీనంలోనే ఇతర సంస్థలకు సదరు సొమ్మును తరలించిందని ఇడి దర్యాప్తులో తేలింది. మెస్సర్స్ గో రూరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని ప్రమోటర్లు, డైరెక్టర్లపై పోలీసులు భార తీయ శిక్షా స్మృతి కింద దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఇడి దర్యాప్తు ప్రారంభించింది. వాటిలో గో రూరల్ ఇండియా ప్రైవేట్ లిమి టెడ్, పోస్టర్ టౌన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గో ట్రాన్సిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, లైమ్ లైట్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి, వీటిలో ఏ సంస్థలు ఆర్టీసీ ప్రకటనలను నిర్వహించడానికి అధికారం కలిగినవి కావు. తదుపరి దర్యాప్తులో ఆ సంస్థ వసూలు చేసిన నిధులను రుణ చెల్లింపులు, ఆభరణాల కొనుగోళ్లు, వాహన సేకరణ, రియల్ పెట్టుబడులు వంటి వ్యక్తిగత ఖర్చుల కోసం మళ్లించారు. ఇలా మొత్తం ఆదాయాన్ని మోసపూరితంగా మళ్లించడం కోట్లాది రూపాయల మేరకు డిఫాల్ట్ అయింది. ఈ విషయంపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు నిర్ధారించారు.



రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి ప్రతినిధి బృందం

# ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు

## రవీందర్‌రెడ్డిపై చర్యల కోసం రాష్ట్ర ఎన్నికల అధికారికి బిజెపి నేతల ఫిర్యాదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వంగరవీందర్ రెడ్డి ఎన్నికల ప్రవర్తన నియ మావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రం అందించారు. శనివారం భారతీయ జనతా పార్టీ ప్రతినిధి బృందం బంగారు శృతి నేతృత్వంలో శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని బూర్గుల రామ కృష్ణారావు భవన్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రతినిధి బృందంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు, ఆర్టిఐ జాయింట్ కన్వీనర్ పవన్ మైత్రేయ తదితరులు ఉన్నారు.

వంగ రవీందర్‌రెడ్డి తన తమ్ముడు మహేందర్ రెడ్డి అనుకూలంగా తన అసోసియేషన్ ఉపయోగించి మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో వివిధ జిల్లాల జిల్లా విద్యాధికారులను మండల విద్యాధికారులను టీచర్లను భయపెట్టిస్తూ మహేందర్ రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని ప్రభావితం చేస్తున్నారన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రవీంద్‌రెడ్డిపై ఎన్నికల ప్రవర్తన నియమాలు అనుసరించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# చిన్నారుల కోసం కేన్సర్ సహాయనిధి

## కేన్సర్ హాస్పిటల్‌లో అత్యాధునిక పిడియాట్రిక్ వార్డు, ఐసియును ప్రారంభించిన బాలకృష్ణ

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రపంచ చిన్నారుల కేన్సర్ రోజును పురస్కరించుకొని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో సరికొత్త పిడియాట్రిక్ ఐసియు వార్డును ప్రారం భించారు. శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఛైర్మన్ నందమూరి బాల కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ వార్డుతోపాటు పిఐసియును రోగులకు అందుబాటులోకి తెచ్చారు. అంతేగాకుండా కేవలం క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా సహాయనిధిని బాలకృష్ణ ప్రారంభించారు. ఈ నిధి ద్వారా పేదవారైన చిన్నారుల చికిత్స కోసం ఆర్థిక సహాయం అందిస్తారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ నేటి చిన్నారులకు విద్య, వైద్యం అందించడం ఎంతో అవసరమని అన్నారు. చిన్నారులకు కేన్సర్ వస్తే మొత్తం కుటుంబం తల్లడిల్లిపోతుందని, అలాంటి వారికి అవసరమైన అత్యా ధునిక చికిత్స అందించడంలో హాస్పిటల్ ఎల్లవేళలా ముందంజలో ఉందని వివరించారు. 12 పడకలతో ప్రారంభమైన పిడియాట్రిక్ వార్డులో 120 పడకల వరకూ పెంచామని చెప్పారు. సాధారణ కీమో థెరపీ నుండి అత్యాధునిక బి యంటి సదుపాయం వరకూ ప్రస్తుతం హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకొని వచ్చామని 200 వందలకుపైగా బియంటి చికిత్సలు కేన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు అందించామని వివరిస్తూ ఇది దేశంలోనే అత్యధికమని చెప్పారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో సరికొత్త హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించుకోనున్నామని వెల్లడించారు. నేడు హాస్పిటల్ ప్రారంభించిన చిన్నా రుల ప్రత్యేక నిధి అవసరాన్ని ప్రస్తావిస్తూ నానాటికీ పెరుగుతున్న చిన్నారుల కేన్సర్ కేసులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేకనిధిని ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నందమూరి బాలకృష్ణతోపాటు జెఎస్ఆర్ ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు, డా. కె కృష్ణయ్య, డా టియస్‌రావు, మెడికల్ డైరెక్టర్, డా ఫణికోటేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డా. సెంథిల్ రాజప్ప, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. వీరేంద్రపాటిల్, పిడియాట్రిక్ ఆంకాలజిస్టు తోపాటు ఇతర వైద్యులు, వైద్యసిబ్బంది, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది, కేన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.






రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

# బిసిలకు 56శాతం రిజర్వేషన్లు కల్పించాలి: కవిత

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీలకు విద్య,ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కలిపి 56శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిఆర్ఎస్ రాష్ట్ర రాజకీయ నాయకురాలు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బీఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిలు 46శాతం ఉన్నారని, ముస్లిం బీసీలతో కలిపి మరో 10శాతం ఉంటారని మొత్తం 56శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నారని ప్రభుత్వం తప్పుడు లెక్కలు ద్వారానే తెల్చారని ఇంకా బీసీ జనాభా రీ సర్వేలో 2శాతం పెరిగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. బిసి జనాభా ఎంత శాతం మాత్రం ఉన్నారో ఆ మేరకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని పేర్కొన్నారు. ఖమ్మంలోని శనివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీలకు కేవలం 42శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొనడం సిగ్గు చేటు అన్నారు. ఆసెంబ్లీలో విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో 56శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 3 బిల్లులు వేర్వురుగా ప్రవేశ పెట్టాలని ఆమె పేర్కొన్నారు. ఈ మూడు రంగాలకు కలిపి ఒకే బిల్లు శాసనసభలో పెడితే న్యాయపరమైన చిక్కులు వస్తాయని ఏ ఒక్క అంశంపై అయినా ఎవరైనా కోర్టుకు వెళితే మొత్తం బిల్లు చెల్లకుండా పోతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బిసి జనాభాను మోసగించి ఓట్లు దండుకొనే పనిలో ఉందని ఆమె తేల్చి చెప్పారు.

### బిఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం సమీపంలో విలేజ్ ఆహారం హోటల్ వద్ద మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలలో విజయం సాధించేలా ఇప్పటినుండే ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కవిత సూచించారు.

# అందమైన చేతిరాత కోసం విద్యార్థులకు టి-శాట్ ప్రత్యేక పాఠాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అందమైన చేతి రాత కోసం విద్యార్థులకు టి-సాట్ ప్రత్యేక పాఠాలు (టి.సాట్ సాఫ్ట్ నెట్) ప్రసారం చేయనుంది. అందమైన చేతిరాత కళను విద్యార్థులందరికీ పంచేందుకు టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రసారం చేయనుంది. ఈ నెల 16 ఆదివారం మధ్యాహ్నం 12 నుండి 1 గంట వరకు కాలిగ్రఫీ అందమైన చేతిరాత కోసం ప్రత్యక్ష కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నట్లు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు చేతి రాత సరిగా లేక అనేక ఇబ్బందులు పడటమే కాకుండ.. పరీక్షల్లో మార్కులు కోల్పోతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అనుభవం కలిగిన హ్యాండ్ రైటింగ్ నిపుణుల చేత ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రసారం చేయనున్నట్టు సీఈవో స్పష్టం చేశారు. జర్మనీలో విద్యనభ్యసించే ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి ఇప్పటికే జర్మన్ లాంగ్వేజ్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని టి-సాట్ ప్రసారం చేసిందని గుర్తు చేశారు. కాలిగ్రఫిపై సందేహాలకు 040-23540326/726 నంబర్‌కి లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 4039 లకు కాల్ చేయాలని సూచించారు. బుక్ రివ్యూ (పుస్తక సమీక్ష) 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచే విధంగా పుస్తకాల సమీక్ష కార్యక్రమం నిర్వహించేందుకు తెలంగాణాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల నుండి నామినేషన్లు ఆహ్వానించిందని.. రచయిత రచించిన పుస్తక సారాంశాన్ని సంక్షిప్తంగా వివరిస్తే, విద్యార్థులకు అదనపు జ్ఞానాన్ని అందించిన వారమవుతామని, పుస్తక సమీక్షపై ఆసక్తి ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ తమ పేర్లతో కూడిన వివరాలను టి-సాట్ నిపుణకు మేయిల్ చేయాలని లేదంటే 7337558051 ఫోన్ చేసి అందచేయాలని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

# సిపిఎస్ రద్దుకే టిటిఎఫ్ మద్దతు

## కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికే మా మొగ్గు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఎస్‌ను రద్దు చేయడం కోసం పోరాడుతున్న సీపీఎస్ సంఘం బలపరచిన కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఇన్నారెడ్డికి తమ మద్ధతు ఉంటుందని తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్(టీటీఎఫ్) ప్రకటించింది. సీపీఎస్ సంఘం తరపున కరీంనగర్- ఆదిలాబాద్-నిజామాబాద్- మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సీపీఎస్ సంఘం తరపున బరిలో ఉన్న తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్టు సంఘం రాష్ట్రన ప్రధాన కార్యదర్శి గణేష్ రాథోడ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన మద్ధతు లేఖను ఎమ్మెల్సీ అభ్యర్థి ఇన్నారెడ్డికి శనివారం అందజేశారు. ఫిబ్రవరి 27న జరగనున్న కరీంనగర్- మెదక్ -నిజాంబాద్ -ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. సీపీఎస్ రద్దు గురించి తమ మద్దతు సీపీఎస్ సంఘం అభ్యర్థి అయిన ఇన్నారెడ్డి గిరిజన ఉపాధ్యాయులందరూ వెన్నంటే ఉంటారని గణేష్ రాథోడ్ తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తామని మద్దతు లేఖ అందజేశారు. సీపీఎస్ సంఘ అభ్యర్థి ఇన్నారెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియ చేసినందుకు సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్‌లు టీటీఎఫ్ సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్ రద్దుతో,పాటు ఏజెన్సీ ప్రాంతంలో ప్రమోషన్లు నియామకాలు గిరిజనులకే చెందేలా చూడాలని టీటీఎఫ్ నేతలు కోరారు. ప్రమోషన్లలో ఆడేక్వేసి పదాన్ని తొలగించేలా, షెడ్యూల్ 5 ప్రకారం 317 జీవోను సరిచేయాలని..గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న పండితులు పీఈటి లను అప్‌గ్రేడ్ చేసేలా చూడాలని.. టీఆర్‌టీల రెగ్యులర్ కొరకు కృషిచే యాలన్నారు. ఆదిలాబాద్‌బిడ్డగా గిరిజన ఉపాధ్యాయ సోదరుల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని ఇన్నారెడ్డి టీటీఎఫ్ నేతలకు హామీ ఇచ్చారు.

# కోడ్ లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి

### ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేకదృష్టి పెట్టండి

### డిజిటల్ భూసర్వేకు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

### ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 15:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేనటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హౌజింగ్ అధికారులను సూచించారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవిన్యూ, హౌసింగ్,సమాచార శాఖ ఉన్నత అధికారులతో 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సమీక్షించారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వడానికి ఈ ఏడు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమన్నారు. వివాదాల కారణంగా కోర్టు కేసుల్లో ఉన్న ప్రభుత్వ భూములను సాధించుకోవడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిపి,ఏజీపీలతో ప్రభుత్వ భూవివాద కేసులకు సంబంధించి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వానికి దక్కే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సినిమా కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘు చిత్రాలను తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఆలోచనలను, ప్రభుత్వ పథకాలను లఘు చిత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడానికి కావలసిన చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆవుటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం శాట్ లైట్ టౌన్ షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ మహానగరంలో మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి ఇండ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, కావాల్సిన భూమి కొరకు రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించి భూమిని సేకరించుకోవా లన్నారు. గత ప్రభుత్వాలు ఎస్ఆర్ నగర్, బర్కత్‌పుర, కూకట్‌పల్లి, ఈసీఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి పేరిట ఇండ్ల నిర్మాణాలు చేయడం వల్ల ఎంతో మంది మధ్యతరగతి ప్రజలు సొంతింటి కల నెరవేరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డిజిటల్ భూ సర్వేకు సంబంధించి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల జాబితాను సేకరించి,ప్రతి నెల అద్దె చెల్లించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా ఒక సెక్షన్ ను ఏర్పాటు చేయాలన్నారు.

కాలుష్యం లేనటువంటి గ్రీన్ ఎనర్జీని ప్రభుత్వం ప్రోత్స హిస్తున్నందున అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సంపద సృష్టించి ఆ సంపదను ఈ రాష్ట్ర ప్రజలకు పంచడమే ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, ఈ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు ప్రత్యామ్నాయ వనరులను సమీకరించడంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రెవిన్యూ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ ఎండి గౌతమ్. సమాచార కమిషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.


శనివారం సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ ఉన్నత అధికారులతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## టిజిసెట్‌కు తగ్గిన దరఖాస్తులు!

### గత యేడాది 1.20 లక్షలు రాగా

### ఈ సంవత్సరం 85 వేలే.. 23న పరీక్ష నిర్వహణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీసెట్)–2025కి సుమారు 85వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. గత ఏడాది కంటే ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య బాగా తగ్గింది. గత ఏడాదిలో నిర్వహించిన టీజీసెట్–2024కి 1,20,654 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈ ఏడాది సుమారు 85వేలు మాత్రమే దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గురుకులాల పేరుతో రెసిడెన్షియల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ప్రత్యేకంగా పరీక్షను నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఎస్సీ గురుకులాలు 232 ఉండగా.. వాటిలో 141 బాలికలవి.. 91 బాలురవి ఉన్నాయి. వాటిలో 18,560 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎస్టీ గురుకులాలు 82 ఉంటే 46 బాలికలవి.. 36 బాలురవి ఉన్నాయి. వాటిలో 6560 సీట్లున్నాయి. ఇక బీసీ గురుకులాలకు సంబంధించి మొత్తం 294 ఉంటే వాటిలో 146 బాలికలవి ఉంటే.. 148 బాలురవి ఉన్నాయి. మొత్తం బీసీ గురుకులాల్లో 23,680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్ 35 ఉండగా.. వాటిలో 20 బాలికలవి.. మరో 15 బాలురవి ఉన్నాయి. వాటిలో 3168 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్ 643 ఉంటే.. వాటిలో 51,968 సీట్లు గత ఏడాది 2024–25లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 23న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.




## టీం ఛాంపియన్‌షిప్ సాధించిన తెలంగాణ పోలీసు విభాగం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జార్ఖండ్‌లోని రాంచిలో జరిగిన 68వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసు జట్టు టీం విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించింది. ఈ నెల పదవ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగిన ఈ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసు విభాగం ఆరు బంగారు పతకాలతో పా టు మరో నాలుగు వెండి పతకాలు, ఎనిమిది కంచు పతకాలను సాధించి ఓవరాల్ టీం ఛాంపియన్ షిప్‌ను అందుకుంది. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాం టి సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్ కాంపిటేషన్ విభాగాల్లో తెలంగాణ పోలీసు క్రీడాకారులు పతకాలను అందు కున్నారు. రాంచిలో శనివారం జరిగిన వేడుకల్లో ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి రాధాకృష్ణ కిషోర్ తెలంగాణ పోలీసు జట్టుకు టీం ఛాంపియర్ షిప్ ట్రోపిని అందజేశారు. రాష్ట్ర పోలీసు జట్టు తరపున సిఐడి ఎస్‌పి రాం రెడ్డి దీనిని అందుకున్నారు. కాగా అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో టీం ఛాంపియన్ షిప్ సాధించిన తెలంగాణ పోలీసు విభాగాన్ని డిజిపి జితేందర్ అభిన ందించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులు చూపిన ప్రతిభను కొనియాడారు. జట్టు సమిష్టిగా కృషి చేసినందునే టీం ఛాంపియన్ షిప్ వచ్చిందని డిజిపి తెలిపారు. రాష్ట్ర పోలీసు క్రీడాకారులు భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## 6 నెలల పాటు వ్యవసాయ సహకార పాలకవర్గ గడువు పొడిగింపు

### ఊపిరి పీల్చుకున్న జిల్లా సహకార బ్యాంకుల ఛైర్మన్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 904 సహకార సంఘాలు కాలపరిమితితోపాటు 9 డీసీసీబీ ఛైర్మన్ల పదవి కాలాన్నీ మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల ఛైర్మన్లు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 16వ తేదీతో పాలవర్గాల పదవీ కాలం ముగియనున్నప్పటికీ పాలకవర్గం పదవీకాలం 6 నెలల పాటు పొడిగించడంతో ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు. రాష్ట్రంలోని 148 వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలవర్గాలను ఇటీవల దశల వారీగా సర్కార్ నియమించింది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గాలకు పదవీ కాలం ముగియడంతో వాటిని ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 2020 ఫిబ్రవరి రెండో వారంలో సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించారు. అనంతరం ఆఫీస్ బేరర్ల, డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల పదవులకు ఎన్నిక నిర్వహించారు. ఈ నెలలో వీటి పదవీ కాలం ముగియాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పొడిగించింది. సాధారణంగా పాలక వర్గాల పదవీ కాలానికి ఆరు నెలల సమయం ఉండగానే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతా యోనన్న చర్చ రాష్ట్ర వ్యాప్తంగా సాగుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే గ్రామ పంచాయతీ మండల, జిల్లా పరిషత్తులు, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. మరోపక్క ఇటీవల ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు స్వీకరించింది. అయితే వాటిని ఏర్పాటు చేయకుండా ఆ ప్రతిపాదనలను పక్కనపెట్టింది. గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలను మరో సంఘంలో విలీనం చేశారే తప్ప కొత్తవి ఏర్పాటు చేయలేదు. పలు పాత, కొత్త మండల కేంద్రాల్లో సైతం సంఘాలు ఏర్పాటు చేయలేదు. కొత్త సంఘాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిన తదపరే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్‌లో గంజాయి ముఠాపై టాస్క్‌ఫోర్స్ దాడి

### ఐదుగురి అరెస్టు.. మరో ముగ్గురికి నోటీసులు జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో గంజాయి విక్రయిస్తున్న ముఠాపై శనివారం నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా అందిన సమాచారం ఆధారంగా రామ్‌నగర్ రిసాలా ప్రాంతానికి చెందిన మహ్మద్ సిద్దిక్(23), మహ్మద్ షోయబ్(25), రిసాలకు చెందిన మహ్మద్ నసీర్(20), బేగంపేటకు చెందిన పీకా జతిన్ అలియాస్ బ్రేవో(21)లు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ బస్‌భవన్ ఎదురుగా ఉన్న రోడ్డులో గంజాయి సేవించడానికి గూమికూడి మత్తుపదార్థాల కోసం బేరసారాలు చేస్తున్న సమయంలో వీరందరిపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకుని చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు ఐదుగిరిని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు. కాగా మరో ముగ్గురు అయిన బేగంపేట ప్రాంతానికి చెందిన పీకా ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్ ఖాన్(20), తిరుమలగిరి ప్రాంతానికి చెందిన షిగ్గరి విగ్నేష్(26)లకు నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ వివరించారు. అరెస్టు అయిన వారి వద్ద నుంచి రూ.12వేల 270 విలువ చేసే 300గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలను సేవించినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 2008 డిఎస్‌సి అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టింగులు

### శుక్రవారం రాత్రి జిఒ.. శనివారం కౌన్సెలింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008లో నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగానే పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి జిల్లా డీఈవోలకు 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రొసిడింగ్స్ జారీ చేశారు. దీంతో శనివారం హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహించిన డీఈవోలు 1382 మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

2008 డీఎస్సీలో నష్టపోయిన వారిలో 1,382 మంది బీఈడీ అభ్యర్థులకు విద్యాశాఖ శుక్రవారం పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 14న విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా జారీ చేశారు. కాంట్రాక్టు విధానంలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)గా నియమిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. వారికి రూ. 31,040 కన్సాలిడేటెడ్ వేతనం ఇవ్వనున్నట్టు ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఉమ్మడి ఏపీలో 2008లో నిర్వహించిన డీఎస్సీలో చివరి నిమిషంలో ఎస్‌జీటీల నియామకం కోసం తీసుకున్న నిర్ణయంతో మంచి మార్కులు సాధించి, మెరిట్ జాబితాలో ఉన్నా బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు. నష్టపోయిన వారు ఆ తరువాత కాలంలో న్యాయపోరాటానికి దిగారు. ఈ క్రమంలో వారికి ఉద్యోగాలను ఇవ్వాలని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునిచ్చింది. ఈ నెలలో జరిగిన విచారణ సందర్భంగా వారికి త్వరలోనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పడంతో.. కేసును ఈ నెల 17కి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నియామకం కోసం ఉత్తర్వులు జారీ చేయడం.. శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి వారికి కాంట్రాక్టు విధానంలో మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తూ పాఠశాల విద్యాశాఖ నియామకాలను పూర్తి చేసింది.

## పాల బకాయిలు త్వరలో చెల్లిస్తాం

### రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** తెలంగాణలోని పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న పాల బకాయిలను త్వరలో చెల్లించనున్నట్లు రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పాడి రైతులకు కేవలం రెండు నెలల బిల్లులు మాత్రమే పెండింగులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బిల్లులు మాత్రమే బకాయి ఉన్నాయని వివరించింది. అయితే ఐదు బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయని జరుగుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని తెలిపింది. ఆ ప్రచారాలన్నీ అవాస్తమని ఆ ప్రకటనలో తేల్చి చెప్పింది. కాగా గత నెల జనవరికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్ల రూపాయలను విడుదల చేసిందని పేర్కొంది. ఈ మొత్తాన్ని ఇవాళ, రేపట్లో రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తామని తెలిపింది. ఇక పెండింగ్‌లో ఉన్న రెండు నెలల బిల్లులకు సంబంధించి 50.65 కోట్ల రూపాయలను త్వరలోనే ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీంతో రైతుల బకాయిలను త్వరలోనే క్లియర్ చేస్తామని వెల్లడించింది.

## యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పవర్ ప్లాంట్‌ల్లో ప్రమాద సంఘటన జరిగింది. నల్లగొండ జిల్లాలోని యాదాద్రి పవర్‌ప్లాంటులో ఈ ప్రమాదం జరిగింది. యాష్ ప్లాంట్ ఈఎస్‌పీ వద్ద కాలిన బూడిద పడి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్లాంటులోని రెండో యూనిట్ నుంచి ప్రస్తుతం 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పతి చేస్తున్న క్రమంలో ఈఎస్‌పీ వద్ద యాష్ జామ్ కావడంతో ట్రిప్ అయ్యి బాయిలర్ నిలిచిపోయింది. జామ్ అయిన యాష్‌ను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా వేడి బూడిద మీద పడి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అంబులెన్సులో మిర్యాలగూడకు ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో దవాఖానకు తీసుకెళ్లారు.

## ఇంటర్ మెమోలో ఫొటోలు తప్పుగా ప్రింట్?

### ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరిన బాధిత విద్యార్థులు

### తప్పులను ఎప్పుడో సరి చేశామంటున్న ఇంటర్ బోర్డు అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఇంటర్ బోర్డు ముద్రించిన మెమోల్లో కొందరు విద్యార్థుల ఫోటోలు తప్పుగా ప్రింట్ కావడంతో.. ఇంజనీరింగ్‌లో చేరిన వారు ఇబ్బంది పడుతున్నట్టు బాధిత విద్యార్థులు సుమారు 60 మంది చెబుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఉయ్యాలవాడ బీసీ వెల్ఫేర్ జ్యోతిరావు పూలే కాలేజీ, కోడేరు బీసీ వెల్ఫేర్ జ్యోతిరావు పూలే కాలేజీకి చెందినవారు. 2024లో ఇంటర్ పాస్ అయినట్టు బాధిత విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థులంతా వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరినప్పటికీ... మెమోలు సరిగా లేకపోవడంతో కాలేజీలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు బాధిత విద్యార్థులు చెబుతున్నారు.

ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి మెమోలను సరిచేయాలని బాధిత విద్యార్థులు కోరుతున్నారు. అయితే ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం .. మెమోల్లో తప్పులు ఉండి తమను సంప్రదించిన వారందరికీ ఆయా తప్పులను సరిచేశామని చెబుతున్నారు.

ఇప్పుడు తప్పులు జరిగాయని అంటున్నారంటే.. ఇన్ని రోజులు ఏమీ చేశారని.. విద్యార్థుల ఫోటోలను చూసుకోకుండానే కాలేజీల్లో ఎలా చేరుతారని ప్రశ్నిస్తున్నారు. ప్రతి సంవత్సరం కూడా కాలేజీలు సమర్పించే వాటిల్లో తప్పులుండటంతో.. వాటిని కాలేజీలు తమ దృష్టికి తీసుకురాగానే వెంటనే సరిచేస్తుంటామని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

## మార్చికల్లా మెట్రో డిపిఆర్‌లు సిద్ధం

### సిఎం ఆలోచనలకు అనుగుణంగా కొత్త మెట్రో రైల్ కారిడార్లు

### మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చి దిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షను నెరవేర్చే దిశగా మెట్రోరైల్ విస్తరణ కార్యక్రమాలను చేపడు తున్నట్టు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. పర్యావరణ హితంగా హైదరాబాద్ ఉండాలన్న లక్ష్యయంతో కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసి) గ్రీన్ తెలంగాణ సమ్మిట్ 2025 లో భాగంగా జరిగిన గ్రీన్ క్రూసేడర్స్ కార్యక్రమంలో ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మార్గాల్లో రాబోయే మెట్రో కారిడార్లకు సంబంధించి డీపీఆర్ మర్చి నెలకల్లా సిద్ధం చేసి కేంద్రానికి పంపుతామని వెల్లడించారు. కొత్త మెట్రో మార్గాలు హైదరాబాద్ రూపురేఖలనే మర్చి వేస్తాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ నాలుగు వైపులా మెట్రో రైల్ నడపాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకూ అనుగుణంగా తగిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ఈ అభివృద్ధి ద్వారా హైదరాబాద్ అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన హరిత నగరంగా మారబోతుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో పలు ప్రాజెక్టులు హరితమయంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యయంతో ఐజీబీసిలలో గ్రీన్ క్రూసేడర్స్‌గా నమోదు చేసుకున్న వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు ఎన్వీఎస్ రెడ్డి నమోదు పాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీబీసి నేషనల్ వైస్ ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి, హైదరాబాద్ ఛైర్మన్ జి.శ్రీనివాస మూర్తి, క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ వి.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ద్రవ్యోల్బణ కట్టడితోనే ఆర్థికవృద్ధి వేగవంతం

### కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** భారత్ ఆర్థికవ్యవస్థ పటిష్టంగా ఉందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ మరింత ముందుకు పోతున్నదని, ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండటం వల్లనే ఇది సాధ్యం అవుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.



ఆర్థికవృద్ధి ఆరునుంచి 8శాతంవరకూ రానున్నకాలంలో నమోదవుతుందని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ల నిరంతర కృషి, చేపట్టిన విధివిధానాలే భారత్ వృద్ధికి దోహదంచేస్తున్నాయన్నారు. అల్పాదాయ, మధ్యాదాయ కుటుంబా ల సంక్షేమానికి ఈసారి బడ్జెట్‌లో ఎంతో ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఈకేటగిరీ కుటుంబాలకోసం అనేక పథకాలను అమలుకు తెచ్చారని, సామాన్య మధ్యతరగతికి పన్నుప్రయోజనాలు అధికంగా కల్పించారని, 12 లక్షలవరకూ ఆదాయపు పన్ను మినహాయింపునిచ్చారని గతంతోపోలిస్తే ఎంతో ఎక్కువ అని కేంద్రం మంత్రి అన్నారు. అమెరికాకు చెందిన సెమికండక్టర్ సేవల కంపెనీ లామ్ రీసెర్చ్ భారత్‌లో సెమికండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు పదివేల కోట్ల పెట్టుబడితోముందుకువచ్చిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో చిప్‌ల తయారీ యంత్రపరికరాలను సరఫరాచైన్‌ను మరింత విస్తృతంచేస్తోంది. భారత్‌తోపాటు ఈ పరిశ్రమను వివిధ దేశాల్లోకూడా ఏర్పాటుచేసిందన్నారు. ఇందుకోసం బెంగలూరు వైట్‌ఫీల్డ్‌ప్రాంతంలోనే స్థలం ఏర్పాటుచేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇప్పటికే కేంద్రం ఇండియన్ సెమికండక్టర్‌మిషన్ పరిధిలో 70వేల కోట్ల పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి సెమిక్టడక్టర్ మార్కెట్ భారత్‌లో 103.4 బిలియన్ డాలర్లకు చేరుతుందని,ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 400 బిలియన్ డాలర్లకు పెరిగిందని వైష్ణవ్ గుర్తుచేసారు. ఆర్ అండ్ డి రంగంలో కూడా ఎక్కువ ప్రోత్సాహకాలను అందిస్తోందని భాగస్వామ్యపద్ధతిలోకూడా మరింతగా సెమికండక్టర్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

## దయాకర్‌రావు కదలికలపై అనుమానం ఉంది.. నిఘా పెంచాలి

### కాంగ్రెస్ అధికార ప్రతినిధి బండి సుధాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** మోసం, కుట్రలు ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడంలో దయాకర్‌రావు దిట్ట.. ఆయన కదలికలు అనుమానం ఉంది గతంలో టిడిపి ఎల్‌పిని టిఆర్ఎస్‌లో విలీనం చేసిన వ్యక్తి ఆయనపై నిఘా పెంచాలని డిజిపికి ఫిర్యాదు చేస్తామని తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బండి సుధాకర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాస్వామ్య యుతంగా పూర్తి మెజారిటీ ఎమ్మెల్యేలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోతుందని దయాకర్ రావు మాట్లాడడం ఆయన అధికార దాహానికి నిదర్శన్నారు, ఆదరించి అందలం ఎక్కించిన తల్లి లాంటి టిడిపి పార్టీని మోసం చేసి తమ కులబంధువులైన ఆనాటి టిఆర్ఎస్ పార్టీ ఎల్పీలో టిడిపి ఎమ్మెల్యేలను విలీనం చేసింది వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వకూల్చివేత జోస్యంపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర డిజిపి ని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజల అభిమానం చూరగోరుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరాధారమైన ఆరోపణలు, బదనాం చేయాలని చూస్తే సహించేది లేదంటూ ఖబర్దార్ దయాకర్ రావు అని హెచ్చరికలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు.

## మార్కెటింగ్ విభాగంపై సిబిఐ ఫోకస్


### ఎవరి ప్రమేయంతో టెండర్లు

## కల్తీ నెయ్యిని ఎవరూ ప్రశ్నించలేదా?

**తిరుమల,ఫిబ్రవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి నెయ్యిసరఫరా చేయడానికి గత నాలుగేళ్ళలో టెండర్లు దక్కించుకుని, కల్తీనెయ్యి సరఫరాచేసినా ఎవరూ అడగలేదా?దీనిపై అధికారులు ఎందుకు నిర్లిప్తతతో వున్నారనే కోణంలో సిబిఐ సిట్ అధికారులు నిందితులను విచారణ చేశారు. కల్తీ నెయ్యి పంపినా కీలకమైన మార్కెటింగ్ విభాగం అధికారులుగానీ, విజిలెన్స్‌గానీ కనుక్కో లేకపోవడంతో ముందుగానే ఒప్పందం కుదిరిందా?అనే కోణంలో ప్రశ్నలతో సమాధానాలు రాబట్టారు.అయితే కల్తీనెయ్యి బాగోతంలో అసలు సూత్రదారులు ఎవరనే తేల్చేపనిలో సిట్ లోతుగా కూపీ లాగుతూన్నా కస్టడీలో ఉన్న నిందితులు కొన్ని వివరాలు చెప్పడంలేదనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి కేసులో ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు నిందితులు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్ కాంత్‌చావ్డాలను అరెస్టు చేయడం, ఐదురోజులు కస్టడీకి తీసుకోవడం తెలిసిందే. రెండోరోజు శనివారం కస్టడీలో ఉన్న నలుగురు నిందితులను ప్రత్యేక గదుల్లో వేర్వేరుగా ప్రశ్నలు సిద్ధంచేసుకుని విచారణ చేశారు. అనేక ప్రశ్నలను నిందితులు సమా ధానం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారనేది సమా చారం. అసలు గత పాలకమండలి పెద్దలు, కొనుగోలుకమిటీ సభ్యులు, మార్కెటింగ్ విభాగం ఇలా ఎవరెవరు కల్తీనెయ్యి సరఫరా అయినా పట్టించుకోలేదనేది కూడా సిబిఐ ఆరా తీస్తోంది. గత నాలుగేళ్ళలో అర్హతలేని డైరీల నుండి లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా అయినా అటు కాంట్రాక్టర్లనుగానీ, ఇటు డైరీల యాజమాన్యంను ప్రశ్నించలేకపోవడం వెనుక ఆంతర్యమేమిటనేది నిందితుల నుండి సమాధానాలు రాబడుతు న్నారు. కల్తీనెయ్యిపై పట్టించుకోని పాపం ఎవరిదని ఆరా తీస్తున్నారు. తక్కువ ధరకు సర ఫరా చేస్తామని ముందుకు రావడం సహక రించిన వారెవరనేది అడిగినా సమాధానం లేదు. కల్తీ నెయ్యిలో ఎలాంటి పదార్థాలు నూనెలు ఎక్కడ కలిపారనేది కూడా సమాధానాలు రాబట్టారు. భక్తులు లడ్డూల నాణ్యత, రుచిపై తీవ్రస్థాయిలో అసహనం, అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసినా తనిఖీలు కూడా చేయలేకపోవడం అసలు సూత్రధారులు తేల్చనున్నారు. గతంలో పనిచేసిన టిటిడిలో ఓ ఉన్నతాధికారి హస్తం, తమిళనాడుకు చెందిన ఓ నేత ప్రమేయం కూడా ఉందని సిబిఐ సిట్ సమాధానం రాబట్టిందని తెలుస్తోంది. రెండోరోజూ తిరుపతిలోని సిట్ కార్యాలయం ప్రాంగణం పోలీసుల భద్రత నడుమ కొనసాగింది. కొందరు న్యాయవాదులను కూడా సిట్ అదికారులు అనుమతించలేదు.

# 'రాబిన్‌హుడ్' నుంచి కొత్త సాంగ్

హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్‌కామెడీ రాబిన్‌హుడ్, వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమా 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో నితిన్ సరసన శ్రీలీల కథానాయికగా నటించింది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఫస్ట్‌సింగిల్ సూపర్ హిట్ అయింది. ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ వేర్ ఎవర్ యు గో సాంగ్‌ని సూపర్ స్టార్ మహేష్ బాబు లాంచ్ చేశారు. దర్శకుడు వెంకీ కుడుముల ఈ పాట కోసం ఒక యూనిక్ కాన్సెప్ట్‌ను డిజైన్ చేశారు. బ్రాండ్‌ల క్రియేటివ్ మిక్స్, వాటి ఐకానిక్ ట్యాగ్‌లైన్‌ల ద్వారా నితిన్, శ్రీలీల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తాడు. జివి ప్రకాష్ కుమార్ మెలోడీతో కూడిన ఎక్సయిటింగ్ ట్రాక్‌ను అందించారు. ఆర్కెస్ట్రేషన్ అద్భుతంగా అర్మాన్ మాలిక్ వోకల్స్ అందాన్ని మరింత పెంచింది. ఈ ప్రేమ పాటను రాయడంలో సవాలును స్వీకరించి, బ్రాండ్‌లను, వాటి ట్యాగ్‌లైన్‌లను చాలా తెలివిగా ప్రజెంట్ చేసిన కృష్ణ కాంత్‌కు స్పెషల్ క్రెడిట్ దక్కుతుంది. నితిన్ పాటకు హై ఎనర్జీ తీసుకొచ్చారు. ఉబెర్‌కూల్ అవతార్‌లో రాక్ చేశారు. శ్రీలీల కట్టిపడేసింది. వారి కెమిస్ట్రీ స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకుంది. విజువల్స్, ఎనర్జిటిక్ సెట్స్ మెస్మరైజ్ చేశాయి. వాలెంటైన్స్ డే కి ఇది పెర్ఫెక్ట్ సాంగ్. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రంలో సాయి శ్రీరామ్ బ్యూటీఫుల్ సినిమాటోగ్రఫీని అందించారు. కోటి ఎడిటర్‌గా పనిచేస్తుండగా, రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: నితిన్, శ్రీలీల, రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: వెంకీ కుడుముల, బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, సిఇఒ: చెర్రీ, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డిఒపి: సాయి శ్రీరామ్, ఎడిటర్: కోటి, ఆర్ట్ డైరెక్టర్:రామ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, రవి వర్మ, విక్రమ్ మోర్. మార్కెటింగ్: ఫస్ట్ లుక్.



# 'నేనెక్కడున్నా' ట్రైలర్ లాంచ్



ప్రముఖ బాలీవుడ్ నటుడు, సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి, ఎయిర్ టెల్ ఫేం సశా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా నేనెక్కడున్నా. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మాధవ్ కోదాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫిబ్రవరి 28న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రజా నాయకుడు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా నేనెక్కడున్నా ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ విడుదల అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "జర్నలిజం విలువలు, మహిళా సాధికారతపై తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. దర్శకుడు మాధవ్ కోదాడ, నిర్మాతలు కె.బి.ఆర్, మారుతి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి నా శుభాకాంక్షలు" అని అన్నారు. నేనెక్కడున్నా సినిమాలో ఆనంద్ పాత్రలో మిమో చక్రవర్తి, ఝాన్సీగా సశా చెత్రి నటించారు. వాళ్లిద్దరూ జర్నలిస్ట్ రోల్స్ చేశారు. జీతం కోసం కాకుండా జనాల జీవితాల కోసం పాత్రికేయరంగాన్ని ఎంచుకున్న ఆనంద్, ఝాన్సీ చేసిన కొన్ని స్టింగ్ ఆపరేషన్స్ వల్ల అవినీతిపరుల భాగోతాలు బయట పడతాయి. ఆ తర్వాత ఏమైంది? ఎన్ని ప్రమాదాలు ఎదుర్కొన్నారు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. మురళీ శర్మ,మహేష్ మంజ్రేకర్, ప్రదీప్ రావత్, షాయాజీ షిండే, అభిమన్యు సింగ్, రాహుల్ దేవ్, బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి, సీవీఎల్ నరసింహారావు, రవి కాలే, భాను చందర్, రమణ చల్కపల్లి, మిలింద్ గునాజి, మిహిర, ఉత్తర, అర్చన గౌతం తదితరులు నటించిన ఈ సినిమాకు డాన్స్: ప్రేమ్ రక్షిత్, లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ, సంగీతం: శేఖర్ చంద్ర, ఫోటోగ్రఫీ: జయపాల్ నిమ్మల, ఎడిటింగ్: ఫిల్మీ గ్యాంగ్ స్టర్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: రాజేష్ ఎస్.ఎస్, సమర్పణ: కె.బి.ఆర్, నిర్మాత: మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి.

# 'మ్యాజిక్' నుంచి ఫస్ట్ సాంగ్

ఒక వైపు భారీ సినిమాలను రూపొందిస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్య భరిత చిత్రాలను అందిస్తూ ఘన విజయాలను సొంతం చేసుకుంటోంది ప్రముఖ నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. ప్రస్తుతం జెర్సీ వంటి క్లాసిక్‌చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో మ్యాజిక్ అనే సినిమాను సితార సంస్థ రూపొందిస్తోంది. ఈ మ్యూజికల్ డ్రామాలో పలువురు యువ నటీనటులు నటిస్తున్నారు.మ్యాజిక్ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి డోంట్ నో వై అనే మొదటి గీతాన్ని విడుదల చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా అనిరుధ్ పాట విడుదలై ఆకట్టుకోవడం కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, డోంట్ నో వై పాటతో మరోసారి కట్టిపడేశారు అనిరుధ్. మ్యాజిక్ అనే చిత్ర టైటిల్‌కి తగ్గట్టుగానే తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేశారు అనిరుధ్. ఆ సంగీతానికి తగ్గట్టుగానే, ఆకట్టుకునే విజువల్స్‌తో డోంట్ నో వై మ్యూజిక్ వీడియోను ప్రేమ, భావోద్వేగాల మేళవింపుతో అద్భుతంగా మలిచారు. అనిరుధ్ రవిచందర్, ఐశ్వర్య సురేష్ కలిసి తెలుగు, తమిళ భాషల్లో ఈ గీతాన్ని ఆలపించారు. అనిరుధ్ తన సంగీతంతో మాత్రం కాకుండా, గాత్రంతోనూ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ఈ పాట ఒకసారి వినగానే మళ్లీ మళ్లీ వినాలి అనిపించేలా ఉంది. ఈ గీతానికి తెలుగులో కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, తమిళంలో విఘ్నేష్ శివన్ సాహిత్యం అందించారు. వారి సాహిత్యం పాట విలువను మరింత పెంచింది. తమ కళాశాల ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపరచడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. వారి ప్రయాణం భావోద్వేగభరితంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ మ్యాజిక్ చిత్రంతో ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నారు.మ్యాజిక్ చిత్రం కోసం ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.





మీనాక్షి చౌదరి నయా లుక్

# 'కాంత' ఫస్ట్ లుక్ అదుర్స్

స్టన్నింగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే అప్ కమింగ్ మల్టీలింగ్వల్ ఫిల్మ్ కాంతలో తన మెస్మరైజింగ్ ప్రజెన్స్‌తో అలరించడానికి సిద్ధంగా ఉంది. ఇందులో ఆమె దుల్కర్ సల్మాన్ సరసన నటించింది. ప్రేమికుల దినోత్సవం కానుకగా చిత్ర నిర్మాతలు ఈ చిత్రం నుండి ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భాగ్యశ్రీ బోర్సే అద్భుతమైన సాంప్రదాయ గులాబీ రంగు చీరలో, క్లాసిక్ బ్యూటీగా కనిపించింది. ఆమె బంగారు ఆభరణాలతో అలంకరించుకోవడం రాయల్ ఎట్రాక్షన్‌ని యాడ్ చేసింది. మంత్రముగ్ధమైన చిరునవ్వుతో ఆకట్టుకుంది. ఈ ఫస్ట్ లుక్‌లో ఆమె ఒక క్లాసికల్ హీరోయిన్ ఎసెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్, ప్రఖ్యాత సురేష్ ప్రొడక్షన్స్ సహకారంతో రానా దగ్గు బాటి స్పిరిట్ మీడియా నిర్మాణంలో సెల్వమణి సెల్వరాజ్ దర్శ కత్వంలో కాంత రూపొందుతోంది. ఈ చిత్రంలో సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. 1950ల మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కిన "కాంత" ఆ ఎరాలో మానవ సంబంధాలు, సామాజిక, సంక్లిష్టతలను ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కాంతా గొప్ప కథ, నటీనటులు, టెక్నికల్ టీంతో మస్ట్ వాచ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించబోతోంది. తారాగణం: దుల్కర్ సల్మాన్, సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే, సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్, బ్యానర్లు: స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికృష్ణ గద్వాల్, లైన్ ప్రొడ్యూసర్: శ్రవణ్ పాలపర్తి, డిఒపి: దాని శాంచెజ్ లోపెజ్ ఆర్ట్ డైరెక్టర్: రామలింగం, రచయిత: తమిళ్ ప్రభ, సంగీతం జాను, ఎడిటర్: లెవెల్లిన్ ఆంథోనీ గోన్సాల్వేస్, కాస్ట్యూమ్ డిజైనింగ్: పూజిత తాడికొండ, సంజన శ్రీనివాస్, పీఆర్వో: వంశీ శేఖర్.




# 'మోగ్లీ 2025' షూటింగ్ ప్రారంభం

తన తొలి చిత్రం కలర్ ఫోటోతో జాతీయ అవార్డు గెలుచుకున్న యంగెస్ట్ డైరెక్టర్ సందీప్ రాజ్, తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ మోగ్లీ 2025తో మరో ఎమోషనల్ పవర్ ఫుల్ నెరేటివ్‌ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు. తన తొలి చిత్రం బబుల్‌గమ్‌లో ఇంటెన్స్ యాక్షన్‌కు ప్రశంసలు అందుకున్న రోషన్ కనకాల తన వెర్సటాలిటీ ప్రజెంట్ చేసే పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న మోగ్లీ 2025 అద్భుతమైన ఫారెస్ట్ నేపథ్యంలో జరిగే సమకాలీన ప్రేమకథ. సాక్షిసాగర్ మడోల్కర్‌ను కథానాయికగా పరిచయం అవుతోంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అదే విషయాన్ని ఆసక్తికరమైన గన్ మేకింగ్ వీడియో ద్వారా అనౌన్స్ చేశారు. అడవిలోని ప్రశాంతమైన డెప్త్‌లో దర్శకుడు సందీప్ రాజ్ ఒక టెంట్ లోపల కూర్చుని, జాగ్రత్తగా తుపాకీని సిద్ధం చేస్తున్నాడు. అన్నీ సరిగ్గా అమర్చిన తర్వాత, అతను దానిని సాక్షికి అప్పగిస్తాడు, ఆమె సంకల్పం స్పష్టంగా కనిపిస్తుంది. రోషన్‌అడుగుపెట్టి ఆమెతో కలిసి తమ లక్ష్యాన్ని గురి చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా సీన్ మారుతుంది.వారు కలిసి చేతులను స్థిరంగా ఉంచుకుంటూ, కాల్పులు జరుపుతారు. షాట్ మోగుతుండగా, స్క్రీన్‌లో అందరికీ హ్యాపీ వాలెంటైన్స్ డే శుభాకాంక్షలు అని రావడం చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. వీడియో ఎనర్జీతో ప్రారంభమవుతుంది, థ్రిల్లింగ్ ఎడ్వంచర్ ఫీలింగ్, లోతైన ప్రేమ అంతర్లీన భావనతో టోన్‌ని సెట్ చేస్తుంది. తుపాకీ తయారీ క్రమం సినిమా విస్తృత కథాంశంతో ముడిపడి ఉన్న లేయర్‌ని యాడ్ చేసింది. నిర్మాత విశ్వ ప్రసాద్, దర్శకుడు సందీప్ రాజ్ ఈ వీడియోకు ఫ్రెష్, డైనమిక్ ఎనర్జీ జోడించారు, ఉత్తేజకరమైన, మోడరన్ సినిమా అనుభవాన్ని హామీ ఇస్తున్నారు. రోషన్ ఆకట్టుకునే ప్రజెన్స్ కట్టిపడేసింది. కాలభైరవ ఉత్తేజకరమైన నేపథ్య సంగీతం విజువల్స్ ఇంటన్సిటీని పెంచుతుంది. స్క్రిప్ట్ రాయడానికి ఎనిమిది నెలలు, ప్రీప్రొడక్షన్ దశకు ఏడునెలలు పట్టిందని మేకర్స్ షేర్‌చేశారు. వారు ఆరుగురు వినూత్న సాంకేతిక నిపుణులను కూడా పరిచయం చేశారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం. సినిమాటోగ్రఫీ, కాలభైరవ, సంగీతం, కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, కిరణ్ మామిడి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తున్నారు. నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. రామ మారుతి ఎం.రాధాకృష్ణ రెడ్డి సహ రచయితలుగా ఉన్నారు.



# 'కోర్టు' ఫస్ట్ సింగిల్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పించిన కోర్ట్ స్టేట్ వర్సెస్ ఎ నోబడీ నుంచి విడుదలైన ఫస్ట్ సింగిల్ ప్రేమలో ఫస్ట్ లవ్ ఫీలింగ్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. రామ్ జగదీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో ప్రియదర్శి నటించారు. విజయ్ బుల్గానిన్ హార్ట్ ఫుల్ మ్యూజిక్ అందించారు. వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ప్రేమలో పాట హర్ష్ రోషన్, శ్రీదేవిల సున్నితమైన ప్రేమకథను వివరించే రొమాంటిక్ మెలోడీ. మంత్రముగ్ధులను చేసే సంగీతంతో తడిసిన ఈ ట్రాక్, క్లాసికల్ నోట్స్‌ను చక్కగా బ్లెండ్ చేసింది. కథానాయకుడు ఒక లోతైన భావోద్వేగాన్ని వ్యక్తపరుస్తాడు. మీరు ప్రేమించే అమ్మాయిని సముద్రాన్ని కలిసి చూసినప్పుడు, ఆ అనుభూతి మరే ఇతర అనుభూతికి భిన్నంగా ఉంటుంది. ఈ క్షణం మొత్తం పాటకు టోన్‌ని సెట్ చేస్తుంది. పూర్ణాచారి రాసిన ఈ సాహిత్యం శాస్త్రీయ, ఆధునిక అంశాలను సజావుగా మిళితం చేస్తుంది, పియానో, గిటార్ సంపూర్ణంగా కలిసిపోయాయి. అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ వారి ఎట్రాక్టివ్ వోకల్స్‌తో పాటకు ప్రాణం పోశారు. హర్ష్ రోషన్ శ్రీదేవి ఇద్దరూ అద్భుతమైన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీని పంచుకున్నారు, ఈ ట్రాక్ ఖచ్చితంగా మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో నిలిచే హిట్‌గా నిలి చింది. శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్, రాజశేఖర్ అనింగి, సురభి ప్రభావతి, విశిక, వడ్లమణి శ్రీనివాస్ ఇతర ప్రముఖ తారాగణం. ఈ చిత్రానికి దినేష్ పురుషోత్తమన్ తన అద్భుతమైన సినిమాటోగ్రఫీ అందించారు. విఠల్ కోసనం ఆర్ట్ డైరెక్టర్, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను కార్తికేయ శ్రీనివాస్, వంశీధర్ సిరిగిరి రాశారు. ఈ చిత్రం మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా విడుదల కానుంది. తారాగణం: ప్రియదర్శి, శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్ రోషన్, శ్రీదేవి, శుభలేఖ సుధాకర్, రాజశేఖర్ అనింగి, సురభి ప్రభావతి, విషిక, వడ్లమానిశ్రీనివాస్, సాంకేతిక సిబ్బంది: సమర్పణ: నాని, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, సహ నిర్మాత: దీప్తి గంటా, బ్యానర్: వాల్ పోస్టర్ సినిమా, కథ, దర్శకత్వం: రామ్ జగదీష్, డీవోపీ: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్.



# 'తెలుసు కదా' స్పెషల్ పోస్టర్ లాంచ్

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం న్యూ జనరేషన్ లవ్ స్టోరీ తెలుసు కదాలో నటిస్తున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయం అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా, మేకర్స్ ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రాశి ఖన్నా సిద్ధు బుగ్గపై ముద్దు పెడుతూ చిరునవ్వులో కనిపిస్తుండగా, శ్రీనిధి శెట్టి అతనిముందు నిలబడి ఉండటం ఒక పర్ఫెక్ట్ వాలెంటైన్స్ డే పోస్టర్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ చాలా బ్యూటీఫుల్‌గా ఉంది. కథలోని ఈ మూడు పాత్రల మధ్య బాండింగ్ గురించి ఆసక్తిని కలిగిస్తుంది. ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. జ్ఞానశేఖర్ బాబా సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, థమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. జాతీయఅవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటింగ్, ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా పని చేస్తున్నారు. శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. తెలుసు కదా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. తారాగణం: సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి, వైవా హర్షచన, దర్శకత్వం: నీరజ కోన, నిర్మాతలు: టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్, బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: జ్ఞాన శేఖర్ బాబా, ఎడిటర్: నవీన్ నూలి, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, కాస్ట్యూమ్ డిజైనర్: శీతల్ శర్మ.



# 'ఓ భామ అయ్యో రామ' పోస్టర్

యువ కథా నాయకుడు సుహాస్ తన విభిన్నమైన స్టోరీ సెలక్షన్‌తో ప్రేక్షకులను మెప్పిస్తూ, మరో అందమైన ప్రేమ కథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాడు. 'ఓ భామ అయ్యో రామ' అనే ఈ ప్రేమకథలో మలయాళ నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) కథానాయికగా పరిచయమవుతోంది. ఈ సినిమాను రామ్ గోధల తన తొలి ప్రయత్నంగా దర్శకత్వం చేస్తున్నారు, హరీష్ నల్ల నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా విడుదల చేయనుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా మేకర్స్ ఓ అద్భుతమైన పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సుహాస్, మాళవిక మనోజ్‌ల రొమాన్స్‌ను చూపిస్తూ, ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. ఈ జంట అందించే ప్రేమకథ భావోద్వేగాలను రేకెత్తించేలా ఉండబోతోందని అర్థమవుతోంది. అంతేకాకుండా, కథలో మరిన్ని అంశాలను అందించేందుకు సీనియర్ నటి అనితా హసనందిని మరియు ప్రముఖ నటుడు అలి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది – మనికందన్ సినిమాటోగ్రఫీ చేయగా, రథన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భవిన్ షా ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్‌ను సమకూరుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: సుహాస్, మాళవిక మనోజ్, అనితా హసనందిని, అలి, బబ్లూ పృథ్వీ రాజ్, రవీందర్ విజయ్, మొయిన్, సాంకేతిక నిపుణులు: రచయిత–దర్శకుడు: రామ్ గోధల, నిర్మాత: హరీష్ నల్ల, బ్యానర్: వి ఆర్ట్స్, సంగీతం: రథన్, సినిమాటోగ్రఫీ: మనికందన్ ఎస్, ఎడిటింగ్: భవిన్ షా, ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కడలి, కాస్ట్యూమ్స్: అశ్వంత్ అండ్ ప్రతిభ, పిఆర్ఒ: ఏలూరు శ్రీను మధురి మధు, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.





# గిరిజనాభివృద్ధికి వరాలిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

## ఘనంగా సేవాలాల్ మహారాజ్ 286 జయంతి వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ లోని బంజారా భవన్‌లో శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడు కలు ఘనంగా జరిగాయి. ఈ జయంతి ఉత్సవాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి గౌరవఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క లంబాడీ గిరిజనలు సాంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సంప్రదాయ నాంగారను మోగించిన నేతలు సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గిరిజన అభివృద్ధి కోసం వరాలు కురిపిస్తున్న ముఖ్య మంత్రి రేవంత్‌కి ధన్యవాదాలు తెలిపారు. సేవాలాల్ ఎంచుకున్న భక్తి, విశ్వాసం, నమ్మకంతో వారి ఆశయాలని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పని చేయాలన్నారు. రేపటి తరానికి సేవాలాల్ సేవలను అందిం చాలన్నారు. సేవాలాల్ ఇచ్చిన శాంతి బోధనలు, సమానత్వం, అహింస స్ఫూర్తితో ముందుకు నడవాలని, ఆయన చూపిన సమాజ శాంతి కోసం బంజారాలు పని చేయాలన్నారు. బంజారాల స్థిర నివాసం కోసం తండాలు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి సేవలాల్ ఆ మహనీయుడి ఆశయాలను భవిష్య తరాలకు అందించడమే ఆయనకిచ్చే నివాళి అన్నారు. జాతి గురించి చెప్పుకునేందుకు కొందరు ఇబ్బందులు పడు తుంటారని, గిరిజన జాతి నుంచి ఎంతోమంది ఐఏఎస్, ఐపిఎస్‌లు, ఎమ్మెల్యేలు మంత్రులయ్యారని గుర్తు చేశారు. గతంలో సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించిన మంత్రి సీతక్క కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 17వేల కోట్లను ఎస్టీ సంక్షేమం కోసం కేటాయిం చిందన్నారు. వచ్చే యేడాది సేవాలాల్ జయంతి ఉత్సవాన్ని ఎల్‌బిస్టేడియంలో నిర్వహించేవిధంగా సీఎం ను కోరుతాం బంజారా భాషను అధికారిక భాషగా గుర్తించేందుకు రాజ్యాం గంలోని 8వ షెడ్యూ ల్లో పెట్టేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, సింగరేణి సిఎండి బలరాం నాయక్ ఇతర గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

## బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్క రించుకుని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇంటర్ విద్య బలోపేతానికి కృషి

## 'టిగ్లా' అధ్యక్షుడిగా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ నయీమ్‌పాషా

### కొత్త కార్యవర్గం ఏకగ్రీవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి తమ సంఘం కృషి చేస్తుందని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్(టిగ్లా) స్పష్టం చేసింది. టిగ్లా నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగిన ఎం జంగయ్యను తిరిగి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకోగా.. ఇప్పటి వరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన మాచర్ల రామకృష్ణ గౌడ్ స్థానంలో షేక్ నయీమ్ పాషను సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. కొత్త కార్యవర్గం మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లను పెంచడానికి తమ సంఘం ముందుండి పనిచేస్తుందన్నారు.

# ఈ దేశానికి మోడీ చేసిందేమిటి?!

## ముస్లింలంటే బిజెపికి ఎందుకంత భయం?

### రాజ్యసభ మాజీ ఎంపి హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** పదేళ్లలో మోడీ ఈ దేశానికి చేసిందేమటి సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు ఇచ్చారా అని రాజ్యసభ మాజీ ఎంపి వి. హనుమంత రావు తెలిపారు. శనివారం గాంధీ భవన్‌లో మాజీ పిసిసి అధ్యక్షుడు విహెచ్ దేశానికి కాంగ్రెస్ ఏమి చేసిందనే కిషన్ రెడ్డి ప్రశ్నలకు జవాబు చెబుతూ ఇందిరా గాంధీ భూ సంస్కరణలు చేసిందని బ్యాంక్ లను జాతీయం చేసిందిమహాత్మా గాంధీ రోజ్ గారి యోజన అమలు చేసింది కాంగ్రెస్ స్థానిక సంస్థల లో రిజర్వేషన్లు అమలు చేసింది అంటు సమాధానాలు ఏకరువు పెడుతూ చెప్పారు. రాహుల్ గాంధీ ఏ కులం అని అంటున్నారు రాహుల్ గాంధీది బడుగు బలహీన వర్గాల కులం అని విహనుమంతరావు అన్నారు. కులగణన చేయమని, సెపరేట్ మినిస్ట్రీస్ ఇవ్వమని అడిగిన వ్యక్తి రాహుల్ అని అన్నారు. మీ రాష్ట్రాలలో కులగణన చేస్తారా?లేదా?బీజేపీ నాయకులు చెప్పాలి అని నిలదీశారు. బీజేపీ నాయకులు ఎప్పుడు కౌంటర్ వేయడమే తప్పితే చిత్త శుద్ధి లేదు అని నిందించారు. బడుగు బలహీన వర్గాల గురుంచి ఆలోచించే శక్తి కేవలం కాంగ్రెస్,గాంధీ కుటుంబానికే ఉంది అని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ఆలోచనలను ఆచరిస్తుండు అని ఆయన అన్నారు.

# మేఘా కంపెనీకి రూ.5.47 కోట్ల టోకరా

## ఇ మెయిల్‌లో సైబర్ నేరగాళ్లు ఒక్క అక్షరం మార్చి భారీ మోసం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరో భారీ సైబర్ నేరం వెలుగుచూసింది. సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నా నేరగాళ్ల ఆగడాలు మాత్రం కొన సాగుతూనే ఉన్నాయి. తాజాగా ప్రముఖ ఇంజినీరింగ్ కంపెనీ మేఘాకు సైబర్ నేరగాళ్లు అక్షరాలా.. ఐదు కోట్ల 47 లక్షల రూపాయలను టోకరా వేశారు. ఇ మెయిల్‌లో కేవలం ఒకేఒక్క అక్షరం మార్చి ఈ డబ్బులను కాజేశారు. దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి)కు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2022 మే 10వ తేదీన మేఘా కంపెనీ తన సంస్థకు అవసరమైన సామాగ్రి కోసం నెదర్లాండ్స్‌లోని ఓ సంస్థకు 14.39 లక్షల యూరోల విలువైన సామాగ్రి కోసం ఆర్డర్ ఇచ్చింది. అదే నెల 17వ తేదీన 7.95 లక్షల యూరోల విలువైన సామాగ్రి కోసం మేఘా కంపెనీ మరో ఆర్డర్ ఇచ్చింది. అనంతరం ఒప్పందం ప్రకారం మేఘా కంపెనీ నెదర్లాండ్స్ కంపెనీకి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తూ పోయింది. ఇలా చెల్లింపులు జరిగిన ప్రతీసారి నెదర్లాండ్స్‌కు చెందిన సంస్థ నుంచి నగదు ముట్టింది అనే మెయిల్ వచ్చేది. ఈ క్రమంలో 2024 నవంబర్ 29వ తేదీన నెదర్లాండ్స్‌లోని సంస్థ పేరిట మేఘా కంపెనీకి ఒక మెయిల్ వచ్చింది. కోర్టు ఉత్తర్వుల కారణంగా తమ బ్యాంకు పాత ఖాతాపై ఆంక్షలు ఉన్నాయని, ఇక నుంచి కొత్త ఖాతాకు నగదు బదలాయింపు చేయాలని ఆ మెయిల్‌లో సమాచారం అందింది.

అయితే ఇ మెయిల్ పంపింది నెదర్లాండ్స్‌కు చెందిన సంస్థ వారు కాదు.. సైబర్ నేరగాళ్లు. ఒక్క అక్షరం తేడాతో నెదర్లాండ్స్ సంస్థతో పోలివున్న మరో నకిలీ మెయిల్‌ను మేఘాకు సైబర్ నేరగాళ్లు పంపారు. ఇది నిజమని నమ్మిన మేఘా కంపెనీ అధికారులు నకిలీ ఖాతాకు ఈ యేడాది జనవరి 24వ తేదీన రాజ్‌భవన్ వద్ద గల యుబిఐ బ్యాంకు ఖాతా నుంచి 3.18 లక్షల యూరోలు పంపారు. దీనిపై 27వ తేదీన నగదు బదలాయింపు జరిగిందని మెయిల్ కూడా అందడంతో మేఘా కంపెనీ అధికారులకు ఎలాంటి అనుమానం రాలేదు. దీని తరువాత జనవరి నెల 29వ తేదీన మరోసారి 2.89 లక్షల యూరోలను మేఘా కంపెనీ అధికారులు సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాకు బదలాయించారు. దీని తరువాత ఎందుకైనా మంచిదని మేఘా కంపెనీ అధికారులు నెదర్లాండ్స్‌లోని సంస్థ ప్రతినిధులతో మాట్లాడగా తమకు ఎలాంటి చెల్లింపులు అందలేదని, తాము ఖాతా మార్చినట్లు ఎలాంటి సమాచారం పంపలేదని తెలపడంతో మేఘా కంపెనీ అధికారులు ఒక్కసారిగా షాక్‌కుగురై తాము సైబర్ నేరగాళ్ల బారిన పడినట్లు గుర్తించి దీనిపై సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.

కాగా మేఘా కంపెనీ చెల్లించిన నగదు భారతీయ కరెన్సీలో ఐదు కోట్ల 47 లక్షల రూపాయలుగా తేలింది. కాగా దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు విచారణ కోసం ఎస్‌పి స్థాయి అధికారిని నియమించారు.

### గోల్డెన్ ట్రయంగల్ నేరగాళ్ల హస్తం ఉందని నిర్ధారణ

కాగా ఈ నేరం వెనుక సైబర్ నేరగాళ్ల స్వర్గధామంగా పేరొందిన గోల్డెన్ ట్రయంగల్ దేశాల (మియన్మార్, వియత్నాం, కాంబోడియా)కు చెందిన నేరస్తుల హస్తం ఉందని తేలింది. ఈ తరహా నేరాలు ఇక్కడి నుంచే జరుగుతుంటాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలిపారు. కాగా ఈ కేసులో మేఘా కంపెనీ పంపిన నగదులో ఏమైనా జప్తు చేసే వీలుండే అవకాశముందా? అనే అంశాన్ని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో స్థానిక నేరగాళ్ల పాత్ర కూడా ఉందని వారు భావిస్తున్నారు.

# రూ.4 వేల కోట్ల జయలలిత ఖజానా తమిళనాడుకు తరలింపు



## ప్యాకెట్లలో 10వేల చీరెలు, 750 పాదరక్షలు కూడా..

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబం ధించి తమిళనాడు దివంగత సీఎం జయలలితకు చెందిన ఆస్తులు, పత్రాలను ఆరాష్ట్రప్రభుత్వానికి బెంగళూరులోని కోర్టు అదికారులు శుక్రవారమే అప్పగించారు. బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో ఇప్పటివరకూ జయలలిత ఆస్తులు, పత్రాలను భద్రపరిచారు. పదివేల చీరెలు, 750 జతల పాదరక్షలు, 27 కిలోలబంగారం, వజ్రాభరణాలు, రత్నాలు 601 కిలోల వెండి వస్తువులు, 1672 ఎకరాల వ్యవసాయ భూముల పత్రాలు నివా సాలకు సంబంధిం చిన దస్తావేజులు 8376 పుస్తకాలు తదితరాలను తీసుకెళ్లేం దుకు భారీ భద్రతతో అధికారులు ఆరు ట్రంకు పెట్టెలు తీసుకుని వచ్చారు.

న్యాయ మూర్తి హెచ్‌ఎన్ మోహన్ సమక్షం లో వాటిని అదికారులకు అప్పగిం చారు. జయ లలిత అక్రమార్జనకు సంబంధించిన కేసు 2004లో తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ అయినపుడు అక్కడ జప్తుచేసిన ఆస్తులు, పత్రాలను ఇక్కడికి తీసుకువచ్చి భద్రపరిచారు. మరోవైపు తాము జయలలితకు వారసుల మని ఆ ఆస్తులను తమకే అప్పగించాలని జె దీపక్, జెదీప అనే వ్యక్తులు దాఖలుచేసిన అర్జీని కర్ణాటకహైకోర్టు గతంలోనే కొట్టివేసింది. దాన్ని సవాల్‌చేస్తూ వారుసర్వోన్నత న్యాయస్తానంలో వేసిన పిటిషన్‌నూ అక్కడి ధర్మాసనం తోసిపుచ్చింది. జప్తుచేసుకున్న సమయంలో ఈ ఆస్తుల విలువను 913.14 కోట్లుగా అధికారులు మదింపుచేయగా అదినేడు కనీసం నాలుగువేల కోట్లుగా ఉంటుందని అనధికారికంగా అంచనాలు జోరందుకున్నాయి. 1991-96 మద్య జయలలిత తమిళనాడు సీఎంగాపనిచేసిన విషయం తెలిసిందే. మాజీ సీఎం ఆదాయానికి మించి ఆస్తులుకూడబెట్టినందుకు అవినీతి నిరోధక పోలీసులు ఆమెపై కేసు నమోదుచేసారు. తమిళనాడు అవినీతి నిరోధకశాఖ పోలీసులు జయలలిత ఇంటిపై దాడిచేసి బంగారం, వజ్రాల ఆభరణాలు వెండి వస్తువులు ఖరీదైన గడియారాలు వంటి వస్తువు లను స్వాధీనంచేసుకున్నారు. తాజాగా ఈ నగలు వస్తువులన్నీ కర్ణాటకనుంచి తమిళనాడుకు తరలించారు.

# వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీ ఇంట్లో ఎపి పోలీసుల సోదాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** నగరంలోని రాయదుర్గంలో గల వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీ ఇంట్లో శనివారం ఎపి పోలీసులు సోదాలు నిర్వహించారు. గన్నవరంలో తెలుగుదేశం కార్యాలయంపై దాడి, అక్కడ పనిచేసే సత్యవర్ధన్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేయడంతో పాటు హింసించిన కేసులో వంశీని నాలుగురోజుల క్రితం ఎపి పోలీ సులు హైదరాబాద్‌లో అరెస్టు చేయడం తెలిసిందే. అరెస్టు సందర్భంగా వంశీకి చెందిన ఫోన్ ఆయన వద్ద లభించలేదు. ఈ ఫోన్ కోసం వంశీని ఎంత ప్రశ్నించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులు శనివారం ఉదయం రాయదుర్గంలోని ఆయన ఇంటికి వచ్చి రెండు గంటలకుపైగా సోదాలు చేబట్టారు. అయినప్పటికీ వంశీ ఫోన్ ఇంట్లో లభించలేదు. ఫోన్ టవర్ లొకేషన్‌ను తనిఖీ చేయగా చివరగా ఇది ఆయన ఇంట్లోనే ఉన్నట్లు చూపడంతో పోలీసులు అక్కడే ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. వంశీ ఇంట్లో అన్ని గదుల్లోనూ సోదాలు చేసినా ఫోన్ జాడ తెలియలేదు. దీంతో వంశీ పిఎ ఫోన్‌ను ఎపి పోలీసులు జప్తు చేసి ఎపిలోని ఫోరెన్సిక్ లాబ్‌కు పంపారు. వంశీని అరెస్టు చేసేందుకు వచ్చిన సమయంలో తాను దుస్తులు మార్చుకుని వస్తానని చెప్పి అర గంటపాటు ఆయన ఎవరితోనో మాట్లాడినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ అరగంట వంశీ ఎవరితో మాట్లాడాడనేది తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# మార్చిలోగా శత్రు ఆస్తుల లెక్క తేల్చండి



## సెపీ అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదేశం

### రాష్ట్రంలోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీ)కు సంబంధించి మార్చి నెలాఖరులోపు రికార్డుల పరిశీలన, గ్రౌండ్ సర్వే పూర్తి చేసి లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెపీ ముంబై విభాగ అధికారులతో పాటు రెవిన్యూ ముఖ్య కార్యదర్శి, సిసిఎల్‌ఏ నవీన్ మిట్టల్, హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, వికారాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తొలుత రంగారెడ్డి జిల్లాలోని ఎనిమీ ప్రాపర్టీస్ పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కొత్వాల్‌గూడ, మియాపూర్ పరిధిలో ఉన్న వందలాది ఎకరాల ఎనిమి ప్రాపర్టీస్‌పై పురోగతి ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సర్వే నెంబర్ల వారీగా పురోగతిని వివరించారు. బాకారం లోని 25 వేల 503 గజాల వివాదాస్పదంలో ఎనిమి ప్రాపర్టీస్ వాటా 5578 గజాలు ఉందని, ఈ స్థలంలో 20 కుటుంబాలు పొజిషన్‌లో ఉంటూ నివాసాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నాయని తెలిపారు. బహదూర్ పురాలోని రికాబ్‌గంజ్‌లో 710724, 778784 నెంబర్లలో 3300 గజాల ఎనిమీ ప్రాపర్టీ వివాదంలో ఉందని అధికారులు తెలిపారు. డీఎస్ డియోదీ గాలిబ్ పేరిట స్థలం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర సెపీ అధికారులతోపాటు రాష్ట్ర రెవిన్యూ అధికారులు కలిసి జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

### త్వరలోనే హైదరాబాద్‌లో సెపీ అనుబంధ కార్యాలయం ఏర్పాటు

తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళలో సెపీ అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ముంబై ఆఫీస్ నుండి ఆయా రాష్ట్రాల ఎనిమీ ఆస్తులపై పర్యవేక్షిస్తున్నారు. ఇకపై ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేత, మన్నెం సిరిగిరి, రాజలింగం తదితరులు

# ఎస్సీ వర్గీకరణ గ్రూప్1లోని పంబాల, మన్నె కులాలను తొలగించాలి

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ 1లోని పంబాల, మన్నె కులాలను తొలగించాలని అత్యంత వెనుకబడిన గ్రూప్ 1 కులాలకు 1 శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బేడ బుడగ జంగాల ఐక్య వేదిక అధ్యక్షులు సిరిగిరి మన్నెం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికిఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. వర్గీకరణ అంశం పరిష్కార దిశగా కీలక దశకు చేరిన సమయంలో ఏ వర్గం, కులం అని భేదం లేకుండా అందరికీ న్యాయం జరగాలన్నదే తన ఉద్దేశ్యమన్నారు. అందులో భాగంగానే బేడా బుడగ జంగాలకు న్యాయం జరగాలన్న ప్రయత్నం చేస్తున్నామన్నారు. సంచార జాతులతో గ్రూప్ 1లో చేర్చినాప్పటికీ ఇప్పటికే ఎదిగిన పంబాల, మన్నె కులాలను అందులో చేర్చడాన్ని తాను మొదటినుంచి వ్యతిరేకించానన్నారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వడంతోపాటు మాట్లాడానని తెలిపారు. కీలక దశలో గట్టిగా నిలబడకపోతే ఎలాంటి అన్యాయం జరుగుతుందో అంబేద్కర్ సమయంలో కమ్యునల్ అవార్డు ఉదాహరణ అన్నారు. దళితుల్లోని ప్రతి కులంకోసం తాను రాజీపడ్డానని అన్ని వర్గాల భవిష్యత్తే తనకు ప్రధామన్నారు. మాజీ ఎంపీ డా.బోర్లకుంట వెంకటేష్ నేత మాట్లాడుతూ కొందరికి డబ్బుకు ఇచ్చి సామాజిక మాధ్యమాల్లో తమను అసభ్య పదజాలంతో దూషనలు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారని వారు తమ కుట్రలను మానుకోవాలన్నారు.

# ఆర్మీలో ట్రాన్స్‌జెండర్ల నియామకాలపై నిషేధం!

## అధ్యక్షుడు ట్రంప్ తాజా ఆదేశం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పరిపాలనకు సంబంధించి అనేక కీలకనిర్ణయాలను ప్రకటిస్తున్నారు. మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లను నిషేధించిన ట్రంప్ ఇపుడు ఆదేశ మిలిటరీ విబాగంలో ట్రాన్స్‌జెండర్‌ల నియామకాన్ని నిషేధించారు. ఈమేరకు అమెరికా సైన్యం ఎక్స్‌వేదికగా పోస్టు పెట్టింది. ట్రాన్స్ జెండర్లు సైన్యంలోచేరడాన్ని అమెరికా మిలిటరీ విభాగం నిషేధిస్తోంది. అలాగే సర్వీసులో ఉండగా లింగమార్పిడి విధానాలన కూడా అనుమతించేది లేదని తక్షణమేఈ ఉత్తర్వులు అమలుకువస్తాయని వెల్లడించింది. అమెరికాకు సేవలందించాలనుకునే జెండర్ డిస్ఫోరియా వ్యక్తులను మేం గౌరవిస్తామని, తమను తాము ట్రాన్స్‌జెండర్‌గా భావించేవారి నియామకాలను ఆపేస్తున్నట్లు పోస్టులో ఆర్మీ వివరించారు. ఇప్పటికే సర్వీసులో ఉన్నవారు లింగమార్పిడ ిచేయించుకోడానికి సంబంధించిన వైద్యప్రక్రియలు కూడా నిలిపివేస్తున్నట్లు తేలింది. ట్రంప్ తొలిసారి అదికారంలోకి వచ్చిన సమయంలోట్రాన్స్‌జెండర్లు సాయుధ దళాల్లో చేరకుండా ఉత్తర్వులు జారీ చేసారు. అప్పటికే మిలిటరీలో పనిచేస్తున్నవారిని కొనసాగించారు. ఇక ప్రమాణస్వీకారానికి ముందు నిర్వహించిన ర్యాలీలో మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తానని ట్రంప్ అన్నారు. ఆ దిశగా ఇటీవల కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలుచేసారు. తాజాగా ఆర్మీలో ట్రాన్స్‌జెండర్లనియామకం కూడా ఇపుడు తొలగించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులపై రిపబ్లికన్ పార్టీనేతలు తీవ్రమైన అభిప్రాయాలు వినిపిస్తారు. కొన్నినెలలక్రితం ఒలింపిక్స్ వేదికగా అల్జీరియాకుచెందిన ఇమానె ఖలీఫ్‌కు సంబంధించి లింగవివాదం నడిచింది. అమెరికా మాజీ అద్యక్షుడుగా ఉన్న డొనాల్డ్‌ట్రంప్‌కూడా మహిళల ఆటల్లో పురుషులులేకుండాచేస్తానని అన్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచిన డెమొక్రటిక్ సభ్యురాలు, ట్రాన్స్‌జెండర్ సారా మెక్‌బ్రైడ్‌ను మహిలల బాత్‌రూమ్‌లోకి అనుమతించబోమని రిపబ్లికన్లప్రత్యేక తీర్మానంచేయడం గమనార్హం.

# ముగిసిన మస్తాన్‌సాయి పోలీసు కస్టడీ

## వైద్య పరీక్షల తర్వాత కోర్టులో హాజరుపరచిన పోలీసులు

### కొన్నింటికే సమాధానం చెప్పి.. చాలా ప్రశ్నలకు మౌనం వహించినట్లు సమాచారం

**హైదరాబాద్ (నార్సింగి), ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** యూట్యూబర్ మస్తాన్ సాయి మూడురోజుల పోలీసు కస్టడీ శనివారంతో ముగిసింది. లావణ్య ఫిర్యాదు మేరకు సైబర్ నేరం, లైంగిక వేధింపులు, అత్యాచారం, హత్యాయత్నం, బ్లాక్ మెయిలింగ్ వంటి కేసుల్లో జైలుకెళ్లిన మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజుల పాటు తమ కస్టడీలో ఉంచుకొని తమదైన శైలిలో విచారించారు. నార్సింగి పోలీసులు, నార్కోటిక్ పోలీసులు సంయుక్తంగా మస్తాన్‌ను వివిధ కోణాల్లో విచారించారు. అమ్మాయిలు, మహిళల నగ్నవిడియోలు ఎందుకు తీస్తున్నావు? ఆ వీడియోలను ఏమి చేస్తున్నావు? అని పోలీసులు ప్రశ్నిస్తే... నేను ఎవరి వీడియోలు తీయలేదని, నా భార్యతో హనీమూన్ సమయంలో తీసుకున్న వీడియోలని బుకాయించాడు. దీంతో లావణ్య పోలీసులకు అందించిన హార్డ్ డెస్క్‌ను ఓపన్ చేసి మస్తాన్‌కు చూపిస్తూ ప్రశ్నించడంతో మౌనం దాల్చినట్లు తెలిసింది. ఇన్ని విడియోలు తీసుకొని వాటిని ఏమి చేస్తున్నావు? ఏ అశ్లీల సైట్లకు విక్రయిస్తున్నావు? అని అడిగినట్లు సమాచారం. ఇప్పటి వరకు ఎంత మంది మహిళల వీడియోలు తీశావు? వాటిని మహిళలు మత్తులో ఉండగా తీశావా? వారికి తెలిసే తీశావా? అని ఆరా తీశారు. డ్రగ్స్ పార్టీలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశావు? నీకు డ్రగ్స్ ఎవరు ఇస్తున్నారు? నీవు ఎంత మందికి అమ్ముతున్నావు? ఎంత మందిని ఈ డ్రగ్స్‌కు అలవాటు చేశావు? అని గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. కొన్నింటికి సమాధానాలు ఇచ్చిన మస్తాన్ సాయి చాలా వరకు పోలీసుల ప్రశ్నలకు మౌనమే సమాధానంగా ఇచ్చినట్లు తెలిసింది. తన ఇంట్లో వారాంతాల్లో తెలిసిన వారితో డ్రగ్స్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు మస్తాన్ చెప్పారు. తను మహిళల నగ్న వీడియోలు తీసేందుకు ఐదు కెమెరాలు వాడినట్లు, ఒక్కో మహిళకు ప్రత్యేక ఫోల్డర్ ఏర్పాటు చేసి, అందులో వారి నగ్నవిడియోలు, వాయిస్ కాల్స్ రికార్డింగ్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు ఇలా అన్నింటిని చాలా పకడ్బంధీగా భద్రపరిచినట్లు పోలీసుల విచారణలో తేలింది. డ్రగ్స్‌కు అలవాటు పడ్డ మహిళల వీక్‌నెస్‌ను ఆసరాగా చేసుకొని వారితో తన కామ వాంఛలు తీర్చుకొని, మహిళలకు తెలియకుండా వీడియోలు తీసుకొని, ఆ తరువాత వారికి చూపించి బ్లాక్‌మేయిలింగ్ చేసినట్లు మస్తాన్ పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నార్సింగి పోలీసులు శనివారం మధ్యాహ్నం మస్తాన్ సాయికి వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టులో హాజరు పరిచారు. కోర్టు అతడిని చంచల్‌గూడా జైలుకు తరలించింది.

# అటు ముగ్గురు ఇజ్రాయెల్ బందీలు.. ఇటు 369 మంది పాలస్తీనా బందీల విడుదల

**గాజాసిటీ, ఫిబ్రవరి 15:** కాల్పులవిరమణ ఒప్పందంలో భాగంగామరో ముగ్గురు బందీలను హమాస్ విడుదలచేసి రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించింది. సాగుయ్‌డెకెల్‌చెన్, అలెగ్జాండర్ ట్రుఫనోవ్, యైర్ హార్న్‌లను విడుదలచేసినట్లు అధికారులు తెలిపారు. కాల్పుల విరమణన ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ బందీల విడుదలను ఆలశ్యం చేస్తున్నట్లు హమాస్‌ప్రకటించింది. ఈ ప్రకటనపై అమెరికా



అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తోసహా ఇజ్రాయెల్ తీవ్రంగా పరిగణించింది. ఈ వారాంతంలో తమ బందీలను విడుదలచేయకపోతే తీవ్రపరిణామాలు తప్పవని హెచ్చరించింది. దీనితో మిలిటెంట్ సంస్థ బందీల విడుదలకు అంగీకరించింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ 369 మంది పాలస్తీనియన్లను విడుదలచేసింది. ఖతార్ ఈజిప్టు మధ్యవర్తిత్వంతో గతనెల ఇజ్రాయెల్ హమాస్‌లమధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు వచ్చింది. హమాస్ తమ చెరలోని 94 మంది బందీల్లో 33 మంది బందీలను విడుదలచేస్తుంది. ప్రతిగా సుమారు 1700 మందికిపైగా పాలస్తీనీయలకు తమ జైళ్లనుంచి ఇజ్రాయెల్ విముక్తికల్పిస్తుంది. ఈ ఒప్పందంలో భాగంగా దఫదఫాలుగా 21 మంది ఇజ్రాయెల్ బందీలను మిలిటెంట్ సంస్థ విడుదలచేయగా 730 మంది పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ విముక్తికల్పించింది. తాజాగా 369 మంది పాలస్తీనా వాసులను ఇజ్రాయెల్ విడుదలచేసింది. వీరంతా 30 ఏళ్లుగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్నట్లు చెప్పారు. అయితేఈ విడుదల సందర్భంగా ఇజ్రాయెల్ తమ దేశస్తులకు ఇచ్చిన జైలు దుస్తులపై హమాస్‌ను కించపరిచే పరోక్ష వ్యాఖ్యలుండటంపై విమర్శలుచేసింది. ఇజ్రాయెల్ జైళ్లలోగోతోపాటు డేవిడ్ స్టార్ మేం మరిచిపోం మేం క్షమించం అన్న నినాదాలు రాసి ఉన్న షర్టులను పాలస్తీనా బందీలకు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఖైదీలపై ఇలాంటి అరబిక్ నినాదాలు ఉండకూడదని హమాస్ నిరసన ప్రకటించింది. ఇది జాత్యహంకారానికి నిదర్శనమని, మానవతావాద చట్టాలకు విరుద్ధంగా ఉందని ఈ చట్టాలను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని అన్నారు. ఇజ్రాయెల్‌లో బందీలుగా ఉన్న గాజా పౌరులు రమల్లా నగరానికి రాగానే గాజావాసులు ఆనందోత్సాహాలతో వారికి స్వాగతం పలికారు. బందీలను భుజాలపైకి ఎత్తి ఎగరవేస్తూ హర్షంప్రకటించారు. అలాగే హమాస్ చెరలో ఉన్న ముగ్గురు ఇజ్రాయెలీ వాసులను ఖాన్‌యూనిస్‌వద్ద మిలిటెంట్లు రెడ్‌క్రాస్‌కు అప్పగించారు.

## చెస్ గ్రాండ్ స్లామ్‌లో.. వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ ఓటమి




**న్యూఢిల్లీ:** జర్మనీలోని జరుగుతున్న ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్‌లో ప్రపంచ చెస్ ఛాంపియన్ డీ గుకేశ్ ఓటమి చెందాడు. ఇరానియన్-ఫ్రెంచ్ గ్రాండ్ మాస్టర్ అలిరేజా ఫిరౌజాతో జరిగిన మ్యాచ్‌లో పరాజయం పాలైన గుకేశ్ ఆ టోర్నీలో చిట్ట చివరి స్థానంలో నిలిచాడు. హాంబర్గ్‌లోని విసెనౌస్ రిసార్టులో జరుగుతున్న టోర్నీలో అతను ఒక్క గెలుపు కూడా లేకుండా ముగించేశాడు. తొలి రోజు మ్యాచ్‌ను డ్రాగా ముగించినా, ఆ తర్వాత అతను కోలుకోలేకపోయాడు.

లోకల్ ఫెవరేట్ ప్లేయర్ విన్సెంట్ కీమర్ తొలి ఎడిషన్ ట్రోఫీని గెలుచుకున్నాడు. అయితే ఫిడే మాత్రం ఫ్రీస్టయిల్ చెస్ టోర్నీకి గుర్తింపు ఇవ్వలేదు.

## జింబాబ్వే విజయం

### తొలి వన్డేలో 49 పరుగుల తేడాతో ఓడిన ఐర్లాండ్



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను జింబాబ్వే విజయంతో ఆరంభించింది. ఏకైక టెస్టులో ఐర్లాండ్ చేతిలో పరాజయం పాలైన జింబాబ్వే తొలి వన్డేలో దానికి బదులు తీర్చుకుంది. హరారే వేదికగా శనివారం జరిగిన తొలి వన్డేలో జింబాబ్వే 49 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. మొదట జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (163 బంతుల్లో 169; 20 ఫోర్లు, 3 సిక్సు) భారీ సెంచరీతో కదంతొక్కాడు.

ఓపెనర్‌గా బరిలోకి దిగిన బెనెట్ చివరి ఓవర్ వరకు క్రీజులో నిలిచి జట్టుకు భారీ స్కోరు సాధించి పెట్టాడు. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (61 బంతుల్లో 66; 3 ఫోర్లు, 4 సిక్సు) బెనెట్‌కు చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరు ఐర్లాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 46 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టిర్లింగ్ (32), క్యాంపెర్ (44), టెక్టర్ (39), టకర్ (31), డాక్రెల్ (34), మెక్‌బ్రైన్ (32) తలా కొన్ని పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్బానీ నాలుగు వికెట్లు, ఎన్‌గరవా మూడు వికెట్లు పడగొట్టారు. బెనెట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం రెండో వన్డే జరగనుంది.

## ట్రై సిరీస్‌లో సొంతగడ్డపై పాక్‌కు పరాభవం

### 5 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

**న్యూఢిల్లీ:** చాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్ కంటే ముందు పాకిస్తాన్ జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ దుమ్ము లేపింది. స్వదేశంలో జరిగిన వన్డే ట్రై సిరీస్‌లో పాకిస్తాన్ దారుణంగా ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టుపై ఏకంగా 5 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో వారి సొంత గడ్డపై న్యూజిలాండ్ ట్రై సిరీస్ గెలిచి పాకిస్థాన్‌కు డేంజర్ బెల్స్ పంపింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో డేవాన్ కాన్వే మిచెల్, కేన్ మామ, లాతమ్ అందరూ సమిష్టిగా రాణించడంతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. రచిన్ రవీంద్రా లాంటి ఆల్ రౌండర్ లేకపోయినా ఇక అటు స్వదేశంలో ఛాంపియన్స్ ట్రోఫీ కంటే ముందు వన్డే ట్రై సిరీస్ ఓడిపోయిన పాకిస్తాన్ మరింత ప్రెషర్ లోకి వెళ్ళింది. సౌత్ ఆఫ్రికా, పాకిస్తాన్ అలాగే న్యూజిలాండ్ మధ్య ట్రై సిరీస్ ఇటీవల ప్రారంభమైంది. అయితే ఇందులో సౌత్ ఆఫ్రికా ఎలిమినేట్ కాగా, పాకిస్తాన్ అలాగే న్యూజిలాండ్ ఫైనల్ కు చేరాయి. ఈ ఫైనల్ మ్యాచ్ ఇవాళ మధ్యాహ్నాం ప్రారంభమైంది. కరాచీలోని నేషనల్ స్టేడియంలో ఈ ఫైనల్ మ్యాచ్ జరిగింది.



ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ అత్యల్ప స్కోరు చేయగలిగింది. 49.3 ఓవర్లు ఆడిన పాకిస్తాన్ టీమ్ 242 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. పాక్ బ్యాటర్లలో ఆ జట్టు కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘ, తాహిర్ మినహా ఏ బ్యాట్స్మెన్ కూడా పెద్దగా రాణించలేదు. టాప్ ఆర్డర్ దారుణంగా విఫలమైంది. పాకిస్తాన్ డేంజర్ ఆటగాడు బాబర్ అజాం ఈ వన్డే ట్రై సిరీస్ లో అత్యంత దారుణమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ మ్యాచ్‌లో అయినా రాణిస్తాడు అనుకున్న బాబర్ అజాం 29 పరుగులకే అవుట్ అయ్యాడు. రిజ్వాన్ 46 పరుగులు చేయగా, సల్మాన్ 45 పరుగులు చేసి రాణించాడు. అటు తాహిర్ 38 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. ఈ తరుణంలోనే 242 పరుగులు మాత్రమే చేసింది పాకిస్తాన్. న్యూజిలాండ్ బౌలర్లలో విలియం 4 వికెట్లు పడగొట్టి పాక్‌కు చుక్కలు చూపించాడు. అలాగే బ్రేస్ వెల్, మిచెల్ శాంట్నర్ తలో 2 వికెట్లు తీశారు. ఇక ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ జట్టు ఆచితూచి ఆడింది. పాకిస్తాన్ ఇచ్చిన టార్గెట్‌ను 45.2 ఓవర్లలో ఫినిష్ చేసింది. కేవలం 5 వికెట్లు నష్టపోయిన న్యూజిలాండ్ జట్టు 243 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో వన్డే ట్రై సిరీస్ గెలుచుకుంది న్యూజిలాండ్. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ కంటే ముందు ఈ సిరీస్ గెలుచుకొని. అన్ని జట్లకు డేంజర్ బెల్స్ పంపింది కివీస్. ఛాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్ కు ఆతిథ్యం ఇవ్వనున్న పాకిస్తాన్ సొంత గడ్డపై ఈ ట్రై సిరీస్ ఓడిపోవడం చాలా బాధాకరం.



## గ్రేటెస్ట్ ఆల్‌రౌండర్లు

### బ్యాట్, బాల్‌తో ఫైరింగ్

### జాబితాలో ఇద్దరు భారత్ క్రికెటర్లు

**న్యూఢిల్లీ:** ఏ క్రికెట్ జట్టుకైనా చురకత్తుల్లాంటి ఆల్ రౌండర్లే ప్రధాన బలం. టీమ్ అవసరాల మేరకు అటు బంతి, ఇటు బ్యాటుతో ఫైరింగ్ చేసి రాణించగలరు. టెస్టులు, వన్డేలు, టీ20లు ఏ ఫార్మాట్‌లో అయినా ఆల్‌రౌండర్‌లు చాలా కీలకం. కొందరు బ్యాటర్‌గా మొదలై బౌలింగ్ స్కిల్స్ మెరుగుపరచుకుంటారు. ఇంకొందరు బౌలర్‌గా వచ్చి బ్యాటింగ్ అందిపుచ్చుకుంటారు. అయితే చరిత్రలో 2విభాగాల్లో సమానంగా రాణించిన క్రికెటర్లు అరుదుగాఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో కేవలం ఆరుగురు ఆల్ రౌండర్లు మాత్రమే 6000కుపైగా పరుగులుచేసి 600వికెట్లకు పైగా తీయగలిగారు. ఈ జాబితాలో భారత ఆటగాళ్లు ఇద్దరికి చోటు దక్కటం విశేషం. బంగ్లాదేశ్‌కు చెందిన క్రికెటర్ షకీబ్ అల్ హసన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 14,730 పరుగులు చేశాడు. బంగ్లా తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో ఆటగాడు. అలానే 712 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. షకీబ్ తనకెరీర్‌లో 14 సెంచరీలు చేయగా, 25 సార్లు ఐదు వికెట్ల పెర్ఫామెన్స్ చేశాడు. తర్వాత స్థానంలో టీమిండియా ఆల్‌రౌండర్లలో టాప్ కపిల్ దేవ్‌దే కావడం విశేషం. 1983లో టీమిండియాకి వరల్డ్ కప్ అందించిన కెప్టెన్. కపిల్ తన కెరీర్‌లో 9,031 పరుగులు చేశాడు. ఇందులో 9 సెంచరీలు ఉన్నాయి. బౌలర్‌గా 687 వికెట్లు తీశాడు. 25 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఇక షాన్ పొలాక్ దక్షిణాఫ్రికా అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడు. దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. పొలాక్ మొత్తంగా 829 వికెట్లు తీశాడు. ఇందులో 21 ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. పొలాక్ బౌలింగ్‌తో పాటు నమ్మకమైన లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. అతడి కెరీర్‌లో 7,386 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు ఉన్నాయి. తర్వాత స్థానంలో డేనియల్ వెట్టోరి న్యూజిలాండ్ గొప్ప స్పిన్నర్లలో ఒకడు. కెరీర్‌లో 705 వికెట్‌లు తీశాడు. 22 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. న్యూజిలాండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్. స్పెషలిస్ట్ బౌలర్‌గా అయినా సరే కెరీర్‌లో 6,989 పరుగులు చేశాడు. అందులో 6 సెంచరీలు ఉన్నాయి. కాగా రవీంద్ర జడేజా టీమ్‌ఇండియా టాప్ ఆల్‌రౌండర్‌లలో ఒకడు. అతడు 17 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఏకంగా 603 వికెట్లు పడగొట్టాడు. 4 సెంచరీలతో సహా 6,664 పరుగులు చేశాడు. ప్రస్తుత తరంలో కూడా అత్యుత్తమ ఆల్ రౌండర్‌గా కొనసాగుతున్నాడు. చివరిగా పాకిస్థాన్ తరఫుర వసీం అక్రమ్ బంతి, బ్యాటుతో రాణించాడు. కెరీర్‌లో 916వికెట్లు పడగొట్టాడు. 31 సార్లు ఐదు వికెట్లు తీశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన పాకిస్థాన్ బౌలర్‌గా నిలిచాడు. 3 సెంచరీలతో 6,615 పరుగులు చేశాడు.

## ముగిసిన జాతీయ క్రీడలు

### ఓవరాల్ ఛాంపియన్‌గా ఎస్ఎస్‌సిబి

### 18వ స్థానంలో ఏపి, 26లో తెలంగాణ

**ఢిల్లీ:** ఉత్తరాఖండ్లో అలరించిన జాతీయ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. తదుపరి మేఘాల య జాతీయ క్రీడల ఆతిథ్యానికి సిద్ధం కానుంది. 2027లో అక్కడ 39వ నేషనల్ గేమ్స్ జరుగనున్నాయి. మేఘాలయ ముఖ్యమంత్రి కొంగ్కల్ సంగ్మా క్రీడాజ్యోతి అందుకోవడంతో దీనికి సంబంధించిన లాంఛన ప్రకియ కూడా ముగిసింది. ఉత్తరాఖండ్‌లో 18 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన ఈ 38వ జాతీయ క్రీడలు-25లో 121 పతకాలతో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ (ఎస్ఎస్‌సిబి) ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఇందులో 68 స్వర్ణాలు, 26 రజతాలు మరియు 27 కాంస్య పతకాలు ఉన్నాయి. గత ఆరు జాతీయ క్రీడల్లో ఎస్ఎస్‌సిబి అగ్రస్థానాన్ని గెలుచుకోవడం ఇది ఐదవసారి. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అనేది భారత సాయుధ దళాలచే నిర్వహించబడే ఒక స్పోర్ట్స్ బోర్డు. ఇది 1919లో ఆర్మీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్‌గా ఏర్పడి, తరువాత సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్‌గా పేరు మార్చబడింది. ఈ బోర్డు నేషనల్ గేమ్స్ ఆఫ్ ఇండియా, డ్యూరాండ్ కప్ మరియు బహుళ ప్రాంతీయ క్రీడా కార్యక్రమాలలో సర్వీసెస్‌గా ప్రాతినిధ్యం వహిస్తోంది. కాగా ఈ 38 జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర అత్యధికంగా 198 పతకాలు గెలిచినప్పటికీ పసిడి వేట (54



స్వర్ణాలు)లో వెనుకబడిపోవడంతో రెండోస్థానంలో నిలిచింది. 71 రజతాలు, 73 కాంస్యాలు మరాఠా క్రీడాకారులు చేజిక్కించుకున్నారు. ఇక హరియాణా 153 పతకాలు (48 స్వర్ణం, 47 రజతాలు, 58 కాంస్యాలు)తో మూడో స్థానంలో నిలువగా, ఆతిథ్య ఉత్తరాఖండ్ 103 పతకాలు (24 స్వర్ణాలు, 35 రజతాలు, 44 కాంస్యాలు) సాధించి ఏడో స్థానంలో నిలిచింది. అలాగే ఆంధ్రప్రదేశ్ 14 పతకాలుతో ( 7 స్వర్ణం, 1 రజతం, 6 కాంస్యం) 18వ స్థానంలోను, తెలంగాణ 18 పతకాలతో ( 3 స్వర్ణం, 3 రజతం, 12 కాంస్యం) 26వ స్థానంలో నిలిచాయి. చివరిగా 31 స్థానంలో 2 పతకాలు ( 1 రజతం, 1 కాంస్యం)తో పుదుచ్చేరి, నాగాలాండ్ 2 పతకాలు ( 2 కాంస్యం)తో 32వ స్థానం, సిక్కిం 2 పతకాలు (2 కాంస్యాలు)తో 33వ స్థానంలో నిలిచాయి.

## టన్నుల కొద్దీ ఆర్‌బిఐ పసిడి కొనుగోళ్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** 2024లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 73 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో బంగారం కొనుగోలులో ప్రపంచవ్యాప్తంగా మూడవ అతిపెద్ద సంస్థగా నిలిచింది. కరెన్సీ అస్థిరతతో పాటు రీవాల్యుయేషన్ నష్టాన్ని తగ్గించే ఉద్దేశంతో నిల్వలను వైవిధ్య పరచడానికి ఆర్‌బీఐ బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. జనవరి 31 నాటికి భారతదేశ విదేశీ మారక నిల్వలు 630.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అందులో బంగారం భాగం దాదాపు 70.89బిలియన్ల డాలర్లున్నాయి. ఈ విలువ క్రమంగా పెరుగుతుంది. డిసెంబర్ 2024 చివరి నాటికి ఆర్‌బీఐ వద్ద బంగారం నిల్వ 876.18 టన్నులుగా ఉంది. కేంద్ర బ్యాంకులు సాధారణంగా ప్రపంచ బులియన్ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, ఇతర కేంద్ర బ్యాంకులు అలాగే బులియన్‌డీలర్ల నుంచి బంగారాన్ని కొనుగోలు చేస్తాయి.



ఆర్‌బీఐ 2009లో అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 200 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అప్పటినుంచి కొనుగోళ్లు చిన్న విడతలుగా జరిగాయి. ఆ తర్వాత 2024లో కొనుగోలు చేసిన బంగారమే రెండో స్థానంలో ఉంది. కేంద్ర బ్యాంకులు సాధారణంగా బంగారాన్ని వాణిజ్య, బులియన్ బ్యాంకులు, డీలర్లు, ఓపెన్ మార్కెట్ అలాగే రిఫైనర్లకు విక్రయిస్తాయి. అనేక బ్యాంకులు బంగారాన్ని విక్రయిస్తున్నప్పటికీ అవి నికర కొనుగోలుదారులుగా ఉన్నాయి. అయితే ఆర్‌బీఐ చాలా ఏళ్ల నుంచి బంగారాన్ని విక్రయించలేదు. 1991లో విదేశీ మారక ద్రవ్య సంక్షోభం సమయంలో, ఆర్‌బీఐ తన బంగారం నిల్వల్లో కొంత భాగాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు 405 మిలియన్ల డాలర్ల రుణం పొందడానికి తాకట్టు పెట్టింది. అదే సంవత్సరంలో రుణాన్ని తిరిగి చెల్లించినప్పటికీ, ఆర్‌బీఐ బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాల్లోనే ఉంచింది. ప్రపంచంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ అతిపెద్ద బంగారు ఖజానాల్లో ఒకటి కలిగి ఉంది. ఇక్కడే అనేక కేంద్ర బ్యాంకులు బంగారాన్ని నిల్వ చేస్తాయి. యుఎస్ ఫెడరల్ రిజర్వ్ కూడా పెద్ద ఖజానాలను కలిగి ఉంది. విదేశాల్లో నిల్వ చేసిన బంగారాన్ని వ్యాపారం చేయడానికి, స్వాప్‌లలో ప్రవేశించడానికి, రాబడిని సంపాదించడానికి సులభంగా ఉపయోగించవచ్చు. అయితే గత సంవత్సరం ఆర్‌బీఐ విదేశీ ఖజానాల నుంచి 202 టన్నుల బంగారాన్ని తరలించింది.


## మెటా ఇండియా సముద్రగర్భ కేబుల్ ప్రాజెక్ట్

**ముంబై, ఫిబ్రవరి 15:** గ్లోబల్ డిజిటల్ కనెక్టివిటీని పెంపొందించే లక్ష్యంతో భారతదేశం, యునైటెడ్ స్టేట్స్ కలిపి భారతదేశం, యునైటెడ్ స్టేట్స్ కలిపి ప్రాజెక్టును ఆవిష్కరించేందుకు మెటా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్ కోసం బిలియన్ పెట్టుబడికి సిద్ధంగా చూపబడింది. 50,000 కిటికీలకు పైగా విస్తరించి ఉన్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రపంచంలోనే అతి పొడవైన, అత్యధిక సామర్థ్యం కలిగిన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థగా అవతరిస్తుంది. ప్రాజెక్ట్ వాటర్‌వర్త్‌గా పిలిచే ఈ సముద్రగర్భ కేబుల్ ప్రాజెక్టు భారత్, అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇతర కీలక ప్రాంతాలను కలుపుతుంది. మెటా అప్లికేషన్‌లు, సర్వీస్‌లను మెరుగుపరిచేందుకు ఈ ప్రాజెక్ట్‌ని అందించే కీలకపాత్ర అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్ట్ పనులు ఈ ఏడాది ప్రారంభం కానున్నాయని, వచ్చే ఐదేళ్లలో ఇది పూర్తవుతుందని అంచనా వేస్తుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఈ సమయంలో ఇలాంటి ప్రకటనలు రావడం చర్చనీయాంశమైంది. కంపెనీ రూటింగ్ అనే కొత్త సాంకేతికత ద్వారా 7,000 మీటర్ల సముద్ర లోతులో కేబుళ్లను ఏర్పాటు చేస్తారని మెటా ప్రతినిధి తెలిపారు. షిప్ లంగర్లు, ఇతర ప్రమాదాల నుంచి నష్టాన్ని నివారించడం కోసం హైరిస్క్ పాల్ట్‌లో మెరుగైన టెక్నిక్‌లు ఉపయోగించబోతున్నట్లు చెప్పారు. ఈ సాంకేతిక ఆవిష్కరణ ఇండియాలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ సేవలకు, సేవలకు మద్దతు ఇవ్వడానికి, వాటిలో సాంకేతికతను ప్రోత్సహించడానికి కంపెనీ నిబద్ధతను చెబుతుంది.



## లైసెన్స్‌లు వెనక్కి ఇచ్చేసిన ఎన్‌బిఎఫ్‌సిలు

**ముంబై, ఫిబ్రవరి 15:** రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, ఐడీఎఫ్సీ లిమిటెడ్ తమ ఎన్బీఎఫ్సీ లైసెన్స్‌లను వెనక్కి తీసుకునేశాయి. ఇలా మొత్తం 20 బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్బీఎఫ్సీలు) సర్టిఫికెట్ ఆఫ్ ఒప్పంద (సీవోఆర్)లను స్వాధీనం చేసుకున్నట్టు ఆర్బీఐ ప్రకటించింది. ఇందులో మనోపే ఇన్వెస్ట్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎన్బీఎఫ్సీ వ్యాపారం నుంచి తప్పుకున్నాయి. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్, ఐడీఏఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్ కంపెనీ లిమిటెడ్‌కి చెందిన 16 సంస్థల విలీనాల కారణంగా సీవోఆర్ స్వాధీనం చేసుకున్నారు. వీటికి అదనంగా ఆర్బీఐ తనంతటగా 17ఎన్డీఎఫ్ సీల సీవోను రద్దు చేసింది. వీటి రిజిస్టర్డ్ కార్యాలయం పశ్చిమబెంగాల్‌లో ఉన్నట్టు ఆర్బీఐ విడుదల. మరోవైపు కామదేను ఫైనాన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించినట్లు ప్రకటించింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) అనేది కంపెనీల చట్టం, 1956 కింద నమోదైన ఒక కంపెనీ. ఇది రుణాలు ఇవ్వడం, ప్రభుత్వం, స్థానిక సంస్థలకు జారీ చేసిన షేర్లు, స్టాక్‌లు, బాండ్లు, డిబెంచర్లు, సెక్యూరిటీలను కొనుగోలు చేయడం, బీమా వ్యాపారం, చిట్ వ్యాపారం వంటి కార్యకలాపాలలో నిమగ్నమై ఉంటుంది. ఎన్బీఎఫ్సీలు రుణాలు ఇస్తాయి. పెట్టుబడులు పెడతాయి, కాబట్టి వాటి కార్యకలాపాలు బ్యాంకుల కార్యకలాపాలను పోలి ఉంటాయి. అయితే వీటి మధ్య కొన్ని తేడాలు ఉన్నాయి. ఎన్బీఎఫ్‌సీ డిపాజిట్లను అంగీకరించదు. ఎన్డీఏసీలు చెల్లింపు, సెటిల్మెంట్ వ్యవస్థలో భాగం కావు. తమపైనే చెక్కలను జారీ చేయలేవు. బ్యాంకులతో పాటు డిపాజిట్ ఇన్‌ఫూరెన్స్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఎన్‌బిఎఫ్‌సిల డిపాజిటర్లకు అందుబాటులో లేదు.




## 11 లిస్టింగ్‌లు..ఒక్కటే సబ్‌స్క్రిప్షన్

**ముంబై, ఫిబ్రవరి 15:** వచ్చే వారం కూడా స్టాక్ మార్కెట్లో లిస్టింగ్‌లో సందడి కొనసాగనుంది. మార్కెట్ నుంచి నిధుల సమీకరణ పూర్తి చేసుకున్న సంస్థలు వచ్చే వారం స్టాక్ మార్కెట్‌కి ఎంట్రీ ఇవ్వనున్నాయి. మొత్తం 11 కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. కేవలం ఒక్క సంస్థ మాత్రమే నిధుల సమీకరణకు రానుంది. ఎస్ఎంఈ విభాగం నుంచి బీజాసన్ ఎక్స్‌టెక్ లిమిటెడ్ (రాబోయే ఐపిఒ) సబ్‌స్క్రిప్షన్ వచ్చేవారం ప్రారంభం. పేలుడు పదార్థాలు, పేలుడు ఉపకరణాలు తయారుచేసే బీజాసన్ ఎక్స్‌టెక్ లిమిటెడ్ సంస్థ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఎస్ఎంఈ నుంచి వస్తున్న ఈ ఐపీఓ స్టాక్ మార్కెట్ నుంచి రూ.59.33 కోట్ల నిధులను సమీకరించబోతోంది. పూర్తిగా తాజా షేర్ల జారీ ద్వారా ఇష్యూ నిర్వహించబడు తుంది. 34.25 లక్షల తాజా షేర్లు జారీ చేయనున్నారు. ధరల శ్రేణి రూ.165-175గా నిర్ణయించింది. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 21న ప్రారంభమై 25తో ముగుస్తుంది. మెయిన్ బోర్డ్ నుంచి వచ్చిన అజాక్స్ ఇంజినీరింగ్ షేర్లు 17 ఫిబ్రవరిన దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఇదే విధంగా హెక్సావేర్ టెక్నాలజీ ఫిబ్రవరి 19న, క్వాలిటీ పవర్ ఫిబ్రవరి 21న జాబితా కానున్నాయి. ఎస్ఎంఈ విభాగం నుంచి చందన హెల్త్ కేర్ షేర్లు (ఫిబ్రవరి 17), పీఎస్ రాజ్ స్టీల్ (ఫిబ్రవరి 19), వోలర్ కార్ (ఫిబ్రవరి 19), మ్యాక్స్ వల్ట్ ఎనర్జీ (ఫిబ్రవరి 19), ఎల్.కె. మెహతా పాలిమర్స్ (ఫిబ్రవరి 20), షణ్ముగ హాస్పిటల్స్ (ఫిబ్రవరి 20), తేజస్ కార్గో (ఫిబ్రవరి 21), రాయలార్క్ ఎలక్ట్రోడ్స్ (ఫిబ్రవరి 21)న స్టాక్ ఎక్స్‌చెంజీలో జాబితా కానున్నాయి.




## వాణిజ్యం

## ఆటోమొబైల్ ఉత్పత్తులపైనా టారిఫ్‌లు: ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 15:** పరస్పర పన్నుల విషయంలో వెనక్కి తగ్గబోనని ఇప్పటికే ప్రకటించిన నూతన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (డొనాల్డ్ ట్రంప్) మరో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. దిగుమతి చేసుకొనే కార్లపైసుంకాలు విధించే యోచనలో ఉన్నాయని తెలిపారు. అయితే ఆటోమొబైల్ ఉత్పత్తులన్నింటిపైనా సుంకాలు విధిస్తారా? లేదా అనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఆదాయాన్ని పెంచడానికి, వాణిజ్య అసమతుల్యతను దిగుమతి చేసుకొనే కార్లపై సుంకాలు విధించడం ఓ మార్గమని ట్రంప్ సూచన. ఏప్రిల్ 2 న్నుచి ఆటోమొబైల్ ఉత్పత్తులపై టారిఫ్‌లు ఉండొచ్చని ఆయన చెప్పారు. అయితే వివరాలను పూర్తి వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇదిలాఉండగా, అమెరికాలో అమ్ముడవుతున్న కార్లలో దాదాపు 50శాతం దేశంలోనే తయారవుతాయి. ఆటోమొబైల్ ఉత్పత్తుల దిగుమతుల్లో సగం మెక్సికో, కెనడా ఇతర దేశాలనుంచి వస్తున్నాయి. జపాన్, దక్షిణకొరియా, జర్మనీ నుంచి కొంత మేరకు దిగుమతులు ఉన్నా బ్రిటన్, ఇటలీ, స్వీడన్ నుంచి తక్కువగానేఆటోమొబైల్ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. ట్రంప్ సుంకాల విధింపు విధానంతో ఆటో మొబైల్ పరిశ్రమలో గందర గోళం ఏర్పడుతుందని ప్రముఖ ఆటో మొబైల్ ఉత్పత్తుల సంస్థ ఫోర్డ్ (ఫోర్డ్) ఈవో జిమ్ ఫర్లీ తాజాగా పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం సుంకాల పెంపు బెదిరింపులు, ఎలక్ట్రిక్ వాహనాలపై ద్వేషం వల్ల చాలాఖర్చు పెరిగే అవకాశాలున్నాయి. అమెరికాలో వాహనాలతయారీకి ప్రాధాన్యత అని ట్రంప్ చెప్పడానికి టారి ప్రణాళిక కారణంగా 'విధాన అనిశ్చితి' నెలకొందని అభిప్రాయపడ్డారు.



## మొదటి రోజే రూ.8,472 కోట్ల బుకింగ్‌లు

**ముంబై, ఫిబ్రవరి 15:** మహీంద్రా అండ్ మహీంద్రా కొత్త కార్ల కొనగోలు కోసం వినియోగదారుల ఆసక్తి కనబరిచారు. కంపెనీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలకు రికార్డుస్థాయి బుకింగ్‌లు అందినట్లుపేర్కొంది. సంస్థ ఇటీవల ఆవిష్కరించిన ఎక్స్‌ఇవి 9ఇ, బిఇ6ల మొదటిరోజు బుకింగ్‌విలువ రూ.8,472 కోట్లుగా నమోదైంది. సుస్థిర, పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఈ బుకింగ్‌లు హైలైట్ చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో మహీంద్రా సంస్థ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. మహీంద్రా ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృత శ్రేణి వినియోగదారులు అదరిస్తున్నారని మొదటి రోజు బుకింగ్ డేటా సూచిస్తుంది. మొత్తం బుకింగ్స్‌లో ఎక్స్ ఇవి 9ఇ 56 శాతం, బిఇ6 44 శాతం వాటాను దక్కించుకు న్నాయి. రెండు మోడల్స్ విభిన్న కస్టమర్ అవసరాలకు అష్టలకున ప్యాచ రిస్టిక లక్నాలజీ, అదునాతన ఫీచర్లు, లగ్జరీల సౌకర్యాలను కలిగి ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుకింగ్‌లను గుర్తించే 79 కిలోవాట్ల బ్యాటరీని కలిగి ఉన్న టాప్ ఎండ్ వేరియంట్ ప్యాక్ త్రీకి డిమాండ్ అధికంగా ఉన్నట్లు తెలిసింది. మొత్తం బుకింగ్‌లలో ప్యాక్ త్రీ వేరియంట్ 73శాతం వాటాను కలిగి ఉంది. ఇది లాంగ్ రేంజ్ ఎలక్ట్రిక్ సామర్థ్యాన్ని అందించే కంపెనీ వాహనం అని కంపెనీ పేర్కొంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.